



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


ఉప ఎన్నికల్లో అధికార పార్టీలకు చుక్కెదురు

జ్ఞానేష్ కుమార్‌దే కీలకపాత్ర

వృక్షమాత పద్మశ్రీ తిమ్మక్క కన్నుమూత 05


సంపుటి 08, సంచిక: 344 | శనివారం | 15-11-2025 | ఖమ్మం   Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar   పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జయకేతనం

**24,729 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందిన నవీన్ యాదవ్**

నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజారిటీ రికార్డు

డిపాజిట్ కోల్పోయిన బిజెపి అభ్యర్థి దీపక్‌రెడ్డి

ఏ రౌండ్‌లోనూ ఆధిక్యం చూపని బిఆర్ఎస్

16 ఏళ్ల తర్వాత జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా రెపరెపలు

గెలిపించిన ప్రజలందరికీ పాదాభివందనం : నవీన్‌యాదవ్



ప్రజాపక్షం/హైదరాబాద్

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. 16 సంవత్సరాల తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలి రౌండ్ నుంచి చివరి వరకు నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించారు. మొదటి నుంచి చివరి వరకు ఏకపక్ష విజయాన్ని నమోదు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వ్యక్తిగా నవీన్ యాదవ్ నిలిచారు. ఈ ఎన్నికల్లో బిజెపి తరఫున పోటీ చేసిన లంకల దీపక్ రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోలయ్యాయి. బిజెపి అభ్యర్థి దీపక్ రెడ్డి 17,061 ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. జూబ్లీహిల్స్ పోరులో మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ, నోటా 924 ఓట్లతో నాలుగో స్థానంలో నిలవడం విశేషం. లెక్కింపు ప్రక్రియలో ఏ దశలోనూ బిఆర్ఎస్ అభ్యర్థి సునీత కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు పోటీ ఇవ్వలేకపోయారు. రౌండ్ రౌండ్‌కు మెజార్టీని పెంచుకుంటూ నవీన్ యాదవ్ తన గెలుపును ఖాయం చేసుకున్నారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల సంఘం తరువాయి 12లో

## బిహార్‌లో ఎన్‌డిఎకు ఏకపక్ష ఫలితాలు

**ఎన్‌డిఎ – 202 ఘట్‌బంధన్ – 35 ఎంఐఎం – 5**



**పాట్నా:** 'ఓటు చోరీ' ఆరోపణలు... విమర్శలు, ప్రతి విమర్శలతో అట్టుడికిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ విజయం సాధించింది. 243 స్థానాలకుగాను 202 స్థానాల్లో ఆధిక్యాన్ని ప్రదర్శించింది. కాంగ్రెస్, ఆర్‌జెడి తదితర పార్టీలతో కూడిన మహా ఘట్ బంధన్ (ఎంజిబి) 35 స్థానాల్లో మెరుగైన ప్రదర్శననివ్వగా, ఎంఐఎం ఐదు స్థానాలను సొంతం చేసుకున్నది. ఎన్నికల వ్యూహకర్తగా పేరు తెచ్చుకున్న ప్రశాంత్ కిశోర్ పెట్టిన సొంత పార్టీ జన్ సూరజ్ పార్టీ (జెఎస్‌పి) దారుణంగా విఫలమైంది. ఒక్క స్థానంలోనూ ఆ పార్టీ రాణించలేకపోయింది.ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి అభ్యర్థి కావడంతో, విజయంపై ఎంజిబి ఎన్నో ఆశలు పెట్టుకుంది. బిజెపి మొత్తం 101 స్థానాల్లో పోటీ చేయగా, కడపటి వార్తలు అందే సమయానికి 35 స్థానాల్లో గెలుపొందింది. మరో 55 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నది. గత ఏడాది తరువాయి 2లో

### సుపరిపాలనకు విజయం : మోదీ



న్యూఢిల్లీ : బిహార్ ఎన్నికల ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. సుపరిపాలన, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం స్ఫూర్తికి నిదర్శనంగా అభివర్ణించారు. శుక్రవారం ఆయన ఎక్స్‌లో వరుస పోస్టులు చేశారు. బిజెపి కూటమి భాగస్వాములైన బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఎల్‌జెపి ఆర్‌వి అధినేత చిరాగ్ పాస్వాన్, హెచ్ఎఎం నాయకుడు జితన్ రామ్ మాంఝీ, ఆర్ఎల్ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాలను కూడా మోదీ అభినందించారు. '2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎకు చరిత్రాత్మకమైన, అపూర్వమైన విజయాన్ని అందించిన బిహార్ కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అని మోదీ అన్నారు. ప్రజల తరువాయి 2లో

### ఎన్‌డిఎ గెలుపు అనుమానాస్పదం

సమన్వయ లోపానికి తప్పని మూల్యం: బిహార్ ఫలితాలపై డి.రాజా



**న్యూఢిల్లీ:** బిహార్‌లో ఎన్డీయే ఎన్డీయే విజయం సందేహాలభరితమని, ఎన్నికల ఫలితాలు ఆత్మ పరిశీలనను డిమాండ్ చేస్తున్నాయని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఎస్ఐఆర్‌లో భాగంగా 65 లక్షల ఓటర్ల పేర్లు తొలగించడం, ఓటర్ల అసలు సంఖ్య కంటే మూడు లక్షలకుపైగా ఓటర్లు ఉండటం అనేక ప్రశ్నలకు తావిస్తున్నదన్నారు. బిహార్ ఎన్నికల ఫలితాలపై డి.రాజా శుక్రవారం ఎక్స్ మాధ్యమంగా స్పందించారు. ఎన్నికల సంఘం లెక్కలపై అనుమానాలు తరువాయి 2లో

### సమస్యల పరిష్కారమే గెలుపు ఫలితం

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీలపై మరింత దృష్టిసారించాలి : సిపిఐ ● జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం పట్ల హర్షం ● బిహార్‌లో విజయం ఇసిదేనని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. విజ్ఞతతో ఓటు వేసిన ఓటర్లకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఎన్నికల ఫలితాన్ని గమనిస్తే ప్రజా సమస్యల పరిష్కారం అంశంపైనే ఓటర్లు ఓటు వేసినట్లు స్పష్టమవుతున్నదని అన్నారు. స్వయంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనే జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన సొంత పార్టీ బిజెపి అభ్యర్థికి డిపాజిట్ గల్లంతయ్యిందన్నారు. పదేండ్లు అదే నియోజకవర్గం ఎంపిగా ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంలో వైఫల్యం, హైదరాబాద్, తెలంగాణ పట్ల అన్ని రకాలుగా వివక్షత చూపుతున్న కేంద్ర ప్రభుత్వం వైఖరి పట్ల ప్రజలు చూపించిన తీవ్ర వ్యతిరేకతకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం నిదర్శనమన్నారు. పదేండ్లు తరువాయి 2లో

## ఓడితే కుంగిపోం నెగ్గితే ఉప్పొంగం

స్థానిక సంస్థల ఎన్నికలపై ఈనెల 17న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం – సిఎం రేవంత్ రెడి

**ప్రతిపక్షంలో ఉంటే ప్రజాసమస్యలపై పోరాడడం.. అధికారంలో ఉంటే పరిష్కరించడమే తెలుసు**



● జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం మరింత బాధ్యతను పెంచింది ● జిహెచ్ఎంసి ఎన్నికల్లోనూ ఇదే ఫలితాలొస్తాయ్ ● కాంగ్రెస్ పదేళ్లు పాలిస్తుంది.. మార్పు చేసి చూపిస్తాం ● ఇప్పటికైనా కిషన్‌రెడ్డి వ్యవహారశైలి మార్చుకోవాలి ● ప్రభుత్వంపై బిఆర్ఎస్‌ది దుష్ప్రచారం ● హరీశ్‌రావు ఈర్ష, కెటిఆర్ అహంకారం తగ్గించుకోవాలి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారని సిఎం పేర్కొన్నారు. ఎన్నికల్లో నెగ్గితే ఉప్పొంగడం, ఓడితే కుంగిపోవడం కాంగ్రెస్ కు తెలియదని, ప్రతిపక్షంలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాడడం, అధికారంలో ఉంటే సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ పార్టీకి తెలుసునని, అందుకే ప్రజల్లో కాంగ్రెస్‌పై ఇప్పటికీ ఆదరణ తగ్గలేదని సిఎం స్పష్టం చేశారు. ఈ ఫలితాల ద్వారా కాంగ్రెస్ గత రెండేళ్ల పాలనను ప్రజలు పరిశీలిస్తున్నట్లు స్పష్టమైందన్నారు. జిహెచ్ఎంసి ఎన్నికల్లోనూ ఇదే ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని వచ్చే పదేళ్లపాటు కాంగ్రెస్ పరిపాలిస్తుందని, మార్పు చేసి చూపిస్తామని సిఎం అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని కాంగ్రెస్ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులతో తరువాయి 2లో

## ఫలితాలు కొత్త ఊపునిచ్చాయ్

● రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బిఆర్ఎస్ ఒక్కటే ● ఇక ప్రజాసమస్యలపై పోరాటం చేస్తాం ● బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తమకు కొత్త ఉత్సాహం, బలాన్నిచ్చిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నయం బిఆర్ఎస్ ఒక్కటే అని ప్రజలు స్పష్టంగా తీర్పునిచ్చారని తెలిపారు. తెలంగాణ భవన్‌లో కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ ఇకపై ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. వ్యక్తిగత సమస్యలు ఉన్నప్పటికీ పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు ఎంతో ఉత్సాహంగా పనిచేశారన్నారు. గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ సమర్థవంతమైన పాత్ర తరువాయి 12లో

## ప్రజాతీర్పును శిరసావహిస్తాం

● జూబ్లీహిల్స్ ఒక్క కార్పొరేటరూ గెలవలేదు ● ఎంఐఎం సహకరించడంతోనే కాంగ్రెస్ గెలుపు : కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



జూబ్లీహిల్స్‌లో తాము ఎప్పుడూ ఒక కార్పొరేటర్ కూడా గెలవలేదని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నుంచి ఎప్పుడు గెలవలేదన్నారు. ప్రజా తీర్పును తాము శిరసా వహిస్తామన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. తాము ఉన్నంతలో ప్రయత్నం చేశామని చెప్పారు. ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని తెలిపారు. ప్రత్యేక పరిస్థితులలో జూబ్లీహిల్స్ ఎన్నికలు జరిగాయని, తమ పార్టీ అక్కడ బలహీనంగా ఉందని తరువాయి 12లో



## ఎన్‌డిఎ గెలుపు.. కార్మికులకు కష్టాలు

**పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని పిలుపు**

ప్రజాపక్షం/హైదరాబాద్

బిహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి గెలవడంతో కార్మిక వర్గానికి భవిష్యత్‌లో కష్టాలు వస్తాయని, కార్మికవర్గం పటిష్టంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపిచ్చారు.హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఎఐటియుసి అనుబంధ సంఘాల సమావేశం ఎం.డి. యూసఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎంఎల్‌ఎ సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని అందుకు కార్మిక లోకం పోరాటాలు చేయాలని అన్నారు. కార్మికులు బలోపేతం అయ్యి పోరాటాలు నిర్వహిస్తేనే భవిష్యత్ ఉంటుందని, తరువాయి 2లో

### నేటి నుంచి సిపిఐ ప్రచార జాతాలు

జోడేఘాట్ , బాసర, గద్వాల్ నుంచి ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మూడు జాతాలు ప్రారంభం కానున్నాయి. జోడేఘాట్ నుంచి ప్రారంభమయ్యే జాతాకు సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, బాసర నుంచి ప్రారంభమయ్యే జాతాకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, గద్వాల్ నుంచి ప్రారంభమయ్యే జాతాకు సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల నరసింహ నాయకత్వం వహిస్తారు. ఈ జాతాలు వివిధ జిల్లాలలో వారం రోజుల పాటు పర్యటించిన అనంతరం 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమంలో భాగంగా జిల్లాల వారీగా జాతాలను నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో వివరించారు.

## నెహ్రూ సేవలను అవమానిస్తున్నారు!

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ ఫైర్

భారత తొలి ప్రధానిని స్మరించుకున్న దేశం

**న్యూఢిల్లీ :** భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా యావత్ దేశ ప్రజలు ఆయనను స్మరించుకున్నారు. నెహ్రూ 1889లో ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో నవంబరు 14 జన్మించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన ప్రముఖ వ్యక్తులలో ఒకరు. నెహ్రూ మే 27, 1964న తుది శ్వాస విడిచారు. కాగా, నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ అధినేత్రి సోనియా గాంధీ ఢిల్లీలోని శాంతి వాన్‌లోని నెహ్రూ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. ఆధునిక భారతదేశ నిర్మాణంలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన అపారమైన సహకారాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'తిరస్కరించాలని, అవమానించాలని, వక్రీకరించాలని, రాక్షసంగా చూపించాలని' చూస్తున్నారని ఆరోపించింది. ఈ ఆరోపణల నుంచి భారతదేశపు మొదటి ప్రధానమంత్రి తన వారసత్వం ఈ 'దాడి'



నుండి బయటపడాలని పేర్కొంది. నెహ్రూ నివాళి అర్పించిన అనంతరం ఖర్గే మాట్లాడుతూ నెహ్రూ సేవలను ప్రశంసించారు. ఆయన వారసత్వం 'కాలాతీతమైన దీప స్తంభంగా నిలుస్తుంది. భారతదేశ ఆలోచనను , ఆయన గౌరవించిన విలువలు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రకాశవంతం చేస్తుంది' అని అన్నారు. అతని తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పది ఏళ్ల విరామం తర్వాత లండన్‌లో సిరియా ఎంబసీ

**బీరుట్ :** సుమారు పది సంవత్సరాల అనంతరం, సిరియా విదేశాంగ మంత్రి అసాద్ అల్‌జిన్‌పింగ్‌బానీ, తమ దేశ ఎంబసీని లండన్‌లో అధికారికంగా పునఃప్రారంభించారు. బాషర్ అల్‌అసద్ మాజీ అధ్యక్షుడి పదవీ కాలం తర్వాత అంతర్జాతీయ సమాజంలో సిరియా మళ్లీ సంబంధాలు పునరుద్ధరించుకుంటున్నది. ఆ క్రమంలోనే అల్‌జిన్‌పింగ్‌బానీ యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటనకు వచ్చారు. తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా ఇటీవల అమెరికా పర్యటించారు. 1946లో సిరియా స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఒక అధ్యక్షుడు యుఎస్‌లో పర్యటించడం అదే మొదటిసారి. కాగా, లండన్‌లోని చాథం హౌస్ అంతర్జాతీయ వ్యవహారాల తాత్కాలిక సంక్షేమ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో, జిన్‌పింగ్‌బానీ పాల్గొన్నారు. బ్రిటిష్ విదేశాంగ మంత్రి ఇవెట్ కూపర్‌తో జరిగిన భేటీ విజయవంతమైందని ఆయన పేర్కొన్నారు.

## నాలుగు ఐరోపా సంస్థలపై అమెరికా 'ఉగ్ర' ముద్ర



**వాషింగ్టన్ :** వామపక్ష భావాలున్న నాలుగు ఐరోపా విప్లవ సంస్థలపై అమెరికా 'ఉగ్ర' ముద్ర వేసింది. వాటిని ఉగ్రవాద సంస్థలుగా గుర్తించింది. కన్జర్వేటివ్ చార్లీ కిర్క్ హత్య తర్వాత వామపక్ష కార్యకలాపాలాపై కఠినంగా వ్యవహరిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే అమెరికా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ పరిపాలన ప్రతిపాదించిన నా నాలుగు సంస్థల కేంద్రాలు ఐరోపాలోన ఉన్నాయని సమాచారం. వీటికి అమెరికాలో ఎలాంటి కార్యకలాపాలు లేవు. 2003లో అప్పుడు ఉన్న యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు రోమానో ప్రోడీకి పేలుడు ప్యాకేజీలు పంపిన ఇటాలియన్ అనార్కిస్ట్ ఫ్రంట్, ఏథెన్స్‌లో పోలీసు బృందాలు, కార్మిక శాఖ భవనాల వెలుపల బాంబులు వేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెండు గ్రీకు నెట్‌వర్కులతోపాటు జర్మన్ అధికారులపై దాడికి దిగినట్టు పేర్కొంటున్న ఒక యాంటీ ఫాజిన్‌పింగ్‌స్ట్ గ్రూపును అమెరికా ఉగ్ర సంస్థలుగా గుర్తించింది.

ఈ సంస్థలకు అమెరికా నుంచి జరిగే ప్రత్యక్ష లేదా పరోక్ష మద్దతును ట్రంప్ సర్కారు అడ్డుకుంటుంది. ట్రంప్ సర్కారు లక్ష్యంగా ఎంచుకున్న నాలుగు యూరోపియన్ గ్రూపల్లో ప్రధానమైనది ఇంటర్నేషనల్ రివల్యూషనరీ ఫ్రంట్. దీనిని అనార్కిస్ట్ ఫెడరేషన్ అని కూడా పిలుస్తారు. ఇది 2003–04 నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.

ఆర్మ్డ్ ప్రోలెటేరియన్ జస్టిస్ సంస్థపై 2023 డిసెంబరులో ఏథెన్స్ రైటు పోలీసు భవనానికి దగ్గరగా పేలుడు పరికరాన్ని ఉంచినట్టు ఆరోపణలు ఉన్నాయి. రెండు నెలల తర్వాత, గ్రీకు కార్మిక శాఖలో బాంబు పేలింది. అయితే, రివల్యూషనరీ క్లాస్ సెల్ఫ్‌డిఫెన్స్ అనే కొత్త నెట్‌వర్క్ దీని బాధ్యతను స్వీకరించింది. ఆండిఫా ఓస్ట్ (ఈస్ట్) సంస్థ జర్మనీ కేంద్రంగా పని చేస్తున్నది. హంగేరియన్ ప్రధాని విక్టర్ ఒర్బాన్, ట్రంప్ మిత్రుడు, శాసనకర్త, కిర్క్ హత్య తరువాత ఈ గ్రూపును ఉగ్రవాద సంస్థగా గుర్తించారు.

## రిఫరెండం రాజ్యాంగ విరుద్ధం

### బంగ్లాదేశ్ న్యాయ నిపుణుల అభిప్రాయం



ధాకా: బంగ్లాదేశ్ సలహాదారు ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం తలపెట్టిన రిఫరెండం రాజ్యాంగ విరుద్ధమని పలువురు న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పిటిఐ కథనాన్ని అనుసరించి 'జులై చార్టర్'పై ప్రజాభిప్రాయ సేకరణకు అనుమతిస్తూ యూనస్ ప్రతిపాదించిన ఒక ఆర్డినెన్స్‌పై రాష్ట్రపతి మహమ్మద్ షహాబుద్దీన్ సంతకం చేశారు. పదవీ త్యుతురాలైన నాటి ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌ను మినహాయించి, మిగతా అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరిపినట్టు యూనస్ అంతకు ముందు మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు. అవామీ లీగ్‌ను నిషేధించిన కారణంగా, ఆ పార్టీ నాయకులను సంప్రదించలేదని స్పష్టం చేశారు. జులై చార్టర్ అమలుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని, తద్వారా ప్రజలకు వాస్తవ పరిస్థితులు, వచ్చే ఫిబ్రవరిలో జరిగే సార్వత్రిక ఎన్నికలపై వివరాలు వివరించగలుగుతామని అన్నారు. అయితే, రిఫరెండం జరపడానికి ఆర్డినెన్స్ జారీ చేయడాన్ని ప్రముఖ న్యాయ నిపుణుడు, న్యాయశాస్త్ర మాజీ ప్రొఫెసర్ షహ్దీన్ మాలిక్ ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తప్పుపట్టారు. బంగ్లాదేశ్ రాజ్యాంగంలో ఎక్కడా ప్రజాభిప్రాయ సేకరణ ప్రస్తావన లేదని అన్నారు. జులై చార్టర్‌లో తీసుకున్న పలు నిర్ణయాలు, గెజెట్‌లోని అంశాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. గెజెట్‌ను రాష్ట్రపతి చట్టపరంగా ఆమోదించలేరని అన్నారు. అయితే, యూనస్ మాత్రం రిఫరెండం జరపడాన్ని సమర్థిస్తున్నారు. ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ దేశం సైనిక పాలన కింద ఉండివుంటే, రాజ్యాంగం అమల్లో ఉండేది కాదని వ్యాఖ్యానించారు. ప్రజలు జులై చార్టర్‌లోని అంశాలను తెలుసుకోవాలని సూచించారు.

## హెచ్1బి వీసా రద్దుకు చట్టసభలో బిల్లు

### అమెరికా పార్లమెంటు సభ్యురాలు మర్జోరీ గ్రీన్

**న్యూయార్క్/వాజిన్‌పింగ్‌ంగ్టన్ :** దేశ పౌరసత్వానికి వీలు కల్పించే హెచ్1బి వీసా విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ ఒక ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) సభ్యురాలు మర్జోరీ గ్రీన్ తన సోషల్ మీడియా 'ఎక్స్' ఖాతాలో పెట్టిన వీడియో పోస్టులో తెలిపారు. వీసా గడువు ముగిసిన వెంటనే వారు తిరిగి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. 'నా ప్రియమైన అమెరికన్లారా, నేను హెచ్1బి వీసా కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేసే బిల్లును ప్రవేశపెడుతున్నాను. ఈ కార్యక్రమం దశాబ్దాలుగా మోసపూరితంగా కొనసాగుతున్నది. దుర్వినియోగం అవుతున్నది. ఈ కారణంగానే అమెరికన్ కార్మికులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యలు పెరుగుతున్నాయి' అని జార్జియాకు చెందిన మార్జోరీ ఆ వీడియోలో పేర్కొంది. ఈ బిల్లులో, ప్రతి సంవత్సరం 10,000 వీసాల పరిమితిని అనుమతిస్తూ ఒకే ఒక్క మినహాయింపు ఉంటుందని, అవి అమెరికన్లకు ప్రాణరక్షక సేవలను అందించే వైద్య నిపుణులు, డాక్టర్లు, నర్సులకు మాత్రమే జారీ అవుతాయని ఆమె వెల్లడించింది. ఈ 10,000 వార్షిక పరిమితిని కూడా 10 సంవత్సరాల్లో దశలవారీగా రద్దు చేస్తామని, తద్వారా అమెరికాలోనే డాక్టర్లు, వైద్య నిపుణులను తయారు చేసుకునే వ్యవస్థను నిర్మించడానికి సమయం లభిస్తుంది ఆమె వివరించింది. ఈ బిల్లు పౌరసత్వ మార్గాన్ని తొలగిస్తుందని, వీసా గడువు ముగిసిన వెంటనే వీసా కలిగినవారు స్వదేశానికి తిరిగి వెళ్లాలని వివరించింది. హెచ్1బి వీసాలు తాత్కాలికంగా అమెరికాలో పని చేసేందుకు నిర్దేశించినవని ఆమె గుర్తుచేసింది. ఒక నిర్దిష్ట సమయంలో ప్రత్యేక నైపుణ్యత అవసరాన్ని తీర్చడానికి మాత్రమే కావాల్సివచ్చిందని, ప్రజలు ఇక్కడ శాశ్వతంగా నివసించడానికి అనుమతించడం తగదని ఆమె వ్యాఖ్యానించింది. ప్రస్తుతం అమెరికాలో ప్రతి సంవత్సరం 65,000 సాధారణ హెచ్1బి వీసాల పరిమితి ఉంది, అలాగే అమెరికా అధునాతన డిగ్రీ కలిగినవారికి మరో 20,000 వీసాలు జారీ చేస్తారు. అమెరికన్ కంపెనీలు, ముఖ్యంగా టెక్నాలజీ కంపెనీలు, ప్రత్యేక నైపుణ్యాల వలసదారులను నియమించడానికి హెచ్1బి వీసాలను వినియోగిస్తాయి.

## విమానంలోనే 12గంటలు

### దక్షిణాఫ్రికాలో చిక్కుకుపోయిన 150 మందికి పైగా పాలస్తీనియన్లు



**జోహానెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికాలో 150 మందికి పైగా పాలస్తీనియన్లు సుమారు 12 గంటల పాటు ఒక విమానంలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరిలో ఒక గర్భిణి కూడా ఉంది. ప్రయాణ పత్రాల్లో ఏర్పడిన సమస్యల కారణంగా గంటల తరబడి ప్రయాణికులను విమానంలోనే నిలువరించడంపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. విమానంలో చిక్కుకుపోయిన ప్రయాణికులను కలిసేందుకు అనుమతి పొందిన ఒక పాస్టర్, అక్కడ పరిస్థితి చాలా భయంకరంగా ఉందని, పిల్లలు అరుస్తూ, ఏడుస్తూ ఉన్నారని తెలిపారు. పాలస్తీనియుల బృందం గురువారం ఉదయం కెన్యాలోని నైరోబీ నుండి ప్రయాణం కొనసాగించిన ఒక చార్టర్ విమానంలో దక్షిణాఫ్రికాలోని జోహానెస్‌బర్గ్ ఒఆర్ టాంబో అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది అని దక్షిణాఫ్రికా బోర్డర్ మేనేజ్మెంట్ అథారిటీ తన ప్రకటనలో తెలిపింది.

ఇజ్రాయెల్ అధికారుల ఎగ్జిట్ స్టాంపులు లేకపోవడం, వారు దక్షిణాఫ్రికాలో ఎంతకాలం ఉండబోతున్నారో తెలియజేయకపోవడం, అలాగే స్థానిక చిరునామాలు ఇవ్వకపోవడం వలన, వలస అధికారులు వారికి ప్రవేశాన్ని నిరాకరించారని ప్రకటనలో వివరించింది. దక్షిణాఫ్రికా హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవడంతో పాటు, ఒక స్థానిక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వారికి నివాస సౌకర్యం కల్పించేందుకు ముందుకు రావడంతో, మొత్తం 153 మంది ప్రయాణికులను విమానం నుండి బయటకు వచ్చేందుకు అధికారులు అనుమతించారు. బోర్డర్ మేనేజ్మెంట్ అథారిటీ ప్రకారం, తరువాత 23 మంది ఇతర దేశాలకు వెళ్లగా, 130 మంది దక్షిణాఫ్రికాలో మిగిలారు.

## సుపరిపాలనకు విజయం

(మొదటి పేజీ తరువాయి)

తీర్పు ఎన్‌డిఎ ప్రజలకు సేవ చేయడానికి, బిహార్ కోసం కొత్త సంకల్పంతో పనిచేయడానికి తమకు మరింత శక్తినిస్తుందని ప్రధాని అన్నారు. 'బిహార్‌లో ఎన్‌డిఎ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని నిర్ధారించింది. మా ట్రాక్ రికార్డ్, రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలనే మా దార్శనికతను చూసిన తర్వాత ప్రజలు మాకు భారీ మెజారిటీని ఇచ్చారు' అని మోదీ అన్నారు. అవిశ్రాంతంగా పనిచేసిన, పాలక కూటమి అభివృద్ధి ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రతి ఎన్‌డిఎ కార్యకర్తకు కూడా ప్రధానమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో తాము బిహార్ అభివృద్ధి వైపు చురుకుగా పని చేస్తామని, అక్కడి మౌలిక సదుపాయాలకు, రాష్ట్ర సంస్కృతికి కొత్త గుర్తింపును ఇస్తామన్నారు. యువశక్తి, మహిళా శక్తి సంపన్న జీవితానికి తగినంత అవకాశాలను పొందేలా చూస్తామని మోదీ పేర్కొన్నారు.

## గెలుపు ఫలితం

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడమే ఆ పార్టీ ఓటమికి కారణమని, పైగా సానుభూతి పనిచేయడంలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం ద్వారా ప్రజలు ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని సూచిస్తున్నదని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మరింత బాధ్యతగా సమస్యల పరిష్కారం, హామీల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికలలో విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఉప ఎన్నికలలో సిపిఐ, కాంగ్రెస్‌కు మద్దతు తెలపడమే కాకుండా ప్రచారం చేశామని సాంబశివరావు గుర్తు చేశారు.

**బిహార్‌లో విజయం ఇసిదే**

బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్‌డిఎ సాధించిన విజయం ఆ కూటమిది కాదని ఎన్నికల కమిషన్‌దేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎన్నికల ముంగిట ఆ రాష్ట్రంలో 75 లక్షల మంది మహిళల బ్యాంక్ ఖాతాలకు నితీష్‌కుమార్ ప్రభుత్వం రూ.10 వేల నగదు బదిలీ చేసినా ఎన్నికల సంఘం ఏమాత్రం పట్టించుకోలేదని, అలాగే ఎస్‌ఐఆర్ పేరుతో 65 లక్షల ఓట్లు తొలగించారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇవ్వన్ని కూడా ఎన్‌డిఎ కూటమి విజయానికి దోహదం చేశాయని అన్నారు. విపక్ష మహా ఘట్‌బంధన్ సైతం ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకోకపోవడంతో ప్రజలలో కూటమి పట్ల నెలకొన్న సానుకూలతను ఉపయోగించు కోలేక పోయిందని అన్నారు. భవిష్యత్‌లో దీనిని ఒక పాఠంగా తీసుకుని సాధ్యమైనంత త్వరగా సర్దుబాటు చేసుకోవాలని ఈ ఎన్నికలు సూచిస్తున్నాయని అన్నారు.

## ఏకపక్ష ఫలితాలు (మొదటి పేజీ తరువాయి)

జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవం నుంచి బిజెపి బయటపడింది. కాగా, భారీగా తరలి వచ్చిన మహిళా ఓటర్లే ఈ ఫలితాల్లో కీలకమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో గెలిచిన ఎన్‌డిఎ బిహార్‌లో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడియు గత ఎన్నికల్లో కేవలం 43 సీట్లతో సరిపుచ్చుకుంది. అయితే, ఈసారి ఆ పార్టీ బలాన్ని కూడగట్టుకుంది. ఇప్పటికే 24 స్థానాలను కైవసం చేసుకుంది. మరో 64 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. సాధారణ మెజారిటీ 122 సీట్లుకాగా, ఎన్‌డిఎ ఆ మైలురాయిని సులభంగానే అధిగమించింది. ఇలావుంటే, బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ, మంత్రులు ప్రేమ్ కుమార్, మహేశ్వర్ హజారీ, సంజయ్ సరౌగీ గెలిచిన ప్రముఖుల జాబితాలో ఉన్నారు. ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ విజయం సాధించారు. గత ఎన్నికల్లో వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ (విఐపి) టికెట్‌పై గెలుపొంది, ఆ తర్వాత బిజెపిలో చేరిన ప్రస్తుత బిహార్ టూరిజం శాఖ మంత్రి రాజు కుమార్ సింగ్ తన సమీప ప్రత్యర్థి, ఆర్‌జెడి అభ్యర్థి పృథ్వీ నాథ్ రేపై విజయం సాధించారు. లోక్‌జన్‌శకి పార్టీ (రామ్‌విలాస్) అభ్యర్థి రాజు తివారీ గవింద్‌గంజ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు చెందిన శశి భూషణ్ రాయ్‌పై గెలుపొందారు. జమూయ్ నియోజకవర్గంలో బిజెపి నేత శ్రేయసి సింగ్ తన సమీప ఆర్‌జెడి అభ్యర్థి మహమ్మద్ శంషాద్ ఆలంను ఓడించారు.

## జూబ్లీహిల్స్ ప్రజాస్వామ్యానికి అనుకూల ఫలితం

### టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో తెలంగాణ జన సమితి కార్యాలయంలో ఉత్సాహభరితంగా సంబరాలు జరిగాయి. పార్టీ కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం ప్రజాస్వామ్యానికి, అభివృద్ధి రాజకీయాలకు అనుకూలంగా నిలిచిన ఫలితమని తెలిపారు. ఈ గెలుపుతో గ్రేటర్ హైదరాబాద్‌లో జన సమితి పార్టీపై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. బస్తీల్లోని సమస్యలను పరిష్కరించేందుకు నాయకులు మరింత చురుకుదనం చూపాలని సూచించారు. రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికలకు పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని నగర కమిటీని కోదండరాం కోరారు.

టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్ కుమార్, రమేష్ ముదిరాజ్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, కార్యాలయ ఇన్‌చార్జ్ హనుమంత రెడ్డి, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జ్ హనుమంత గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దార సత్యం, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు చంద్రగిరి సత్యనారాయణ, నగర నాయకులు మహమ్మద్ అఫ్జల్, మెరుగు శ్రీనివాస్ యాదవ్, రమేష్, లక్ష్మణ్, మాణిక్యం, నాగభూషణం, సుధాకర్, అజయ్ గౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

## 'కర్మ హిట్స్ బ్యాక్'

### జూబ్లీహిల్స్ ఫలితాల నేపథ్యంలో కవిత ఆసక్తికర ట్వీట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. 'కర్మ హిట్స్ బ్యాక్' (కర్మ అనుభవించాల్సిందే) అని ఆమె ఎక్స్ వేదికగా చేసిన ఈ ట్వీట్ చేశారు. ప్రస్తుతం కవిత చేసిన ట్వీట్ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఎవరి పేరును కానీ, ఏ పార్టీ పేరును కానీ, ఏ అంశాన్ని కానీ ప్రస్తావించకుండా ఆమె కేవలం మూడు పదాల్లో ట్వీట్ చేయడం గమనార్హం. ఎమ్మెల్సీ కవిత ఎవరిని ఉద్దేశించి ఈ ట్వీట్ చేశారు?, ఆ ట్వీట్ వెనక ఆంతర్యం ఏంటి?, బిఆర్‌ఎస్ ఓటమిని ఉద్దేశిస్తూ ఆమె ఈ ట్వీట్ చేశారా? అనే చర్చ జరుగుతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు వెలువడిన తరుణంలో ఆమె ఈ ట్వీట్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. బిఆర్‌ఎస్ ఓటమి నేపథ్యంలోనే కవిత ఈ ట్వీట్ చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే జూబ్లీహిల్స్1లో బిఆర్‌ఎస్ ఓటమి ఆమె రాజకీయ వ్యూహాలకు మరింత కలిసొచ్చే అంశంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి సునీత కోసం కెటిఆర్ కాళ్లకు బలపం కట్టుకుని ప్రచారం చేశారు. అయినప్పటికీ మాగంటి సునీత ఓటమి తప్పలేదు. కెటిఆర్ తీరుపై బాహాటంగానే విమర్శలు గుప్పించిన కవితకు ఈ అంశం కూడా అస్త్రంలా మారనుంది.

## కార్మికులకు కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

లేకపోతే కార్మిక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వం కేంద్రంలో ఉన్నదని, అది అణిచివేస్తున్నదని అన్నారు. సిపిఐ 100 సంవత్సరాల పండుగ ఖమ్మంలో జరుగుతున్నదని, ఈ శత వార్షికోత్సవ సభకు కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సాంబశివరావు కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, రాష్ట్ర నాయకులు ఎం.నరసింహ, ప్రేంపావని, బాబు, కరుణలు పాల్గొన్నారు.

## అనుమానాస్పదం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తంచేశారు. ఇండియా ఐక్య సంఘటనలో సీట్ల సర్దుబాటు సమయంలో సమన్వయ లోపానికి భారీ మూల్యం చెల్లించుకోవల్సి వచ్చిందన్నారు. ఈ పరిణామం పరస్పర సహకారానికి, ఐక్య కార్యాచరణకు, సైద్ధాంతిక సంఘీభావానికి పిలుపునిస్తోందని రాజా అన్నారు.

అతిస్పష్టమైన ఉమ్మడి కార్యాచరణతో... విశ్వసనీయ సైద్ధాంతిక ప్రత్యామ్నాయంగా ప్రజల్లోకి వెళ్లడం ఎంత ముఖ్యమో ఈ ఫలితం నేర్పిందని రాజా వ్యాఖ్యానించారు. బీహార్‌లో సీపీఐ అభ్యర్థులకు మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికి, వారి గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామిక, న్యాయమైన, సుసంపన్నమైన బీహార్ కోసం ఎన్ని ఆటంకాలు వచ్చినాగానీ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, స్వాతంత్ర్యం రాకముందు నుంచి ప్రజల పక్షాన పోరాడటానికి సీపీఐ పూర్తిగా కట్టుబడి ఉన్నదని డి.రాజా వెల్లడించారు.

## నెగ్గితే ఉప్పొంగం (మొదటి పేజీ తరువాయి)

కలిసి సిఎం మాట్లాడారు.

**రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రులు కలిసి రావాలి**

'రాష్ట్ర ఆదాయంలో 65శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తోంది. నగరానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా మరింత అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌ను సమస్యల రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయండి. సమస్యలు ఉంటే ప్రశ్నించండి, ధర్నాలు చేయండి. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ఉంది. రెండేళ్లు అభివృద్ధికి సహకరించండి' అని సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కోరారు. మెట్రో, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు అనుమతులను విషయంలో ప్రభుత్వ ప్రయత్నాలను కిషన్‌రెడ్డి అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోకుండా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారని, వీలయినంత మేరకు కేంద్రంలో అడ్డు తగులుతున్నారన్నారు. ఈ ఫలితాలు విశ్లేషించుకుని తెలంగాణ అభివృద్ధికి సహకరించాలన్నారు. నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వం పాత్రలను, వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారని, అందుకే ఈ ఎన్నికల్లో ప్రజలు విస్పష్టంగా తీర్పు ఇచ్చారని, ఇది బాధ్యతగా భావించి నగరాన్ని విశ్వ నగరంగా అభివృద్ధి చేయాలని సంకల్పించామన్నారు. మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లు, మూసీ పునరుజ్జీవం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, గోదావరి జలాల తరలింపు లాంటి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్రం వద్ద పెండింగ్ అనుమతులు, నిధులపై చర్చించేందుకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సచివాలయానికి సాదరంగా ఆహ్వానిస్తున్నానన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ అనుమతులు, నిధులకు సంబంధించి సమీక్ష పెట్టి నివేదిక రూపంలో ఎంపిలకు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రికి సూచించారు. రాష్ట్ర ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చే బాధ్యత కేంద్రమంత్రులు, బిజెపి ఎంపిలపై ఉంది.

ఫలితం బిజెపికి భూకంపం ముందు వచ్చే ప్రకంపనలు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డియే అభ్యర్థిగా మారి పనిచేస్తే 17 వేల ఓట్లు వచ్చాయని, ఈ ఫలితాల తరువాతైనా కిషన్‌రెడ్డి తన వ్యవహార శైలి మార్చుకోవాలని సూచించారు. జూబ్లీ హిల్స్ ఫలితం బిజెపికి ఫలితం బిజెపికి భూకంపం ముందు వచ్చే ప్రకంపనల లాంటిదన్నారు. కిషన్‌రెడ్డి ఎంపి నియోజకవర్గంలోనే బిజెపికి బాగా ఓట్లు తగ్గాయి. బిజెపి ఓట్లు 65 వేల నుంచి 17 వేలకు ఎందుకు తగ్గాయో కిషన్‌రెడ్డి ఆలోచించాలన్నారు. ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనించారని, ఇకనైనా వ్యవహారశైలి మార్చుకోకపోతే భూకంపం వచ్చి కాలగర్భంలో కలిసిపోతారన్నారు.

**బిఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తుందని సిఎం ఆగ్రహం**

హైడ్రా, ఈగల్ వంటివి ప్రజల కోసం తీసుకువచ్చామని, కానీ వాటిపైనే ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఈ విష ప్రచారం ఆపాలని బిఆర్‌ఎస్ నేతలకు సిఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి బిఆర్‌ఎస్ అడ్డు తగులుతోందన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు రెండేళ్ల పాలనకు ప్రతిఫలమని, ఈ ఎన్నికల ఫలితాల్లో ఎవరి పాత్ర ఏమిటో, ఎవరి బాధ్యత ఏమిటో ప్రజలు స్పష్టంగా చెప్పారని, ఇప్పటికైనా అర్థం చేసుకుని సహకరించాలని బిఆర్‌ఎస్, బిజెపిలకు రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నా కొన్ని ఛానళ్లు బిఆరెస్ హవా మొదలైందని వార్తలు వేశాయని, మీడియా విశ్వసనీయత కోల్పోవద్దన్నారు.

**హరీష్ అసూయ, కెటిఆర్ అహంకారం తగ్గించుకోవాలి**

మాజీ మంత్రులు హరీష్‌రావు తన అసూయను తగ్గించుకోవాలని, కెటిఆర్ తన అహంకారాన్ని తగ్గించుకోవాలని సిఎం సూచించారు. అధికారం, పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చి కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారన్నారు. 'మనం ఇంకా చాలా ఏళ్లు రాజకీయాలు చేయాల్సి ఉంది. ఫేక్ న్యూస్ రాయించి ఫేక్ సర్వేలు చేయించుకుని భ్రమలో బతకొద్దు. భారత రాష్ట్ర సమితి ఓడిపోతుంది. బిజెపికి డిపాజిట్ రాదని ముందే చెప్పా' అని సిఎం అన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలతో ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ విషం చిమ్మిందని, ప్రధాన ప్రతిపక్షం రాష్ట్రాభివృద్ధికి సహకరించకపోగా ప్రతీ సందర్భంలో అవహేళన చేసే ప్రయత్నం చేసిందని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కెసిఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరు. ఆయన ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదు. కెసిఆర్ గురించి ఇప్పుడు స్పందించాల్సిన అవసరంలేదు' అని ఒక ప్రశ్నకు సిఎం సమాధానం ఇచ్చారు.

**కాంగ్రెస్‌కు పెరిగిన ఓట్ల శాతం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారని, పోలైన ఓట్లలో 51 శాతం ఓట్లు కాంగ్రెస్‌కు రాగా, 38 శాతం బిఆరెస్‌కు, 8 శాతం బిజెపికి ఓటు వేశారని, కాంగ్రెస్ రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా గమనించి ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 'అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైదరాబాద్ ప్రజలలో కాంగ్రెస్‌పై నమ్మకం పెరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ ఓటు బ్యాంకు పెరుగుతూ వస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39 శాతం ఓట్లు వచ్చాయి.

ఆరు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్ల శాతం 42కు పెరిగింది. కాంగ్రెస్ ఒక్కతాటిపై ఉన్నప్పుడు ఎవరి తాతలు దిగొచ్చినా కాంగ్రెస్‌ను ఓడించలేరు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ 51శాతం ఓట్లను ప్రజలు ఇచ్చారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించారు. గెలుపోటములకు కాంగ్రెస్ పొంగిపోదు, కుంగిపోదు. ప్రజల తరపున నిలబడటం, పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యం' అని సిఎం అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిన ఎంఐఎంకు సిఎం ధన్యవాదాలు తెలిపారు. వివిధ రాష్ట్రాల పరిస్థితులను బట్టి పొత్తులు, మద్దతు ఉంటుందన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రజాపాలనకు ప్రజల తీర్పు

### టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ గెలుపు అని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు ఎంత దుష్ప్రచారం చేసినా ఓటర్లు ప్రతిపక్షాల కుట్రలను పసిగట్టి, అభివృద్ధికే పట్టంకట్టారన్నారు. ఉపఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు సిఎం రేవంత్ రెడ్డి ఒకవైపు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ, అభివృద్ధి సమీక్షలు చేస్తూనే, మరోవైపు కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను పోరుకు సమాయత్తపరిచి, నవీన్ యాదవ్ గెలుపుకు బాటలు వేశారని బండి సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా దూసుకెళుతున్న సిఎం రేవంత్ రెడ్డికి ప్రజల మద్దతు నేడు జూబ్లీహిల్స్ లో వెల్లడైందన్నారు. అందుకే ఆ పార్టీ నాయకులకు ప్రజలు తాజా తీర్పుతో కర్రుకాల్చి వాతపెట్టారన్నారు.

## నవీన్ యాదవ్ 16 ఏళ్ల రాజకీయ ప్రస్థానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి వల్లాల నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. నవీన్ యాదవ్ 16 ఏళ్ల రాజకీయ ప్రస్థానానికి శుక్రవారం ఓట్ల లెక్కింపుతో ఫలితం లభించింది. 2009లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన నవీన్ యాదవ్ 16 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎంఐఎం పార్టీతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, 2023లో రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అందివచ్చిన ఉపఎన్నికలో విజయాన్ని సాధించారు. 2009లో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన నవీన్ యాదవ్ యూసుఫ్‌గూడ డివిజన్ నుంచి ఎంఐఎం తరఫున కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో ఎంఐఎం అభ్యర్థిగా జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి, 41,656 ఓట్లు సాధించి రెండవ స్థానంతో సరిపెట్టుకున్నారు. అనంతరం రహమాత్ నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి చెందారు. 2018లో జూబ్లీహిల్స్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, 18,817 ఓట్లు తెచ్చుకున్నారు. 2023లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుత ఉపఎన్నికలో విజయం సాధించారు.


**వ్యక్తిగత వివరాలు..**

**పేరు :** వల్లాల నవీన్ యాదవ్
**తండ్రి పేరు :** వి. చిన్న శ్రీశైలం యాదవ్
**పుట్టిన తేదీ :** 17111983 (42 సంవత్సరాలు)
**భార్య :** వర్ష యాదవ్
**కుమారుడు :** అన్ష్ యాదవ్
**విద్యార్హత:** బి.ఆర్క్ ( ఆర్కిటెక్చర్ ఇంజనీర్ )
**వృత్తి :** ఆర్కిటెక్ట్, రియల్ ఎస్టేట్ వ్యాపారం
**స్వస్థలం :** యూసుఫ్‌గూడ, హైదరాబాద్.

# అభివృద్ధికి ఓటు వేశారు

### మంత్రులు, కాంగ్రెస్ శ్రేణుల హర్షం






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ శాసన సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడం పట్ల రాష్ట్ర మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. నియోజక వర్గంలోని ఆయా డివిజన్‌లలో ప్రచారంలో చేసిన మంత్రులు కృషి ఫలించిందని వారు అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి ఓటు వేశారని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఘన విజయం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులందరం సమష్టిగా పనిచేసి ఉప ఎన్నికల్లో విజయం సాధించామని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఘన విజయం పట్ల మంత్రి జూపల్లి కృష్ణారావు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోనిప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారనడానికి ఈ ఎన్నికలే నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాను ఇన్‌చార్జిగా ఉన్న ఎర్రగడ్డ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపునకు అహర్నిశలు కృషి చేసిన ఎంఎల్‌ఏలు, కార్పొరేషన్ చైర్మన్లు, కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నేతలకు అభినందనలు, ధన్యావాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండాసురేఖకి జూబ్లీహిల్స్ అసెంబ్లీ బై ఎలక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా... కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు ఇచ్చిన షేక్‌పేట్ డివిజన్‌లోని బూత్‌లలో హస్తం పార్టీకి పెద్ద ఎత్తున మెజార్టీ రావడం జరిగింది. పార్టీ అధి నాయకత్వం ఇచ్చిన బాధ్యతను తాను సంపూర్ణంగా నిర్వర్తించినట్టు ఈ సందర్భంగా మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపు గ్రామ గ్రామాన సంబరాలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని బధనం చేసే ప్రయత్నం చేశారన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఎర్రగడ్డ డివిజన్‌లో మంత్రిగా తాను విస్తృతంగా ప్రచారం చేయగా, ఈ డివిజన్‌లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ వచ్చిందని ఈ నేపథ్యంలో మంత్రి నేరుగా ప్రజలను, కార్యకర్తలను కలిసి వారితో తన సంతోషాన్ని పంచుకున్నామని మంత్రి దమోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అపూర్వ విజయాన్ని కట్టబెట్టిన ఓటర్లకు శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నాం అని మంత్రి దనసరి అనసూయ సీతక్క , ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. ఈ విజయం కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బిసి సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్ అఖండ మెజార్టీతో గెలవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని, ఇది బిసిల గెలుపుగా తాము భావిస్తున్నామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

**గాంధీ భవన్ లో పెద్ద ఎత్తున సంబరాలు ...**

జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన తరుణంలో గాంధీ భవన్ కు పెద్ద ఎత్తున చేరుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చుతూ, డప్పు వాయిద్యాలతో రంగులు చల్లుకుని ఒకరినొకరు శుభాకాంక్షాలు చెప్పుకుని స్వీట్లు పంచుకున్నారు..గాంధీభవన్ పరిసరప్రాంతాలు కాంగ్రెస్ నేతలతో కోలాహాలంగా కనిపించింది.

**జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్**

జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విసయం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అంకితమన్నారు. జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు బిఆర్‌ఎస్ పార్టీకి సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో ఆ పార్టీకి చోటలేదని మరోసారి రుజువైందన్నారు. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆంకాంక్షలకు అనుగుణంగా ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. నవీన్‌ను గెలిపించిన ఘనత సిఎం, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తది అని ఆయన అన్నారు.

## మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశంలో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు కనీస వేతనం కింద వారికి రూ.26వేలు చెల్లించాలని ఎఐటియూసి రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశంలో పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం హిమాయత్‌నగర్ రాష్ట్ర కార్యాలయంలోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్రన్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఎఐటియుసి డిప్యూటీ సెక్రటరీ ఎం.నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్మికుల సమస్యలపై రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎసురత్నం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో కార్మికుల సమస్యలు తీరేలా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ సంఘం నాయకత్వంలో సాధించుకున్నటువంటి ఒక సంవత్సరానికి 15 క్యాజువల్ లీవ్‌లని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మరణించిన కార్మికులకు దహన సంస్కారాల ఖర్చులు ఇవ్వవద్దని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జివొని వెంటనే ఉపసంహరించుకోని, దహన సంస్కారాల ఖర్చు కింద రూ.30 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీలలో మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ఈ నెల 18, 19 రెండు రోజులు ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్య, కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, ఉపాధ్యక్షులు కాంతారావు, ధర్మరాజు, రంగపాణి, నకిరేకంటి కృష్ణ, మద్దిలేటి, చెన్నయ్య, నర్సింలు, కమల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## హత్యల సంఖ్య కంటే పదింతలు రోడ్డు ప్రమాదంలో మృతి

### 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రారంభోత్సవంలో డిజిపి శివధర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మన రాష్ట్రంలో ప్రతి ఏటా 800 మంది హత్యకు గురై చనిపోతే దానికి పదింతలు రోడ్డు యాక్సిడెంట్ ద్వారా చనిపోతున్నవారి సంఖ్య ఉందని డిజిపి బి.శివధర్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్త పరిచారు. ఈ పరిస్థితిని నివారించేందుకు, వాహనదారుల్లో ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర పోలీసు శాఖ 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఎల్‌బిస్టేడియంలో శుక్రవారం హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్, ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ డి.జోయల్ డేవిస్, సినీ హీరో శర్వానంద్‌తో కలిసి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డిజిపి శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు భద్రతను ప్రజా ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని సూచించారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ఒక ఉద్యమం మాదిరిగా చేపట్టాలన్నారు. పోలీసు శాఖ, రవాణా శాఖ, కార్పొరేట్ సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పరస్పర సమన్వయంతో ముందుకు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరగనుందని, హైదరాబాద్ పోలీసులు ముందుగా మొదలు పెట్టారన్నారు. యాక్సిడెంట్స్ చాలా అవుతున్నాయి..ఇది అందరికీ సంబంధించిన సమస్య.. సీరియస్ గా తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరు ఫాలో కావాలి, డిఫెన్స్ డ్రైవింగ్ ప్రతి ఒక్కరు చెయ్యాలి అన్నారు. మన ం వెళ్లడమే కాదు ముందు వాళ్ళు,పక్క వాళ్ళను కూడా డ్రైవింగ్ చేసే సమయంలో గమనించడం చాలా అవసరమన్నారు. రూల్స్ పాటించడమే కాదు కామన్ సెన్స్ ప్రజలు పాటించాలన్నారు. ప్రాణాలు ఒక్కసారి పోతే మరోసారి తిరిగి రావని, మన ఫ్యామిలిలు రోడ్డున పడతాయని హెచ్చరించారు. హెల్మెట్ పెట్టుకొని డ్రైవ్ చెయ్యాలి, స్పీడ్ లాక్ తప్పనిసరిగా ఉండాలి, కార్లో వెళ్లే వాళ్ళు సీట్ బెల్ట్ పెట్టుకోవాలి అని సూచించారు. రాష్ట్ర వాప్తంగా అందరికి ట్రాఫిక్ పైన అవగాహన కలిగించేలా అవగాహన కార్యక్రమాలు చెప్పాడుతున్నామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ తెలిపారు. అందులో భాగంగా అరైవ్ అలైవ్ అవగాహన కార్యమాన్ని ఏర్పాటు చేశామన్నారు. యాడాది లో నాలుగున్నర లక్షలు రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయన్నారు. అందులో లక్ష మందికి పైగా చనిపోతున్నారన్నారు. హైదరాబాద్ లో 3500 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో కఠినంగా వ్యవహారిస్తాము. రోడ్డు ప్రమాదంలో ఉన్నావరికి సహాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నైతిక విజయం నాదే

### బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్‌లో నైతిక విజయం తనదే అని బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అన్నారు. ఓ మహిళపై ముఖ్యమంత్రి సహా రాష్ట్ర కేబినెట్ మొత్తం దౌర్జన్యం చేసి గెలిచిందని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రిగ్గింగ్, రౌడియిజం గెలిచాయన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం పూర్తి విఫలమైందన్నారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ది గెలుపే కాదని, నైతిక విజయం తనది, బిఆర్‌ఎస్‌దే అని అన్నారు. ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగాయని అన్నారు. పోలింగ్ రోజున ఎంతో అరాచకం సృష్టించారన్నారు. ఒక మహిళపై అంతమంది రౌడియిజం చేశారన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదన్నారు. తాను ఏం మాట్లాడినా, కార్యకర్తలను పరామర్శించినా తప్పుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. అప్పుడు రిగ్గింగ్‌లు, ఇప్పుడు ర్యాగింగ్‌లు చేస్తున్నారని మండిపడ్డారు. ఉదయం నుంచే కౌంటింగ్ హాలులో ఆడవాళ్లపై కాంగ్రెస్ ర్యాగింగ్ మొదలుపెట్టిందన్నారు. ఒక మహిళపై కాంగ్రెస్ నేతలు రౌడి రాజకీయం చేశారని విమర్శించారు. ఒక మహిళ అని కూడా చూడకుండా ఎన్నో రకాల దాడులు చేశారు. ప్రజలను కాంగ్రెస్ భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. గోపీనాథ్ ఉన్నంతకాలం రౌడిలు ఎక్కడో దాక్కున్నారన్నారు. ఆయన పోయాక కలుగుల్లో నుంచి బయటకు వస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను బెదిరించారని ఆరోపించారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడి ప్రజలు ఓట్లేశారన్నారు. గత ఎన్నికలు, ప్రస్తుత ఎన్నికలకు మధ్య తేడా ఏంటో ప్రజలు గమనించారని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## చేనేత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

### సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత వృత్తిదారుల సమస్యల పరిష్కారం, అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం నేతృత్వంలోని తెలంగాణ చేనేత కార్మిక సంఘం నాయకుల ప్రతినిధి బృందం చేనేత జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యను శుక్రవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలోని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీ నరసయ్య, గౌరవాధ్యక్షులు వెంకట్ రాములు, అధ్యక్షులు పెండెం సర్వేశ్వర్, నాయకులు జల్ది రాములు, కస్తూరి బిక్షపతి, కర్నాటి మారయ్య, సురపల్లి జనార్ధన్, దుడుక ఉప్పలయ్య తదితరులు ప్రతినిధి బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు లక్ష కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, సంక్షోభంలో కురుకపోయిన చేనేత రంగాన్ని గట్టు ఎక్కించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రకటించిన పథకాలను, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.1 లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్టు 14 నెలల కింద సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని, రూ.33 కోట్లు రుణమాఫీ కోసం విడుదల చేస్తున్నామని ఆయన వెల్లడించారని గుర్తు చేశారు. చేనేత కార్మికుల రుణ బకాయిల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నందున అవసరమైన నిధులను విడుదల చేసి రైతన్నల మాదిరిగా నేతన్నలను రుణ విముక్తులను చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 527 చేనేత సహకార సంఘాలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. టెస్కో కొనుగోలు చేసిన వస్త్రాలకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరిగి చేనేత సహకార సంఘాలు అప్పుల్లో కూరుకపోయాయని, వడ్డీల భారం పెరిగి చాలా చేనేత సంఘాలు మూతపడడంతో కార్మికులకు ఉపాధి దొరకని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. చేనేత సహకార సంఘాల రుణాలన్నింటినీ మాఫీ చేసి, బ్యాంకుల ద్వారా కొత్తగా రుణ సహాయం అందించి, మూతబడిన సంఘాలన్నింటినీ తెరిపించాలని కోరారు. సహకార చట్టం ప్రకారం చేనేత సహకార సంఘాలకు 2013లో ఎన్నికల నిర్వహించారని, 2018 తో వాటి కాల పరిమితి ముగిసినా ఇప్పటివరకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదని తెలిపారు. చేనేత సహకార సంఘాల సమాఖ్య 'టెస్కో' కు సైతం పాలకవర్గం లేనందున చేనేతల సంక్షేమం పట్టించుకునేవారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాలను ఎన్నిక చేసి ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం 'నేతన్నకు భరోసా' పథకంలో జియో టాగ్ మగ్గం వేసే చేనేత కార్మికుడికి ఏడాదికి రూ.18 వేలు, ఒక అనుబంధ కార్మికుడికి రూ.6 వేల చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించిందని, ఆ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.

## దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమే

### ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యం
### కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని, ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యమని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి సమావేశం ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరగగా, కూనంనేని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు కమ్యూనిజంపై ప్రజల నమ్మకం పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయని, దానికి నిదర్శనం వరుసగా శ్రీలంక దేశంలో, న్యూయార్క్‌లో కమ్యూనిజం అధికారంలోకి రావడం, ఇప్పుడు నేపాల్‌లో అన్ని కమ్యూనిస్టులు ఐక్యం నిదర్శనమని అన్నారు.

మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు, ధరలు తగ్గిస్తాం, ఏటా 2కోట్లు ఉద్యోగాలు ఇస్తాం లాంటి ప్రజాకర్షక నినాదాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి అవేమీ అమలు చేయలేదన్నారు. దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు, భావోద్వేగాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటున్నదని ఆరోపించారు. 6 దశాబ్దాలుగా ప్రజల, కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను ఎల్‌ఐసి, బ్యాంకులు, టెలికాం, గనులు, చివరికి రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేటుకు కట్టబెట్టిన చరిత్ర బిజెపిది అని వారు ఉద్ఘాటించారు. దేశ సంపదను అదానీ, అంబానీ, కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని, సంపన్నులు మరింత సంపన్నులవుతుంటే. పేదలు మరింత పేదలుగా అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా మార్చే చట్టాలు తెచ్చారని, వీటి రద్దుకొరకు సిపిఐ పోరాడుతున్నదన్నారు. దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత గురించి సిపిఐ నిరంతరం కృషి చేస్తున్నదని, అందుకే రానున్న రోజుల్లో ప్రజలను కమ్యూనిస్టు భావజాలంవైపు ఆకర్షితులను చేయడానికి పోరాటాలు నిర్మిస్తామని వారు అన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న సిపిఐ వందేళ్ల పండగను నిర్వహించనున్నట్లు, ఈ ముగింపు సభకు 40 దేశాల నుంచి వామపక్ష ప్రతినిధులు హాజరవుతారని, ఐదు లక్షల మంది హాజరుకానున్నారని అన్నారు. ఈ ముగింపు సభకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కేంద్ర విధానాలతో రైతులకు గిట్టుబాటు ధర లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు.

బిజెపి పాలిత రాష్ట్రాలకు ఎక్కువ.. బిజెపియేతర పాలిత రాష్ట్రాలకు తక్కువగా నిధులు ఇస్తున్నారని విమర్శించారు. దీంతో అనేక రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు.


ఈ సమావేశంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి,సాయిలు గౌడ్, కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, లక్ష్మి, స్వామి, కిషన్, శంకర్‌రావ్, హరినాథ్ రావ్, కృష్ణ, సత్యప్రసాద్, యాదయ్య గౌడ్, లొట్టి ఈశ్వర్, సల్మాన్ బేగ్, పరమేశ్వర, మాధవి, ప్రమీల, రమేష్, నరేంద్ర ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు


**CHANGE OF NAME**

I, **V.Sreelatha, D/o. Kanakaiah,** (Old Name) R/o: H.No: 5-11-1008, Pochammakunta, Hanumakonda (Mdl & Dist). Telangana - 506009. I have changed my Name from V.Sreelatha, D/o. Kanakaiah to **VADLAKONDA SREELATHA,** D/o. **VADLAKONDA KANAKAIAH** (New Name) for all purpose.

తెలంగాణ ప్రభుత్వం
**జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం, PIU డివిజన్, నల్లగొండ.**
Lr.No.D3/Tenders/04/2025-26/DPRENLG షార్ట్ టెండర్ ప్రకటన తేదీ: 13.11.2025
నల్లగొండ జిల్లాలోని పిఐయు నల్లగొండ డివిజన్‌లోని మదుగులపల్లి, మునుగోడు, నాంపల్లి, చండూర్ & ఘట్టుపల్ మండలాల్లో (6) పనుల కోసం కింద సంతకందారు టెండర్‌ను ఆహ్వానించడమైనది. **మొత్తం అంచనా వ్యయం:** రూ. 60.00 లక్షలు. **దరఖాస్తు చివరి తేదీ:** 19.11.2025, **టెండర్ షెడ్యూళ్ళు జారీ తేదీ:** 22.1.1.2025, **టెండర్ రసీదు మరియు ప్రారంభ తేదీ:** 24.11.2025. మరిన్ని వివరాల కోసం సంప్రదించండి : O/o. DPRE PIU నల్లగొండ. (జెడ్‌పిపి కాంప్లెక్స్, 2వ అంతస్తు), మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, నల్లగొండ పట్టణం.
సం/- జిల్లా. పి.ఆర్. ఇంజనీర్, పి.ఐ.యు.,:: నల్లగొండ.
DIPR R.O. No. : 10663-PP/CL/ADVT/1/2025-26, Date: 14-11-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
NIT No. 31/EE/Div.No.13 (Old-7B)/GHMC/2025-26 తేదీ: 14.11.2025
పని పేరు: (3) పనులు, హిటాచీ పనులు మరియు క్రీడా సామగ్రి పనులు, **అంచనా మొత్తం:** రూ.81.50లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 1 నుండి 3 వరకు పనుల ప్రారంభం: 15.11.2025న మ.1.00గం.ల నుండి, 18.11.2025న మ.1.00గం.వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.13 (ఓల్డ్-7బి) (కెజెడ్), జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్. సెల్ నెం. 9989930651. మరిన్ని వివరాలకు www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.13 (ఓల్డ్-7బి), జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10684-PP/CL/ADVT/1/2025-26, Date: 14-11-2025

**జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం**
**మహిళలు, పిల్లలు, వైకల్య వ్యక్తులు & సీనియర్ సిటీజెన్స్ విభాగం, ఆదిలాబాద్.**
ప్రకటన
(1) వదిలివేయబడిన పిల్లలను ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ బాలసదన్‌లో ఉంచడం జరిగింది. వారిని ఆదిలాబాద్ విద్యానగర్ బస్ డిపో దగ్గరలోని చిల్డ్రన్ హోమ్‌లో ఉంచారు. వారు నిరంతరం ఐసిపిఎస్ యొక్క పర్యవేక్షణలో ఉంటారు.
(2) వదిలివేయబడిన ఒక చిన్నారి డూప్లికేట్ ఫోటో సమర్పించబడింది.
(3) జైవిక సంబంధమైన తల్లిదండ్రులు పైన పేర్కొనబడిన పిల్లలను క్లెయిమ్ చేయడానికి రుజువుతో ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోపు కింద సంతకం చేయబడిన సంబంధిత అధికారిని సంప్రదించవచ్చు. అనంతరం బిడ్డను విడిచిపెట్టబడిన వ్యక్తిగా ప్రకటిస్తారు. తదుపరి ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం దత్తత కోసం ఇవ్వబడుతుంది.
వదిలివేయబడిన చిన్నారి ఫోటో

Name: Kiara
DOB: 23.09.2025
సం/- జిల్లా సంక్షేమ అధికారి WD&CW డిపార్ట్‌మెంట్, ఆదిలాబాద్.
DIPR R.O. No. : 10676-PP/CL/ADVT/1/2025-26, Date: 14-11-2025

**పురపాలక సంఘ కార్యాలయము - హుజూరాబాద్**
జిల్లా : కరీంనగర్
లేఖ నెం. E1/298/2025-26 టెండర్ ప్రకటన తేదీ: 14.11.2025
హుజూరాబాద్ పురపాలక సంఘ పరిధిలో 15వ ఆర్థిక సంఘం టైడ్ గ్రాంట్, అన్ టైడ్ గ్రాంట్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను అర్హత ఆసక్తి కలిగిన రిజిష్టర్డు సివిల్ కాంట్రాక్టర్ల / అధీకృత డీలర్ల నుండి e-procurement ద్వారా ఆన్ లైన్ టెండర్లు కోరబడుచున్నవి.

| | |
|---|---|
| 01. పనుల సంఖ్య | : (04) పనులు |
| 02. టెండర్ల విలువ | : 20.00 లక్షలు |
| 03. బిడ్ డౌన్ లోడ్ ప్రారంభ తేది | : 15.11.2025 ఉదయం 11.00 నుండి |
| 04. బిడ్ డౌన్ లోడ్ చివరి తేది మరియు సమయము | : 22.11.2025 మధ్యాహ్నం 4.00 గం. వరకు |
| 05. బిడ్లు తెరుచు తేది మరియు సమయము | : 22.11.2025 సాయంత్రం 4.05 నుండి |

ఇతర వివరముల కొరకు www.Tender.Telangana.gov.in వెబ్‌సైటులో చూడగలరు.
కొటేషన్ నోటీసు
హుజూరాబాద్ పురపాలక సంఘ పరిధిలో ఈ క్రింద తెలిపిన పనులు చేపట్టుటకు గాను అర్హత / ఆసక్తి కలిగిన మునిసిపల్ రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి- అధీకృత డీలర్ల నుండి సీల్ కవర్ల ద్వారా కొటేషన్లు కోరబడుచున్నవి.
**పనుల వివరములు:** 01. క్రిస్మస్ పండుగ సందర్భముగా హై స్కూల్ గ్రౌండ్ నందు టెంట్లు, చైర్స్, సౌండ్ సిస్టం, త్రాగు నీరు తదితర ఏర్పాట్లు చేపట్టుటకు గాను
పైన తెలిపిన పనులు చేపట్టుటకు గాను తేది : 17.11.2025 సోమవారము సాయంత్రము 4.00 గం.ల లోగా కొటేషన్లు పురపాలక సంఘము నందు అందచేయుటకు గాను కోరనైనది.
సంబంధిత వివరముల కొరకు మునిసిపల్ ఇంజనీర్ గారిని సంప్రదించగలరు.
N. సుధాకర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ - 8501845507
సం/- కమిషనర్, పురపాలక సంఘము, హుజూరాబాద్.
DIPR R.O. No. : 10649-PP/CL/ADVT/1/2025-26, Date: 14-11-2025

## మద్దతు ధర పొందాలి



ప్రజాపక్షం/హాలియా: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి అందిస్తున్న మద్దతు ధరను రైతులు పొందాలని కొత్తపల్లి సహకార సంఘం చైర్మన్ రిక్కల మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపేట, రామడుగు, అనుముల గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈసందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు అందించాలనే ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణ, సెక్రెటరీ రావుల సత్యం, ఏఈఓ లు కళ్యాణ్, నాగయ్య, సొసైటీ డైరెక్టర్లు ఉడుతూరు నరసింహారెడ్డి, వెంకటయ్య, మన్నె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహంపై అవగాహన అవసరం



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : మధుమేహంపై ప్రజలకు అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని డాక్టర్ ఆశిత అన్నారు. శుక్రవారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గిరినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులు రాకుండా 30 సంవత్సరాల వయస్సు నాటి నుండి ప్రతి రోజు వ్యాయామం, నడక, సమతుల ఆహారం, ఆరోగ్య నియమాలను పాటించడం అత్యంత కీలకమన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత్, డిప్యూటీ డిఈఎంఓ వి సంజీవరెడ్డి, శ్రీనివాసరాజు, వినోద్, సౌలశివరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రీజనల్ రింగ్ రోడ్‌లో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం



ప్రజాపక్షం/యాదాద్రి : రీజనల్ రింగ్ రోడ్ కింద నష్ట పోయిన అర్హులకు నష్ట పరిహారం కింద ప్రభుత్వం నిధులు విడుదల చేయడం జరిగిందని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ కింద భూమి నష్ట పోయిన వారికి నష్ట పరిహారం క్రింద తెలిపిన విధంగా డబ్బులు విడుదల చేయడం జరిగిందన్నారు. యాదగిరిగుట్ట మండలం దత్తరపల్లి గ్రామానికి చెందిన 12 మందికి రూ.69,55,534.60, తుర్కపల్లి మండలం దత్తయ్యపల్లి గ్రామానికి చెందిన 15 మందికి రూ.30,86,170.28, తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన 5 మందికి రూ.13,66,092.00, తుర్కపల్లి మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన 6 మందికి రూ.32,20,179.31, తుర్కపల్లి మండలం వేల్పుపల్లి గ్రామానికి చెందిన 11 మందికి రూ.57,69,780.60, జిల్లాలో మొత్తం 49 మందికి రూ.2,03,97,756 నష్టపోయిన వారికి ప్రభుత్వం నిధులు విడుదల చేశారన్నారు.

## షేక్ సైదా మృతి బాధాకరం



ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

ప్రజాపక్షం/కోదాడ: ఎఐటియుసి కార్మికుడు షేక్ సైదా మృతి చాల బాధకరమని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాత్రి మునగాల మండల పరిధిలోని ఆకుపాముల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ సైదా మృతి ఎఐటియుసికి తీరనిలోటు అని అన్నారు. శుక్రవారం షేక్ సైదా మృత దేహనికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహనికి పూలమాలలువేసి నివాళులర్పించారు. షేక్ సైదా కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతూ యూనియన్ అభివృద్ధిలో పాటుపడిన షేక్ సైదా మృతి ఎఐటియుసికి, డ్రైవర్ల యూనియన్ సంఘానికి తీరని లోటు అని అన్నారు. షేక్ సైదా కుటుంబానికి ఎఐటియుసి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మిల్లు డ్రైవర్ల యూనియన్ నాయకులు ఎస్‌కె సైదా, యూనియన్ నాయకులు నాగరాజు, నాగేశ్వరరావు, ఎస్‌కె మీరా, బాలు మియా, శ్రీను, నాగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యాదగిరి సేవలు వెలకట్టలేనివి



గోద శ్రీరాములు


ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగ గ్రామంలో శుక్రవారం అనంతులు యాదగిరి సంస్మరణ సభ కార్యక్రమంలో యాదగిరి స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, సిపిఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ గ్రామ కార్యదర్శి యాదయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యానాల దామోదర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు మాట్లాడుతూ అనంతుల యాదగిరి సేవలు వెలకట్టలేనివని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం, పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేశారని అన్నారు. గ్రామాలలో పార్టీ అభివృద్ధి కోసం ప్రజలను చైతన్య పరుస్తూ పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర, మండల కార్యదర్శి రామచంద్రయ్య, మోత్కుర్ మండల కార్యదర్శి వెంకట్, మండల కార్యవర్గ సభ్యులు కొమురయ్య, సత్యనారాయణ, వెంకన్న, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి దాడులు

రూ.63,160 నగదు స్వాదీనం

ఎసిబి డిఎస్‌పి జగదీశ్‌చంద్ర వెల్లడి

ప్రజాపక్షం/మిర్యాలగూడ: మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా దాడులు చేశారు. ఏకకాలంలో హైద్రాబాద్‌లోని రిజిస్ట్రార్ బలరాంయాదవ్ ఇంట్లో కూడా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చంద్ర మాట్లాడుతూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అనేక ఫిర్యాదులు అందాయని ఆ మేరకు అకస్మాత్తుగా దాడులు నిర్వహించామని తెలిపారు. దాడుల సమయంలో రికార్డులు, దస్తావేజులు స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. తనిఖీల సమయంలో కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఆరుగురు సిబ్బంది ఉన్నారని, వీరితోపాటు ఆరుగురు డాక్యుమెంట్ రైటర్లు మరో ఆరుగురు వారి అసిస్టెంట్లు ఉన్నారని చెప్పారు. కార్యాలయంలో ఓ మహిళ అనధికారికంగా విధులు నిర్వహిస్తుందని ఆమెకు ప్రతిరోజు రూ.500 చొప్పున అనధికారికంగా చెల్లిస్తున్నట్లు విచారణలో తేలినట్లు తెలిపారు. కార్యాలయంలో అనధికారికంగా ఆధారాలు లేని రూ.60160 నగదును సీజ్ చేశామని తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన 19 దస్తావేజులు ఉన్నాయని, కార్యాలయంలో నాలుగు సీసీ కెమెరాలు ఉంటే కేవలం ఒకటే సీసీ కెమెరా పనిచేస్తుందని, మిగిలిన మూడు సీసీ కెమెరాలు కావాలనే డిస్‌కనెక్ట్ చేశారని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోదాలు చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దాడుల్లో ఏసీబీ సీఐలు వెంకటేశ్వర్‌రావు, కిషన్‌లు ఉన్నారు.



## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా కేంద్ర గ్రంథాలయం భువనగిరిలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎండి అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తి జాతీయ పతాకావిష్కరణ చేసి జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి వారోత్సవాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏ.భాస్కరరావు హాజరయ్యారు. సమావేశ ప్రారంభానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి దేవి చిత్రపటానికి, గ్రంథాలయ పితామహులు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థలు అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు గ్రూప్స్‌కి సంబంధించిన పుస్తకాలు కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా గ్రంధాలయానికి రావాల్సిన సెస్ బకాయిలు చెల్లించుటకు జిల్లాలోని మున్సిపాలిటీలకు గ్రామపంచాయతీలకు తగిన ఆదేశాలు ఇస్తానని తెలిపారు. రూ.100 చెల్లించి గ్రంథాలయంలో సభ్యులుగా చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి ఎం.సుధీర్, పోలిశెట్టి అనిల్ కుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మాటూరి బాలేశ్వరరావు, జంపాల అంజయ్య, కరిపే నరసింహారావు, అక్కినేనిపల్లి నరసింహారావు, పి.శంకర్ రెడ్డి, బట్టు రామచంద్రయ్య, సల్లావుద్దీన్, కైరం కొండ వెంకటేష్, వడిచెర్ల కృష్ణ యాదవ్, ఎండి.మజార్, చల్లగురుగుల రఘుబాబు, గుర్రాల శ్రీనివాసరావు, మంగ ప్రవీణ్, పిట్టల బాలరాజు, కొల్లూరు రాజు, నాగారం శంకర్, బర్రె నరేష్, ఎండి.ఉజయర్, సాయి పాల్గొన్నారు.

## సన్మార్గంలో విద్యార్థులు, యువత



ఎస్‌పి కె.నరసింహ

ప్రజాపక్షం/గరిడేపల్లి : బాలల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా ఎస్‌పి కె.నరసింహ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నందు విద్యార్థులతో గడిపారు. భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులతో కలిసి ఆయనను స్మరించుకున్నారు. భారత దేశం కోసం ఎందరో మహానుభావులు కృషి చేశారని, భారతదేశ మొదటి ప్రధానమంత్రి నెహ్రు బాలల విద్య, వికాసం, హక్కుల కోసం ఎంతగానో కృషి చేసి ఆయన ప్రసిద్ధి చెందారన్నారు. మహానుభావుల కలలను, ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత నేటి భావి భారత పౌరులపై ఉందన్నారు. విద్యార్థులు, యువత ఎవరు కూడా చెడు మార్గంలో వెళ్లకుండా సన్మార్గంలో నడిచి క్రమశిక్షణతో, నిరంతరం సాధన చేసి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పెద్దలను గౌరవించాలి, తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తేవాలని అన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కృషి చేస్తే మంచి విజయాలు సాధిస్తారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. హుజూర్‌నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమందరాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, గరిడేపల్లి ఎస్ఐ నరేష్, మండల విద్యాధికారి శత్రునాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేసిన బిఆర్‌ఎస్

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపు



ప్రజాపక్షం/మిర్యాలగూడ: మిర్యాలగూడ అభివృద్ధిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాగితాలకే పరిమితం చేసిందని, అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని శాసనసభ్యులు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రూ.70 కోట్ల వ్యయంతో పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు శుక్రవారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్ల పాటు అధికారంలో ఉండి పదవులు అనుభవించిన నాయకులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాన్ని అస్తవ్యస్తంగా చేపట్టి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందన్నారు. వారు చేసిన తప్పులను సరి చేసేందుకు రెండు సంవత్సరకాలం పట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. మిర్యాలగూడను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ముందున్న కర్తవ్యం అన్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, శ్మశానవాటికల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, బండి యాదగిరిరెడ్డి, లావూరి రవి నాయక్, ముదిరెడ్డి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సిపిఐ

18న దేవరకొండకు

ప్రచార జాత :పల్లా నర్సింహారెడ్డి




ప్రజాపక్షం/దేవరకొండ: సిపిఐ శాతాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కామ్రేడ్ పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన సిపిఐ దేవరకొండ మండల సమితి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారత దేశంలో 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. ఈ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలను సమీకరించి పోరాటంలో అగ్రభాగాన నిలిచి అనేక త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ మాత్రమే అని అన్నారు. ఎంతో మహత్తర చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఐ నిర్వహించిన పోరాటాలను త్యాగాలను నేటి యువతరానికి గుర్తుచేస్తూ నవంబర్ 15 నుండి 21 వరకు రాష్ట్రంలో మూడు ప్రచార జాతలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈనెల నవంబర్ 17న గద్వాలనుంచి చేపట్టిన సిపిఐ జాతను18న దేవరకొండకు వస్తుందన్నారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, ఆంజనేయులు, వెంకట్‌రాములు, రాంరెడ్డి, యాదయ్య, వెంకటయ్య, మండల కౌన్సిల్ సభ్యులు కృష్ణయ్య, పుల్లయ్య, మాధవ రెడ్డి, మైనోద్దీన్, భూపాల్‌రెడ్డి, జ్యోతిబస్, నగేష్, మోహన్‌రెడ్డి, గోవర్ధన్, పర్వతాలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## శత జయంతి ఉత్సవాలకు పిలుపు

ప్రజాపక్షం/ఆలేరు : భారత కమ్యూనిస్టు పార్టీ ఆలేరు మండలం కొలను పాక గ్రామంలో శాఖ కార్యదర్శి పొన్నబోయిన రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. అలాగే అనేకసార్లు భూ పోరాటాలు చేసినా కూడా కొలనుపాకలో సర్వేనెంబర్ 8 ప్రభుత్వ భూమిని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం పేదలపై నిర్లక్ష్యం చూపుతుందని, ఇంటి స్థలాలు ఇచ్చేంతవరకు సిపిఐ పక్షాన పేదల కోసం పోరాటాలు చేస్తామని ప్రభుత్వం ను హెచ్చరించారు. ఈ సందర్భంగా హాజరైన సభ్యులు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చౌడబోయిన పరశురాములు, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు పోతు ప్రవీణ్, ఏఐటిసి మండల నాయకులు గిరబోయిన స్వామి, అఖిలభారత యువజన సమాఖ్య మండల నాయకులు, బర్ల ప్రశాంత్, కాటబోయిన కళ్యాణ్, గ్యార భుక్షపతి, చిరంజీవి, మహేందర్ యాదవ్, మోతే భవాని, సంపత్ యాదమ్మ, సుశీల, లక్ష్మి , ఉప్పలమ్మ, సరిత తదితరులు పాల్గొన్నారు.



## దేశ రాజకీయ చరిత్రలో సిపిఐకి ప్రత్యేక స్థానం

జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి

ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగె గ్రామంలో శుక్రవారం సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గూడెం వెంకటయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్రం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100ఏళ్లు పూర్తి చేసుకొని 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి భారత గడ్డపై 100ఏళ్లు పూర్తి చేసుకొని భారతదేశం స్వాతంత్ర్యం సంపూర్ణ మద్దతు ప్రకటించింది తొలుత గర్జించిన ఏకైక పార్టీ సిపిఐ అని సిపిఐ శత వసంతాల ఉత్సవాలను గల్లి నుండి ఢిల్లీ వరకు జెండాలు ఎగరవేస్తూ మండల కేంద్రంలో 100 జెండాలను కట్టాలని అన్నారు. ఖమ్మంలో జరిగే సిపిఐ 100ఏళ్లు పురస్కరించుకొని నిర్వహించే ముగింపు బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈనెల 21న సిపిఐ బస్సు యాత్రకు స్వాగతం పలకాలని, నూతన సభ్యత్వాలను పునరుద్ధరించాలని, శాఖ సమావేశాలను ఏర్పాటు చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర, మండల కార్యదర్శి రామచంద్రయ్య, మండల కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, శ్రీను, స్వామి, కొమురయ్య, బిక్షం, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : కుడకుడ జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాలల దినోత్సవం 2025 వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటి సెక్రటరీ, జడ్జి పర్వీన్ కౌసర్ హాజరై పిల్లల హక్కులు, విద్య ప్రాముఖ్యత, బాలల భవిష్యత్తు నిర్మాణంలో సమాజం బాధ్యతలపై విలువైన సూచనలు ఇచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహరావు మాట్లాడుతూ సమాజంలో పిల్లల సంరక్షణ ఇది చాలా సున్నితమైన విషయమన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తీసుకొని పిల్లల సంరక్షణకు అందరూ తమ వంతు కృషి చేయాలని చెప్పారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడాపోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడబ్లుసి చైర్మన్ బిఆర్ రమణ, సిడిపిఓలు సుబ్బలక్ష్మి , శ్రీవాణి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్షిత, అసిస్టెంట్ కమీషనర్ లేబర్ అరుణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్న కుమార్ తెలిపారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని తిరుమల గ్రాండ్ రెస్టారెంట్ బాంకెట్ హాల్‌లో డిఎస్‌పి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా కమిటీలతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 18 రోడ్డు ప్రమాద బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రణాళిక మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ రోడ్డు సేఫ్టీ కమిటిల నందు పోలీస్, రిటైర్డ్ టీచర్స్, గ్రామస్థాయి పెద్దలు, వ్యాపార ప్రతినిధులు, మహిళా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు ఉంటారన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూర్యాపేట వైద్యులు పాల్గొని ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణా లు కాపాడడానికి సిపిఆర్ చాలా విలువైందని, సిపిఆర్ పద్ధతిపై అందరికి అవగాహన కలిగి ఉండాలని, సిపిఆర్ చేసే విధానాన్ని రోడ్డు భద్రతా కమిటిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, సూర్యాపేట రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, రూరల్ ఎస్ఐ బాలు నాయక్, మద్దిరాల ఎస్ఐ వీరన్న, అర్వపల్లి ఎస్ఐ సైదులు, ఐఎంఏ సూర్యాపేట వైద్యులు, రోడ్డు భద్రత కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## విద్య విలువైన సంపద





ప్రజాపక్షం/మిర్యాలగూడ: విద్య విలువైన సంపద అని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి దేశం గర్వించేలా ఎదగాలని సెయింట్ జాన్స్ స్కూల్ చైర్మన్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరస్పాండెంట్ శిరీషలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని చైతన్యనగర్‌లో గల సెయింట్ జాన్స్, శిష్య దిస్కూల్ పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విద్యార్థినిలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అదే విధంగా చిన్నారులు పలు ఫ్యాన్సీ డ్రెస్‌లు వేసుకొని పలువురిని అలరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని నెహ్రూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాల్గొన్న విధానం గురించి విద్యార్థులకు వివరించారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులు అని అన్నారు. మంచి సమాజం తయారుకావాలంటే పిల్లలు క్రమ శిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని వారు అన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, చక్కగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత... చార్లెస్ మాథ్యూ**




బాల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని నవజ్యోతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చార్లెస్ మాథ్యూ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్మషం లేని మనస్తత్వం, ప్రేమ కలిగిన విద్యార్థులకు ప్రేమ, ఆప్యాయతలను పంచి చేరతీసినప్పుడే ఉన్నతమైన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుందన్నారు. నైతిక విలువలు, ఉత్తమ క్రమశిక్షణ, తల్లిదండ్రులను పెద్దలను గౌరవించే తత్వాన్ని పెంపొందించి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి పునాదులు వేసే బాధ్యత గురువులదేనన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్మి, సుజాత, మసూద్ పాల్గొన్నారు.

**అభ్యాస్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం...**



అభ్యాస్ ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ వంగాల నిరంజన్‌రెడ్డి, డైరెక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో చిన్నారులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వంగాల నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయ నాయకుల వేషాలతో ఆకట్టుకున్నారు. క్విజ్, వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రోత్సాహ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఫర్వీన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## గుంతలో కారు పడి ఐదుగురు మృతి



**రత్లం/ఇండోర్ :** మధ్యప్రదేశ్‌లోని రత్లం జిల్లాలో శుక్రవారం వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి, ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న అడ్డంకిని ఢీకొట్టి గుంతలో పడి ఐదుగురు మృతి చెందారని పోలీసులు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యాలయం నుండి 30 కి.మీ దూరంలో ఉన్న రావతి పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని ఎనిమిది లైన్ల ఢిల్లీముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ఉదయం ఈ ప్రమాదం జరిగిందని పోలీసు సూపరింటెండెంట్ అమిత్ కుమార్ పిటిఐకి తెలిపారు. వాహనం వేగంగా నడుపుతూ బలమైన అల్యూమినియం అడ్డంకిని ఢీకొట్టి గుంతలోకి దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 15 ఏళ్ల బాలుడు, 70 ఏళ్ల వృద్ధుడు సహా ఐదుగురు మృతి చెందారని ఆయన అన్నారు. డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నట్లు కుమార్ చెప్పారు. మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం పంపారని, దర్యాప్తు జరుగుతోందని ఆయన తెలిపారు.

## బిహార్‌లోనూ 'ఓట్ చోరీ'

### సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వెల్లడయ్యాయి. ఎన్‌డిఎ కూటమి ఘన విజయం సాధించింది. అయితే బిహార్‌లో కూడా 'ఓట్ చోరీ' జరిగిందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య ఆరోపించారు. కాంగ్రెస్–ఆర్‌జెడి నేతృత్వంలోని కూటమి వెనుకబడటానికి, ఎన్‌డిఎ మెజారిటీతో విజయం వైపు పయనించడానికి గల కారణాలపై తనకు ఇంకా సమాచారం రాలేదని ఆయన అన్నారు. 'మనం ప్రజల ఆదేశాన్ని అంగీకరించాలి. ఆ వెనుకబాటుకు కారణమేమిటో నాకు తెలియదు. నేను అక్కడికి (బిహార్‌కు) వెళ్ళలేదు. (మాకు) ఎవరు ఓటు వేయలేదు. ఎన్‌డిఎ ఎందుకు పెద్ద మెజారిటీతో గెలిచిందో నాకు తెలియదు. నేను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను' అని బిహార్‌లో మహాఘట్బంధన్‌కు ఎదురుదెబ్బ తగిలిన ప్రశ్నకు సమాధానంగా సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. బిహార్‌లో ఒబిసి ఓట్లు నిర్ణయాత్మకమైనప్పటికీ, ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని అడిగిన ప్రశ్నకు 'నాకు తెలియదు. నితీష్ కుమార్ ఎవరు? అతను ఒబిసి కాదా? బదులిచ్చారు. బిహార్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్, ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన 'ఓటు చోరీ' ఆరోపణల గురించి అడిగినప్పుడు, 'వారు ఇక్కడ కూడా చోరీ చేశారు' అని ముఖ్యమంత్రి అన్నారు.

**కొత్త వ్యూహం రూపొందించాలి : డికె**

బిహార్ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి కోసం భవిష్యత్తు కోసం కొత్త వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ భావించారు. కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా అయిన శివకుమార్ బిహార్ ఎన్నికలు ఫలితాలు తమ పార్టీకి, మిత్ర పక్షాలకు పాఠంగా ఆయన అభివర్ణించారు. 'ప్రజలు ఈ ఆదేశాన్ని ఇచ్చారు. ఇది మాకు ఒక పాఠం. భవిష్యత్తులో మేము కాంగ్రెస్ పార్టీకి, ఇండియా కూటమి కోసం కొత్త వ్యూహాన్ని రూపొందిస్తాము' అని శివకుమార్ పిటిఐకి తెలిపారు. బిహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ పనితీరుకు మహిళలకు రూ.10,000 డిబిటి, మహిళా ఓటర్ల పెరుగుదల కారణమా అని అడిగినప్పుడు ఫలితాలపై వివరణాత్మక నివేదిక వచ్చిన తర్వాత స్పందిస్తానన్నారు.

## బిహార్‌లోనూ మహారాష్ట్ర నమూనా

### ఎన్నికల ఫలితాలు దిగ్భ్రాంతికరమైనవేమీ కావు : రౌత్



**ముంబయి :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దిగ్భ్రాంతికరమైనవి కావని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్, బిజెపి తమ జాతీయ ఎజెండాను అమలు చేయడానికి చేతులు కలిపి పనిచేసినందు వల్లే విజయం సాధ్యమైందని విమర్శించారు. 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల 'నమూనా'ను బిహార్ ఎన్నికల ఫలితాలు అనుసరించాయని, అందులో బిజెపి, శివసేన, ఎన్‌సిపిల అధికార మహాయుతి కూటమి అద్భుతమైన విజయాన్ని నమోదు చేసిందని కూడా ఆయన అన్నారు. బిహార్ ఫలితాలు 2024లో ఎన్నికల ఫలితాలను సూచిస్తున్నాయని, రాష్ట్రంలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) తుడిచిపెట్టుకుపోయిందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో షాక్ అవ్వాల్సిన అవసరం లేదని, ఎన్నికల కమిషన్, బిజెపి కలిసి నిర్వహిస్తున్న జాతీయ ఎజెండాను చూస్తే, దీనికి భిన్నమైన ఫలితం సాధ్యం కాలేదన్నారు. ఇది మహారాష్ట్ర నమూనా లాంటిదేనని ఆయన తెలిపారు. అధికారంలోకి వస్తుందని భావించిన కూటమి 50 సీట్ల కంటే దిగువకు పడిపోయిందని రౌత్ ఆరోపించారు.

## కూలిన ఐఎఎఫ్ శిక్షణా విమానం



**చెన్నై :** భారత వైమానిక దళానికి (ఐఎఎఫ్) చెందిన శిక్షణా విమానం ప్రమాదానికి గురైంది. సింగిల్ సీటర్ ట్రైనర్ విమానం చెన్నైలోని తాంబరం ఎయిర్ బేస్ సమీపంలో కుప్పకూలింది. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పైలట్‌ను రక్షించారు. అనంతరం ప్రమాదం గురించి అధికారులకు సమాచారం ఇచ్చారు. సాధారణ శిక్షణా సమయంలో ప్రమాదవశాత్తూ కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. అయితే, అదృష్టవశాత్తూ పైలట్ సురక్షితంగా ప్రాణాలతో బయట పడ్డారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేస్తున్నారు.

## అవయవాల అక్రమ రవాణా...

### ప్రధాన నిందితుడు అరెస్టు



**కొచ్చి:** అక్రమ అవయవ దానం కోసం ఇరాన్‌కు వ్యక్తులను రవాణా చేసిన కేసులో ప్రధాన నిందితుడిని జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. కేరళలోని ఎర్నాకుళంకు చెందిన మధు జయ కుమార్ ఈనెల 8న ఇరాన్ నుండి వచ్చిన తర్వాత అరెస్టు చేసినట్లు వర్గాలు తెలిపాయి. జాతీయ సంస్థ పిటిషన్ తర్వాత, మధును 12న కొచ్చిలోని కోర్టులో హాజరుపరిచినట్లు వర్గాలు తెలిపాయి. 19వ తేదీ వరకు కోర్టు ఎన్‌డిఎ కస్టడీ విధించింది. ప్రస్తుతం కొచ్చిలోని ఎన్ఐఎ కార్యాలయంలో ఆయనను ప్రశ్నిస్తున్నారు. మే 18, 2024న కొచ్చి విమానాశ్రయంలోని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారులు అవయవ అక్రమ రవాణా నెట్‌వర్క్‌లో ప్రమేయం ఉందనే అనుమానంతో ఒక యువకుడిని అడ్డుకున్నప్పుడు కేసు ప్రారంభమైంది. ఈ దర్యాప్తును మొదట ఎర్నాకుళం గ్రామీణ పోలీసులు నిర్వహించగా, ఆ తరువాత ఎన్ఐఎ స్వాధీనం చేసుకుంది. నిందితులు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని, చట్టబద్ధమైన అవయవ దానం పేరుతో వారిని ఇరాన్‌కు రప్పించారని దర్యాప్తులో తేలింది. వారు అవయవ గ్రహీతలను కూడా గుర్తించి, ఇరానియన్ ఆసుపత్రులలో వారికి చికిత్సను సులభతరం చేశారు. అక్కడ ఈ ప్రక్రియ చట్టబద్ధమైనదని తప్పుగా పేర్కొన్నారు. గత సంవత్సరం ఎన్ఐఎ మధు, సబిత్, సజిత్ శ్యామ్, బెల్లంకొండ రామ్ ప్రసాద్ లపై చార్జిషీట్ దాఖలు చేసింది. ఫిబ్రవరి 2025లో ఇరాన్‌లో నివసిస్తున్న మధుపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయబడింది. ఇరాన్‌లో అవయవ అక్రమ రవాణా కార్యకలాపాలను నియంత్రిస్తూ, అక్కడి ఆసుపత్రులతో సమన్వయం చేసుకుంటూ మధు అరెస్టు ఎన్ఐఎకు చాలా కీలకమని వర్గాలు తెలిపాయి.

## ఉప ఎన్నికల్లో అధికార పార్టీలకు చుక్కెదురు

### నాలుగు నియోజకవర్గాల్లో ఓడిన పాలక పార్టీలు




**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 11వ తేదీన ఉప ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. నాలుగు స్థానాల్లో అధికార పార్టీ అభ్యర్థులు ఓటమి చవిచూశారు. బిజెపి పాలిత రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఒక స్థానాన్ని గెలుచుకోగా, జమ్ముకశ్మీర్‌లోని బుద్గామ్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌కు పిడిపి తొలిసారిగా ఓటమిని మిగిల్చింది. జమ్ముకశ్మీర్‌లోని నగ్రోటా స్థానాన్ని బిజెపి గెలుచుకుంది. మిజోరాం ప్రధాన ప్రతిపక్ష పార్టీ మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) తన అభ్యర్థి ఆర్ లాల్తాంగ్లియానా 562 ఓట్ల తేడాతో పాలక జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్‌కు చెందిన వన్‌లాల్‌సైలోవాను ఓడించి దంపా అసెంబ్లీ స్థానాన్ని నిలుపుకుంది. అంటా (రాజస్థాన్), ఘట్‌శిల (జార్ఖండ్, జూబ్లీహిల్స్ (తెలంగాణ), టర్న్ తరన్ (పంజాబ్), నువాపాడ (ఒడిశా)లలో కూడా ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, బిజెపిలు ఒక్కొక్క స్థానాన్ని గెలుచుకోగా, ఆప్, జెఎంఎం కూడా ఒక్కొక్క స్థానంలో విజయం సాధించాయి. ఒడిశాలోని నువాపాడలో బిజెపికి చెందిన జై ధోలాకియా కాంగ్రెస్‌కు చెందిన ఘాసిరామ్ మాఝిపై 83,748 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. జై దివంగత బిజెడి ఎమ్మెల్యే రాజేంద్ర ధోలాకియా కుమారుడు. ఆయన మరణంతో ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. నగ్రోటాలో బిజెపికి చెందిన దేవయాని రాణా జమ్ముకశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ (జెకెఎన్‌పిపి) అభ్యర్థి హర్ష్ దేవ్ సింగ్‌ను 24,647 ఓట్ల తేడాతో ఓడించారు. 10,872 ఓట్లు పొందిన ఎన్‌సి అభ్యర్థి షమీమ్ బేగం డిపాజిట్ కోల్పోయారు. రాణా మాజీ ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా కుమార్తె. ఆయన మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. జమ్ముకశ్మీర్‌లోని బుద్గామ్ ఉప ఎన్నికలో ప్రతిపక్ష పిడిపికి చెందిన ఆగా సయ్యద్ ముంతాజీర్ అధికార ఎన్‌సి అభ్యర్థి అగా సయ్యద్ మెహమూద్‌ను 4,478 ఓట్ల తేడాతో ఓడించారు. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుండి గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆ స్థానాన్ని ఖాళీ చేసి తన కుటుంబ కంచుకోట అయిన గందర్‌బాల్‌ను ఎంచుకున్న తర్వాత బుద్గామ్‌లో ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. 1957లో శాసనసభకు తొలి ఎన్నికలు జరిగిన తర్వాత మధ్య కశ్మీర్‌లోని బుద్గాంలో ఎన్‌సి ఓడిపోవడం ఇదే తొలిసారి. రాజస్థాన్‌లోని అంటా అసెంబ్లీ నియోజకవర్గంలో, తెలంగాణలోని జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం సాధించింది. అంటలో, ప్రమోద్ జైన్ భయా తన సమీప ప్రత్యర్థి , బిజెపి అభ్యర్థి మోర్పాల్ సుమన్‌ను 15,612 ఓట్ల తేడాతో ఓడించారు. క్రిమినల్ కేసులో దోషిగా తేలిన తర్వాత బిజెపి ఎమ్మెల్యే కన్వర్ లాల్ మీనాను అనర్హుడిగా ప్రకటించిన తర్వాత ఉప ఎన్నిక తప్పనిసరి అయింది. తెలంగాణలో కాంగ్రెస్‌కు చెందిన నవీన్ యాదవ్ తన సమీప బిఆర్‌ఎస్ ప్రత్యర్థి మాగంటి సునీతను 24,729 ఓట్ల తేడాతో ఓడించి జూబ్లీహిల్స్ స్థానాన్ని గెలుచుకున్నారు. జూన్‌లో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక జరిగింది. పంజాబ్‌లోని టర్న్ తరన్ అసెంబ్లీ స్థానాన్ని అధికార ఆప్ తన అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధు సమీప ప్రత్యర్థి, ఎస్‌ఎడి అభ్యర్థి సుఖ్వీందర్ కౌర్ రాంధ్వాను 12,091 ఓట్ల తేడాతో ఓడించి మళ్లీ ఆ స్థానాన్ని నిలుపుకుంది. జూన్‌లో ఆప్ ఎమ్మెల్యే కాశ్మీర్ సింగ్ సోహల్ మరణంతో టర్న్ తరణ్ స్థానం ఖాళీ అయింది.

జార్ఖండ్‌లోని ఘట్‌షిల అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో జెఎంఎం అభ్యర్థి సోమేశ్ చంద్ర సోరెన్ తన సమీప ప్రత్యర్థి బిజెపికి చెందిన బాబు లాల్ సోరెన్‌ను 38,500 ఓట్ల తేడాతో ఓడించారు. ఆగస్టు 15న మరణించిన జెఎంఎం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్ కుమారుడు సోమేశ్. జూలై 21న ప్రస్తుత మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) శాసనసభ్యుడు లాల్‌రింట్లుంగా సైలో మరణంతో దంప స్థానం ఖాళీ అయింది.

## ఐదు స్థానాల్లో ఎంఐఎం విజయం




**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని ప్రధాన పార్టీలు చతికిల పడ్డప్పటికీ ముస్లిం మెజార్టీ 'సీమాంచల్' ప్రాంతంలో మజ్లిస్ పార్టీ సత్తా చాటుకుంది. గత ఎన్నికల్లో గెలిచిన 5 స్థానాల్లో, ఈసారి కూడా అసదుద్దీన్ ఒవైసీ 'పతంగి' రివ్వున ఎగిరింది. ముస్లిం ఓటుబ్యాంకు రేసులో ఆర్‌జెడి, కాంగ్రెస్‌లను మజ్లిస్ దాటేసింది. జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు సరిసమాన స్థాయిలో 5 సీట్లను గెల్చుకొని ఔరా అనిపించింది. 47 శాతం ముస్లిం జనాభా ఉన్న సీమాంచల్ ప్రాంతంలో మజ్లిస్ హవా కొనసాగింది. అమౌర్, బహదూర్‌గంజ్, బైసి, జోకిహాట్, కొచధమాన్ సీట్లను వరుసగా రెండోసారి ఆ పార్టీ కైవసం చేసుకుంది. అమౌర్ స్థానంలో 38,928 ఓట్ల తేడాతో అఖ్తరుల్ ఇమాన్ గెలిచారు. కొచధమాన్ స్థానంలో 23,021 ఓట్ల తేడాతో మహ్మద్ సర్వర్ ఆలం విజయం సాధించారు. జోకిహాట్ స్థానంలో మహ్మద్ ముర్షిద్ ఆలం, బహదూర్‌గంజ్ స్థానంలో మహ్మద్ తౌసిఫ్ ఆలం, బైసి స్థానంలో గులాం సర్వర్ గెలుపొందారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ ఐదు స్థానాల్లో మజ్లిస్ పార్టీయే గెలిచింది. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత నలుగురు మజ్లిస్ ఎమ్మెల్యేలు ఆర్‌జెడిలోకి జంప్ అయ్యారు. అయినప్పటికీ వరుసగా రెండోసారి ఆ స్థానాలను మజ్లిస్ పార్టీ నిలుపుకోవడం విశేషం. ఈ సీట్లలో ఒవైసీకి పెరుగుతున్న పట్టుకు తాజా ఫలితం నిలువెత్తు నిదర్శనం. ఈ వరుస విజయాలను పునాదిగా చేసుకొని రాబోయే రోజుల్లో సీమాంచల్‌లోని అరారియా, కిషన్‌గంజ్, కతిహార్, పూర్ణియా జిల్లాలపై పట్టు బిగించేందుకు మజ్లిస్ వ్యూహ రచన చేసే అవకాశాలు ఉన్నాయి.

## ఫలితాలు పూర్తిగా అసహజమైనవి

### సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య



**న్యూఢిల్లీ :** బిహార్ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేవని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జనరల్ సెక్రటరీ దీపాంకర్ భట్టాచార్య అన్నారు. రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం, 2010 పనితీరును ఎలా పునరావృతం చేస్తుందో వివరించలేని విధంగా ఉందని భట్టాచార్య అన్నారు. 'ఫలితాలు పూర్తిగా అసహజమైనవి; ఇవి బిహార్ వాస్తవ పరిస్థితులకు ఏమాత్రం అనుగుణంగా లేవు' అని భట్టాచార్య పిటిఐకి తెలిపారు. శుక్రవారం ఉదయం ఎక్స్‌లో పోస్టు చేస్తూ సర్ తర్వాత బిహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్ల జాబితా ఉందని, పోల్ తర్వాత ఇసిఐ ప్రెస్ నోట్ ఈ సంఖ్యను 7,45,26,858గా పేర్కొందన్నారు. అంటే మూడు లక్షల ఓటర్లు పెరిగారని, ఈ 'అదనపు 2 ఎబి' ఎక్కడి నుండి వచ్చిందని ప్రశ్నిస్తూ, ఇసిఐ వివరించడానికి శ్రద్ధ వహిస్తుందా నిలదీశారు.

## ఫెమా కేసులో సమన్లు దాటవేసిన అనిల్ అంబానీ...

### 17న హాజరు కావాలని ఇడి తాజా నోటీస్ జారీ

### 'వర్చువల్ మార్గాల' ద్వారా సాక్ష్యం చెబుతానన్న అంబానీ ప్రతిపాదనను తిరస్కరించిన 'ఇడి'




**న్యూఢిల్లీ :** రిలయన్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ అనిల్ అంబానీ తన షెడ్యూల్ తేదీని దాటవేయడంతో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆయనను ఫెమా కేసులో నవంబరు 17న తమ ముందు హాజరు కావాలంటూ తాజా సమన్లను జారీచేసింది. 'వర్చువల్ మార్గాల' ద్వారా సాక్ష్యం చెబుతానన్న అంబానీ ప్రతిపాదనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తిరస్కరించిందని ఇడి వర్గాలు తెలిపాయి. 66 సంవత్సరాల వ్యాపారవేత్త ప్రతినిధి ఒక ప్రకటనలో, దర్యాప్తులో పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇస్తూ ఫెడరల్ దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఒక లేఖ రాశారని తెలిపారు. విదేశీ మారక ద్రవ్య చట్టం (ఫెమా) కింద శుక్రవారం స్వయంగా దరఖాస్తు చేసుకుని తన స్టేట్‌మెంట్‌ను నమోదు చేసుకోవాలని ఏజెన్సీ అంబానీని కోరిందని వర్గాలు వెల్లడించిన సమాచారం.ఈ దర్యాప్తు జైపూర్‌రీన్‌గస్ హైవే ప్రాజెక్ట్‌కు సంబంధించినది. ఇటీవల అంబానీ మరియు అతడి కంపెనీలకు చెందిన రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అటాచ్ చేసిన తర్వాత రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌పై జరిపిన సోదాల్లో రూ.40కోట్లు హైవే ప్రాజెక్ట్ నుండి 'సిఫోన్డ్' చేయబడినట్లు తేలిందని ఇడి గతంలో ఒక ప్రకటనలో తెలియజేసింది. 'సూరత్‌లోని షెల్ కంపెనీల ద్వారా దుబాయ్‌కు నిధులు తరలించబడ్డాయి. ఈ ట్రయల్‌లో రూ.600 కోట్లకు మించి అంతర్జాతీయ హవాలా నెట్‌వర్క్ బయటపడింది' అని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. 'హవాలా డీలర్లుగా ఆరోపించబడుతున్న కొంతమంది వ్యక్తుల వాంగ్మూలాలను ఇడి నమోదు చేసింది. ఆ తర్వాత వారు అంబానీని విచారించాలని నిర్ణయించుకున్నారు' అని ఆ వర్గాలు తెలిపాయి. హవాలా అంటే అక్రమ నిధుల తరలింపు అని అర్థం. 'ఈ విషయం( ఫెమా కేసు)15సంవత్సరాల నాటిది. అంటే 2010 నాటిది. రోడ్డు కాంట్రాక్టర్‌తో సంబంధం ఉన్న సమస్యలకు సంబంధించినది' అని ఒక ప్రకటన తెలిపింది. 2010లో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జె.ఆర్ టోల్ రోడ్డును నిర్మించడానికి ఇపిసి (ఇంజనీరింగ్, సేకరణ, నిర్మాణం) కాంట్రాక్ట్‌ను ఇచ్చింది. ఇది పూర్తిగా దేశీయ ఒప్పందం. ఎటువంటి విదేశీ మారకం అంశీభూతం ఇందులో లేదు. 2021 తర్వాత జెఆర్ టోల్ రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యింది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వద్ద ఉంది అని ప్రకటన పేర్కొంది. 'అంబానీ రిలయన్స్ ఇన్‌ఫ్రా బోర్డ్‌లో సభ్యుడు కాదు. ఆయన ఏప్రిల్ 2007 నుండి మార్చి 2022వరకు దాదాపు 15సంవత్సరాల పాటు సేవలు అందించాడు. కేవలం నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మాత్రమే ఉన్నాడు. ఆయన ఎప్పుడూ రోజువారీ కంపెనీ మేనేజ్‌మెంట్‌లో పాల్గొనలేదు'అని తెలిపింది. తన గ్రూప్‌కంపెనీలపై జరిగిన రూ.17,000కోట్ల మోసానికి సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆ వ్యాపారవేత్తను ఒకప్పుడు అంబానీని ప్రశ్నించింది.

## కీలక వైకల్య సాధికారత కమిటీ

## ఎంపిల నియామకానికి కేంద్రం నోటిఫై



**న్యూఢిల్లీ :** సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ వైకల్యాలు ఉన్న వ్యక్తుల హక్కుల చట్టం2016 ప్రకారం కీలక కమిటీల కూర్పులో మార్పులను కేంద్రం నోటిఫై చేసింది. ఈ కీలక కమిటీలో ఇద్దరు లోక్‌సభ సభ్యులను తన కొత్త ప్రతినిధులుగా నియమించింది. దీనికి సంబంధించి ఇటీవల సోమవారం విడుదల చేసిన ఒక గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం..గతంలో నామినేట్ చేయబడిన ఎంపీల స్థానంలో ఇ.టి.మహ్మద్ బషీర్, సి.ఎన్.మంజునాథన్‌లను నియమిస్తూ కమిటీ నిర్మాణాన్ని వివరించే 2017 ఉత్తర్వును కేంద్రం సవరించింది. వైకల్యాలకు సంబంధించిన విధానాలను సమీక్షించడానికి, సమస్యలను పరిశీలించే పార్లమెంటరీ ప్యానెళ్లకు సహాయం చేయడానికి వికలాంగుల సాధికారత శాఖగా ఏర్పాటు చేయబడిన ప్యానెల్‌లో ఇద్దరు శాసనసభ్యులు ఇప్పుడు ఎన్నికైన పార్లమెంట్ సభ్యుల వర్గం కింద సభ్యులుగా వ్యవహరిస్తారు. వికలాంగుల హక్కుల చట్టంలోని సెక్షన్ 60 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి ఈ సవరణ చేయబడింది. ఇది చట్టాన్ని అమలుచేయడానికి అవసరమైన నియమాలను రూపొందించడానికి, సవరించడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఇస్తుంది. కమిటీని ఏర్పాటు చేస్తూ అసలు నోటిఫికేషన్ 2017నవంబరులో జారీ చేయబడింది.అప్పటి నుండి జూన్ మరియు అక్టోబరులలో సవరణలకు గురైంది. ఈ తాజా మార్పులను సీరియల్ నెంబర్ 3, క్లాజ్ (ఎ)ని అప్‌డేట్ చేస్తుంది. మునుపటి సబ్ క్లాజ్‌లను కొత్తగా నామినేట్ చేయబడిన ఇద్దరు ఎంపీలతో భర్తీ చేయడం జరిగింది.

## జ్ఞానేష్ కుమార్‌దే కీలకపాత్ర

### బిహార్ ఎన్నికల ఫలితాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ఆరోపణలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నేత భూపేష్ బఘేల్



**దుర్గ్ :** ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత భూపేష్ బఘేల్ ఎన్నికల కమిషన్‌పై మండిపడ్డారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ భారీ విజయాన్ని నమోదు చేయడంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్‌డిఎ విజయంలో జ్ఞానేష్ కీలక పాత్ర పోషించారని, ఎన్నికల ఫలితాలకు ఆయనే బాధ్యత వహించారని భూపేష్ బఘేల్ విమర్శించారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై ఎలాంటిదో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బిహార్ ఎన్నికలకు కాంగ్రెస్ సీనియర్ పరిశీలకుడిగా ఉన్న బఘేల్ దుర్గ్‌లో పిటిఐతో మాట్లాడుతూ ఎన్‌డిఎ నాలుగింట ఒక వంతు మెజారిటీ వైపు పయనిస్తోందని ట్రెండ్స్ సూచిస్తున్నాయి.(కేంద్ర హోం మంత్రి) అమిత్‌షా ఇప్పటికే దీని గురించి మాట్లాడారు. ఈ మొత్తం ఎన్నికలకు (ఫలితానికి) బాధ్యత వహించే వ్యక్తి ఎవరైనా ఉంటే అది జ్ఞానేష్ కుమార్ అని, అందుకు తాను ముందుగానే ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియ చేస్తున్నామన్నారు. అయితే జ్ఞానేష్ కుమార్‌పై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించగా, 'ఎన్నికల సంఘం పనిచేసిన విధానం బిహార్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల, బాధ్యత వహించే వారు ఎవరినైనా అభినందించాలి. ఈ మొత్తం ఎన్నికల్లో జ్ఞానేష్ కుమార్ జీ పాత్ర కీలకం' అని అన్నారు. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) ఇమేజ్ 'జంగల్ రాజ్' అయితే, కాంగ్రెస్ ఆ పార్టీతో ఎందుకు పొత్తు పెట్టుకుంటోంది అని ప్రశ్నించగా, '20 సంవత్సరాల క్రితం జన్మించిన వారికి జంగిల్ రాజ్ గురించి తెలియదు. ప్రస్తుత జంగిల్ రాజ్ గురించి వారికి తెలుసు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిఒక్కరికీ మోదీ,షా జంగిల్‌రాజ్ గురించి తెలుసు' అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎంలు) పాత్ర గురించి లేవనెత్తిన ప్రశ్నలపై స్పందిస్తూ ఇంకా చాలా విషయాలు బయటకు వస్తాయన్నారు.

## సీట్ల పంపకాల్లో జెఎంఎంపై వివక్ష

### ఫలితాల్లో మహాగఠ్‌బంధన్ పేలవ ప్రదర్శన : జెఎంఎం



**రాంచి :** బిహార్‌లోని మహాఘట్బంధన్ కూటమిలో భాగస్వామిగా ఉన్న తమపై సీట్ల పంపకాల విషయంలో తమపై వివక్ష చూపించారని జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) ఎంపి మహువా మాజీ పేర్కొన్నారు. అయితే శుక్రవారం వెల్లడియిన ఫలితాల్లో దుర్భరమైన ప్రదర్శనను కనబరిచిందన్నారు. సీట్ల పంపకాల ఒప్పందం సమయంలో మహాగఠబంధన్ ధర్మాన్ని నెరవేర్చడంలో లోపం ఉందని ఆమె అన్నారు. 'మేము ఇండియా కూటమిలో భాగం. సీట్ల పంపకాల ఒప్పందం చివరి నిమిషంలో జెఎంఎం వివక్షను ఎదుర్కొంది. పోటీ చేయడానికి మాకు సీట్లు కేటాయించాల్సి ఉంది. కానీ సీట్లు మాకు ఇవ్వలేదు. బిహార్‌లో మహాఘగట్బంధన్ ధర్మాన్ని నెరవేర్చడంలో లోపం ఉంది' అని రాజ్యసభ ఎంపి ఆరోపించారు. కాగా, జార్ఖండ్ అధికార పార్టీ అయిన జెఎంఎం అక్టోబర్ 20న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోమని ప్రకటించింది. మిత్రపక్షాలు ఆర్‌జెడి, కాంగ్రెస్ రాజకీయ కుట్ర నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. జెఎంఎం బిహార్‌లోని 12 స్థానాల్లో పోటీ చేయాలని కోరుకుందని, కానీ తరువాత ఆరు స్థానాల్లో స్వతంత్రంగా పోటీ చేస్తామని ప్రకటించింది. అయితే, పార్టీ నుండి ఏ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయలేదు. బిహార్‌లో కాంగ్రెస్ పనితీరుపై మాజీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ తగిన అభ్యర్థులను నిలబెట్టలేకపోయిందని నేను భావిస్తున్నాను. బిహార్‌లో తుది ఫలితాలు ప్రకటించే నాటికి మహాఘట్బంధన్ మొత్తం పనితీరు మెరుగుపడుతుందని ఆశిస్తున్నాను' అని ఆమె అన్నారు.

## సూసైడ్ బాంబర్ ఉమర్‌నబీ ఇల్లు కూల్చివేత



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారులో ఆత్మాహుతి దాడికి పాల్పడిన ఉగ్రవాది ఉమర్ ఉన్ నబీ అలియాస్ ఉమర్ మహమ్మద్ ఇంటిని శుక్రవారం భద్రతా దళాలు కూల్చివేశాయి. కశ్మీర్‌లోని పుల్వామాలో ఉన్న ఆ ఇంటిని భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. గురువారం అర్థరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కూల్చివేత ప్రక్రియ కొనసాగింది. పేలుడు పదార్థాలు దాచేందుకు ఆ ఇంటి ఉమర్ నబీ వాడుకున్నట్లు గుర్తించారు. హుందయ్ ఐ20 కారుతో పేలుడుకు పాల్పడిన ఉమర్ నబీ.. డిఎన్ఎ శ్యాంపిళ్లను కన్ఫర్మ్ చేశారు. ఢిల్లీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 13 కాగా, 20 మందికిపైగా గాయపడ్డ విషయం తెలిసిందే. ఎర్రకోట సమీపంలోని నేతాజీ సుభాష్ మార్గ్ వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర పేలుడు ఘనట జరిగింది. ఉగ్రకార్యకలాపాలకు మద్దతు ఇచ్చే వారికి ఇలాంటి శిక్షే ఉంటుందన్న ఉద్దేశాన్ని తెలిపేందుకు ఉమర్ నబీ ఇంటిని పేల్చివేశారు. భారత భూభాగంపై ఉగ్రకార్యకలాపాలకు చోటు లేదన్న సంకేతాన్ని వినిపించారు

## వృక్షమాత పద్మశ్రీ తిమ్మక్క కన్నుమూత



**బెంగళూరు :** ప్రకృతితో ఐక్యంగా జీవితాన్ని మార్చుకున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రకృతి పరిరక్షకులు, ప్రముఖ పర్యావరణవేత్త అవార్డు గ్రహీత సాలుమరద తిమ్మక్క కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 114. గతకొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తిమ్మక్క బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. 1911, జూన్ 30న తుమకూరు జిల్లాలోని గుబ్బి తాలూకాలో తిమ్మక్క జన్మించారు. కర్ణాటక గ్రామీణ ప్రాంతాలను సస్యశ్యామలం చేయడంలో ఎంతో కృషి చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. 25 సంవత్సరాల వరకు పిల్లలు కలగకపోవడంతో మొక్కల్నే పిల్లలుగా భావించి, పచ్చదనం, పర్యావరణం కోసం ఆమె పనిచేస్తున్నారు. తిమ్మక్క అందించిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2019లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. అంతేకాదు, బిబిసి ఎంపిక చేసిన 100 మంది ప్రభావశీల మహిళల జాబితాలో తిమ్మక్క ఒకరిగా నిలిచారు. ఆమె మరణ వార్త తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ, ప్రకృతి ప్రేమికులు సంతాపం తెలియజేస్తున్నారు.

ప్రజాపక్షం
శనివారం, 15 నవంబరు

# కాంగ్రెస్ చేతికి జూబ్లీహిల్స్

హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌పై (ఆయన అకాల మరణం వల్లనే ఉప ఎన్నిక అవసరమైంది) దాదాపు 25 వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందటం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కొండంత ప్రోత్సాహకంగా పనిచేస్తుంది.

గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ది కాని ఈ నియోజకవర్గం కాంగ్రెస్ ఖాతాకు చేరటం మాత్రమే ఘనత కాదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ హైదరాబాద్ మహానగరిలో దానికి ఒక్కసీటు లభించని నేపథ్యంలో, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో గెలుపు తదుపరి జూబ్లీహిల్స్ కాంగ్రెస్ వశం కావటం నగరంలో పార్టీని పటిష్ఠం చేసేందుకు తోడ్పడుతుంది. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జిహెచ్ఎంసి) ఎన్నికల్లో ఇది పాలకపార్టీకి తప్పక సహాయకారి అవుతుంది. అంతేకాదు, పోలైన ఓట్లలో 51శాతంపైగా ఓటు వాటా కాంగ్రెస్‌కు లభించటం తెలంగాణ ఎన్నికల చరిత్రలో ఇదే ప్రథమం. రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల క్షేత్రంలోకి లంఘించేందుకు ఈ ఉప ఎన్నిక ఫలితం కాంగ్రెస్ పార్టీని పురికొల్పుతుంది. అన్నిటికీ మించి రేవంత్‌రెడ్డి నాయకత్వం మరింత బలం సంతరించుకుంది. కాంగ్రెస్ కు 98,988; బిఆర్ఎస్‌కు 74,259; బిజెపికి 17,061 ఓట్లు లభించాయి.

తమ స్థానాన్ని నిలబెట్టుకునేందుకై ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ మాగంటి సునీతను తమ అభ్యర్థిగా నిలబెట్టి సానుభూతి ఓటుకు విజ్ఞప్తులు చేయటం సహా సర్వశక్తులు ఒడ్డింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోవటమేగాక, ఆ తదుపరి ఆరుమాసాల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కసీటు గెలుచుకోలేక చతికిలబడిన స్థితినుండి కోలుకుని పూర్వవైభవ పునరుద్ధరణకు, పార్టీ పునరుజ్జీవనకు ఈ ఉప ఎన్నికను అవకాశంగా భావించింది. వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తానే అభ్యర్థి అన్నంతగా వీధివీధి తిరిగారు. సైన్యాధిపతిలా పార్టీ శ్రేణులను నడిపించారు. ఆయన వ్యయప్రయాస వృధాపోలేదు. 'బిఆర్ఎస్ పని అయిపోయింది. ప్రధాన ప్రతిపక్షం మేమే, వచ్చే ఎన్నికల్లో అధికారం మాదే' అని భ్రమలు వ్యాప్తి చేస్తున్న బిజెపిని' మూడవస్థానంలోకి నెట్టి ప్రధాన ప్రతిపక్షం మాదే అని బిఆర్ఎస్ నిలదొక్కుకోగలిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకున్న బిజెపి, 8 లోక్‌సభ సీట్లు ఎలా గెలుచుకోగలిగిందన్నది ఇప్పటికీ, ఎప్పటికీ మిస్టరీయే. ఈ జూబ్లీ హిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలిచిన సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఉంది. ఆ ఎన్నికలో ఇక్కడ కిషన్‌రెడ్డికి 65 వేల ఓట్లు పోలైనాయి. ఇప్పుడు కిషన్‌రెడ్డి తనే అభ్యర్థి అన్నట్లుగా అవిశ్రాంతంగా ప్రచారం చేసినా బిజెపి అభ్యర్థికి సుదూర మూడవ స్థానం దక్కింది, డిపాజిట్ దక్కలేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బిజెపికి ఇంత నిరాశాజనక ఫలితం రావటం ఆ పార్టీకి నిస్సందేహంగా గట్టి ఎదురుదెబ్బ.

ఎవరు గెలిచినా – ఓడినా రాష్ట్రప్రభుత్వ సుస్థిరతకు ఇబ్బంది లేదు కాబట్టి ఈ ఉప ఎన్నిక సాంకేతికంగా పర్యవసానరహితమైంది. అయితే మూడు ప్రధాన పార్టీల మధ్య పచ్చగట్టివేస్తే భగ్గుమనే రాజకీయవైరంతో అది ప్రతిష్ఠాత్మకమైంది. ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్, బిజెపిలు రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనపైనే దాడి ఎక్కుపెట్టాయి. కెటిఆర్ అయితే ఇది ప్రభుత్వంపై రెఫరెండం అని కూడా అన్నారు. నియోజకవర్గంలోని పరిస్థితులను చూసి విస్తుపోయిన ముఖ్యమంత్రి కనీస వసతుల మెరుగుదలకు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే తక్షణ చర్యలు తీసుకున్నారు. సామాజికవర్గాల వారీ తమ మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రచార బాధ్యతలు అప్పగించారు. తాను స్వయంగా ముమ్మర ప్రచారం చేస్తూ ప్రత్యర్థులపై రాజకీయ దాడిచేస్తూనే తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఇక్కడ బస్తీల స్థితిగతులను గూర్చి మాకు ఒక్క కాగితం ఇచ్చిన వారు లేరు. తమ అభ్యర్థిని గెలిపిస్తే మీకు ప్రభుత్వంతో నేరుగా సంబంధం ఏర్పడుతుందని రేవంత్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి పేద ఓటర్లను ఆలోచింపజేసింది. ఎంఐఎం, సిపిఐ, సిపిఐ(ఎం)ల తోడ్పాటును, సినీ కార్మికులు సహా అనేక ప్రజా సంఘాల అండదండలు రాబట్టారు. మొత్తంమీద రేవంత్‌డ్డి ప్రచారం, వ్యూహాలు, ఎత్తుగడలు ప్రత్యర్థులను చిత్తుచేశాయనవచ్చు. రానున్న మూడేళ్లు రాష్ట్ర అభివృద్ధిపైనే కేంద్రీకరిస్తామని, ఇందుకు బిఆర్ఎస్, బిజెపి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కలిసిరావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమయోచిత విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ గెలుపు – కెటిఆర్ ఓటమి!


ఎస్.కె.జకీర్

జూబ్లీహిల్స్ యుద్ధంలో రేవంత్ రెడ్డి గెలిచారు. కెటిఆర్ ఓడిపోయారు. ఈ ఉపఎన్నిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు మధ్య పోరాటంలా జరిగినందున కాంగ్రెస్ అభ్యర్థి గెలుపును సిఎం గెలుపుగా అభివర్ణించవచ్చు. అలాగే బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటమిని కెటిఆర్ ఓటమిగానే భావించాలి.పైగా జూబ్లీహిల్స్ లో పార్టీ ఓడిపోతే తానే బాధ్యత వహిస్తానని కెటిఆర్ పోలింగుకు రెండు రోజుల ముందు చెప్పారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మృతి కారణంగా ఉప ఎన్నిక జరిగితే దీని ఫలితం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెఫరెండంగా పేర్కొనడం కెటిఆర్ చారిత్రక తప్పిదం. ఆయన రాజకీయ అపరిపక్వానికి నిదర్శనం. అసలే వరుస ఓటములకు గురవుతూ వస్తున్న బిఆర్ఎస్ పార్టీకి ఇది కోలుకోలేని దెబ్బ. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పాటు కంటోన్మెంటు ఉపఎన్నికలోనూ పరాజయం పాలు కావడం సాధారణ విషయం కాదు. ఎక్కడో ఏదో లోపం ఉన్నది. సైద్ధాంతికంగా కాకుండా కేవలం 'ప్రత్యేక తెలంగాణ' భావోద్వేగంతో పార్టీని ఏర్పాటు చేయడం తాజా సంక్షోభ పరిస్థితులకు ఒక కారణంగా విశ్లేషించవచ్చు. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత తెలంగాణలో మొదటిసారి అధికారంలోకి వచ్చిన కెసిఆర్ తన పార్టీని బలంగా నిర్మించుకోలేక పోయారు. సంస్థాగతంగా కింది స్థాయి నుంచి పార్టీ నిర్మాణం బలపడితే తనను ఎవరూ ఖాతరు చేయరని ఆయన అనుకొని ఉండవచ్చు. తనకు పార్టీలోపాలా, వెలుపలా ఎదురు లేకుండా ఉండాలంటే, తన మాటే శాసనంగా మారాలంటే 'సర్వస్వం తానే' అయి ఉండాలని టిఆర్ఎస్ పార్టీ నిర్మాత భావించి ఉండాలి. తనకు తెలియకుండా ఏదీ జరగరాదని, తనకు తెలియకుండా ఎవరూ ఏమీ చేయకూడదని కెసిఆర్ ఆశిస్తూ వస్తున్నారు.

తెలుగుదేశం పార్టీలో కీలక భూమిక పోషించి, చంద్రబాబు కేబినెట్ సహచరునిగా పనిచేసిన కెసిఆర్ కు పార్టీ నిర్మాణం గురించి ఎవరూ పాఠాలు చెప్పవలసిన పని లేదు. టిడిపి ఎన్ని సార్లు ఆటుపోట్లకు ఎదురయినా తిరిగి నిలబడడానికి, నిలదొక్కుకోవడానికి, ఓటమి నుంచి విజయానికి చేరుకోవడం వెనుక 'క్యాడర్ పార్టీ' గా చంద్రబాబు ఆ పార్టీని తీర్చిదిద్దడమే ప్రధాన కారణం. టిడిపి కూడా ప్రాంతీయ పార్టీయే. చంద్రబాబు కంటే తమ నాయకుడు కెసిఆర్ గొప్ప, ప్రధాన మంత్రి పదవి చేబట్టేందుకు అర్హుడు అంటూ భజనచేసే ముఠాలు కెసిఆర్ ను మరింత దెబ్బ తీస్తున్నాయి. పార్టీ లోపల, వెలుపల ఏమి జరుగుతుందో చెప్పేవారు పార్టీలో లేరు. చెప్పినా ఆయన తలకెక్కించుకోరు కనుక చెప్పకపోవడం మంచిదని అనుకునేవారు లేకపోలేదు. పైగా విమర్శను స్వీకరించే నైజం కాదు. సలహాలు తీసుకునే మనిషి కాదు. తనకే అన్నీ తెలుసునని కెసిఆర్ తన మైండ్‌లో ఫిక్స్ అయినందున సమీక్షలు, ఆత్మ విమర్శ వంటివి ఆయనకు నచ్చనివి. పార్టీ అంటే తానే. తానే పార్టీ. టిడిపి వలె పొలిట్ బ్యూరో లేదు. పోనీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ అయినా లేదు. పార్టీకి జిల్లా అధ్యక్షులుగా ఎమ్మెల్యేలనే నియమించారు. ఎమ్మెల్యేలు అయితేనే తన మాట వింటారని సిఎంగా ఉన్నప్పుడు కెసిఆర్ భావన. వేరే నాయకులను అధ్యక్షునిగా నియమిస్తే జిలాల్లో సమాంతర రాజకీయాలు, పోటీ రాజకీయాలు నడుస్తాయని ఆయన అనుమానం. అవి ఆధిపత్య పోరాటాలుగా మారితే పరిష్కరించడం కష్టమన్న భావన.

"ఇకపై తమది ఫక్తు రాజకీయ పార్టీ" అని కెసిఆర్ 2014 లో ప్రకటించారు. కానీ రాజకీయ పార్టీ నిర్మాణాన్ని ఆయన ఉద్దేశపూర్వకంగానే మరచిపోయారు. పార్టీ నిర్మాణం పటిష్టంగా లేకపోతేనే తన 'మాట చెల్లుబాటు' అవుతుందని కెసిఆర్ భావిస్తున్నారేమో!! పైగా ఆయన బయట ప్రపంచానికి తెలిసినంత ధైర్యవంతుడు, శూరుడు కాదు. పిరికితనం ఎక్కువ. దాంతో అనుమానాలూ ఎక్కువే. తన నీడను కూడా కెసిఆర్ నమ్మేరకం కాదు. టెలిఫోన్ ట్యాపింగ్ ఉదంతం వెలుగులోకి వచ్చిన తర్వాత ఆయన గురించిన కొన్ని నిజాలు బయటపడ్డాయి. తన భర్త, భర్త తరఫు మనుషుల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని కవిత ఆరోపించిన నేపథ్యంలో బహుశా తన కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా కెసిఆర్ ట్యాప్ చేయించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా కెసిఆర్ అనుమతి లేకుండా పోలీసు అధికారులు ఫోన్ ట్యాపింగ్ వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే సాహసం చేయకపోవచ్చు. కెసిఆర్ లేదా అంతటి 'ప్రాధాన్యం' ఉన్న వారెవరో









పురమాయిస్తేనే 'ట్యాపింగ్ కాండ'కు పోలీసులు పాల్పడతారని పోలీసు వర్గాల్లో టాక్ ఉన్నది.

కాగా కెటిఆర్ నాయకత్వ సామర్థ్యంపై పార్టీలో చర్చ ఇదివరకటి నుంచే ఉన్నది. ఉపఎన్నిక ఫలితం వల్ల ఆ చర్చ మరింత ముదరనుంది. అంటే ఇంకా రంజుగా మారనుంది. కెసిఆర్ పాలనలో తాము చేసిన అభివృద్ధి పనులు, ఇతర అంశాలను ప్రచారంలోకి తీసుకువెళ్లే బదులుగా రెండేళ్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గురి పెట్టడమే తప్పు. పదేండ్లలో చేయలేని పనులు రెండేండ్లలో రేవంత్ ఎలా చేస్తారని ప్రజలు భావించారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థినని, సిఎం రేవంత్ రెడ్డికి తాను మాత్రమే పోటీదారు అని కెటిఆర్ ప్రవర్తించారు. ఆయన బాడీ లాంగ్వేజ్ కూడా అహంకారపూరితంగా, అణువణువునా గర్వం తొణికిసలాడినట్లుగా ఆ పార్టీ కార్యకర్తలే మాట్లాడుకున్నట్టు స్థానిక విలేకరుల ద్వారా తెలిసింది.

కెసిఆర్ కు కుడిభుజం అయిన మాజీమంత్రి హరీశ్ రావు తన తండ్రి మరణించిన మూలంగా పదిరోజుల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోయారు. హరీశ్‌రావు ప్రచారంలో లేకపోవడం తమకు మైనస్ అయినట్టు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. అలాగే పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ ఒక్క రోడ్ షోలో కూడా పాల్గొనకపోవడం, లేదా ఒక సభ నిర్వహించకపోవడం పెద్ద మైనస్ గా వాళ్ళనుకుంటున్నారు. ఇకపై పార్టీ బరువు బాధ్యతలన్నీ కొడుకు కెటిఆర్ చూసుకుంటారని గడచిన ఏప్రిల్ 27న ఎల్కతుర్తి సభలోనే కెసిఆర్ బహిరంగంగా సంకేతాలు ఇచ్చారు. ఆ సభ తర్వాత వివిధ కారణాలతో పార్టీలో సంక్షోభ వాతావరణం మొదలైంది. కెసిఆర్ కూతురు కవిత తండ్రికి రాసిన లేఖ బహిర్గతం కావడం, సామాజిక తెలంగాణ పేరిట ఆమె సొంత కార్యక్రమాలకు పూనుకోవడం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఆమెను సస్పెండ్ చేయడం, జాగృతి జనం బాట పేరుతో కవిత జిల్లాల యాత్ర ప్రారంభించడం వంటి పరిణామాలు ఆరు నెలల్లో సంభవించాయి.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికను కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేశాయి. ఏ కారణంగానో బిజెపి పోటీలో లేకుండా పోయింది. పోలింగుకు ముందే ఆ పార్టీ పోటీ నుంచి దాదాపు తప్పుకుంది. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ కేంద్రీకృతం కావడం విశేషం. త్రిముఖ పోటీ కాస్తా ముఖాముఖిగా మారింది. మాగంటి సునీత అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన సమయానికి బిఆర్ఎస్ ఆధిక్యంలో కనిపించింది. కాంగ్రెస్ పార్టీ కన్నా పది శాతానికి పైగా బిఆర్ఎస్ ఆధిక్యంలో ఉన్నట్టు కొన్ని సంస్థలు ప్రీపోల్ సర్వేల లో అంచనా వేశాయి. అది క్రమంగా తగ్గుతూ 3 లేదా 4 శాతంగా మారుతూ వచ్చింది. జూబ్లీహిల్స్ ఎన్నికల అనంతరం 500 రోజుల్లో కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడుతుందని కెటిఆర్ ప్రకటించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కవ్వించారు. కోరికోరి కష్టాలు కొని తెచ్చుకున్నట్లయ్యింది. జూబ్లీహిల్స్ ఫలితంపై కెటిఆర్ చేసిన 'ఓవర్ యాక్షన్' రేవంత్ ను రెచ్చగొట్టింది. అప్పటివరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ గురించి చేసిన ఆలోచన, రచించిన వ్యూహరచన వేరు. కెటిఆర్ ప్రకటన తర్వాత రేవంత్ రెడ్డి వ్యూహరచనను మలుపు తిప్పారు. పార్టీకి చెందిన బలగాలన్నింటినీ బరిలోకి దింపారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ ఎన్నికల కదనరంగంలోకి పరుగెత్తించారు. సిఎం స్వయంగా ప్రచారంలో పాల్గొంటూనే మరోవైపు పార్టీ పరిస్థితిని, ప్రత్యర్థుల బలాన్ని నిరంతరం అంచనా వేస్తూ, డివిజన్ల వారీ పరిస్థితిని సమీక్షిస్తూ, పర్యవేక్షిస్తూ, సలహాలు సూచనలు చేస్తూ నవీన్ యాదవ్ ను విజయతీరాల వైపునకు నడిపించారు. తమ ప్రభుత్వం 500 రోజుల్లో కూలిపోతుందని కెటిఆర్ అనడంతో ఉపఎన్నిక గెలవడానికి మించిన ఎజెండా మరొకటి ప్రస్తుతానికి లేదని రేవంత్ పట్టుదలకు వచ్చారు. దీనికి కారణం తారక రామారావే. ఆయన రెచ్చగొట్టకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గెలుపు కోసం ఇంతగా పట్టు బట్టేవారు కాకపోవచ్చు.

అసలు రేవంత్ రెడ్డిని తక్కువ అంచనా వేయడంలోనే కెటిఆర్ వైఫల్యం కనిపిస్తుంది. మహాపర్వతం వంటి కెసిఆర్ ను 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటిచేత్తో కూల్చేసినప్పుడే రేవంత్ శక్తి సామర్థ్యాల గురించి కెటిఆర్ సరైన అంచనాకు వచ్చి ఉండాలి. అలాగే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు ఎందుకు తిరస్కరించారన్న అంశంపై బిఆర్ఎస్ కు కనువిప్పు కలగకపోవడం వల్ల ఆ పార్టీకి అనర్థాలు జరుగుతున్నవి. "ఒకసారి గొప్ప విజయం సాధించాక, ఇక విశ్రాంతి గురించి మాట్లాడకూడదు. వెసులుబాటు కావాలని అనుకోకూడదు. ఆధునిక యుగంలో సంపూర్ణ విజయమే లక్ష్యం అనేది మూల సూత్రం" అని 1469 1527 కు చెందిన రాజకీయ తత్వవేత్త నికోలో మాకియవెలి అన్నాడు. అలాగే "ఇంకా యుద్ధం ముగియలేదు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాలలో అన్నారు.

## ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ నుండి మినహాయింపు నివ్వాలి

లేఖ

తెలంగాణ ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదలచేసింది. ఇన్ సర్వీసుఉపాధ్యాయులకు కూడా టెట్‌ను తప్పనిసరి చేస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు సవరణ చేస్తూ జిఒ.28 ను జారీచేసింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, ఉపాధ్యాయ సంఘాలు సుప్రీంకోర్టు తీర్పును సవాలు చేస్తూ రివ్యూ పిటిషన్ వేసాయి. ఈసారి జరగబోయే టెట్ పరీక్షకు ఉపాధ్యాయులు పెద్దమొత్తంలో హాజరయ్యే అవకాశం ఉంది. అయితే వచ్చిన చిక్కల్లా సిలబస్‌తోనే అని ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు వాపోతున్నారు. తాము బోధించే సబ్జెక్టులో పరీక్ష నిర్వహిస్తే రాయడానికి సిద్ధమే కానీ స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉపాధ్యాయుడికి కొరుకుడు పడని గణితం ఇవ్వడం సరైన విధానం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరి సబ్జెక్టులో వారికి పరీక్ష నిర్వహిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని మెజారిటీ ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

విద్యాహక్కు చట్టం సెక్షన్ 23(1) మేరకు జాతీయ ఉపాధ్యాయ విద్యా కౌన్సిల్ నిర్దేశించిన మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయని, సర్వీసు లో ఉన్న టీచర్లను మినహాయించాలని ఉపాధ్యా య లోకం కోరుతున్నది. సీటెట్ అయితే కేంద్ర సిలబస్ ఉండడం ఇబ్బందిగా మారింది.

రాష్ట్రంలో విద్యాశాఖ నేటివరకు అన్ని ఉత్తర్వుల్లో మినహాయింపు ఇవ్వడం, టెట్ ఉత్తీర్ణత సాధించాలని ఆదేశాలు ఇవ్వకపోవడంతో టీచర్లు టెట్ గురించి ఆలోచించలేదు. ఉన్నపాటు గా సుప్రీం తీర్పుతో ఉలికిపాటుకు గురయ్యా రు. అనుభవంతో పాటు నిత్యం అదే క్షేత్రంలో ఉన్న ఉపాధ్యాయులకు ఈ పరీక్షలు సాధారణ అంశమే. అయితే సైన్స్ వారికి గణితం ప్రశ్నలు అలాగే గణితం వారికి జీవశాస్త్ర ప్రశ్నలు ఉండడం కాస్త ఇబ్బందిగా మారింది. సాంఘిక శాస్త్రం వలె పూర్తిస్థాయి మార్కులు ఆయా సబ్జెక్టులకు కేటాయించే మార్పు వెంటనే చేయవలసిన అవసరం ఉంది. లేకుంటే టీచర్లు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. అదే మాదిరిగా భాషా ఉపాధ్యాయ టెట్ గురించి పూర్తిస్థాయి స్పష్టత రావలసి ఉంది.

ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు, వ్యక్తిగతంగా టీచర్లు మరియు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయడంతో తీర్పు మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఏది ఏమైనా దశాబ్దాల అనుభవం గడించిన టీచర్లకు ఇది సవాలుగానే భావించినా సిలబస్ విషయంలో మార్పులు చేపడితే పెద్ద సమస్య కాబోదు అన్నది పలువురు మాట్లాడుతున్న అంశం.

సుధాకర్.ఎ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్
9000674747

# ఏఐ తో గ్రామీణ భారతానికి కొత్త రూపం

గ్రామీణ భారతదేశంలో పేదరిక నిర్మూలనకు ఉపాధి హామీకి ఆధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో విప్లవాత్మక సాంకేతిక మార్పుల ఆవశ్యకత ఏర్పడింది. 2005లో ప్రారంభమైన ఈ పథకం ఇప్పుడు కృత్రిమ మేధస్సు డేటా విశ్లేషణ సాంకేతికతను ఉపయోగించి చెల్లింపుల ఆలస్యం, వేతనాల క్షీణత పర్యవేక్షణలో లోపాల వంటి సమస్యలను పరిష్కరించడానికి ముందడుగు వేసింది. దేశ గ్రామీణ జనాభాలో సుమారు 30 శాతం మందికి సంవత్సరానికి 100 రోజుల వేతన ఉపాధి హామీ ఇవ్వడమే దీని ప్రధాన లక్ష్యం. 2024 సంస్కరణల కేంద్ర బిందువుగా కృత్రిమ మేధస్సు వినియోగం ఇంకా కొన్ని రాష్ట్రాలలో నత్తనడక వేస్తున్నది. ఏఐ ఆధారిత పద్ధతులు ఉద్యోగ అవసరాలను ముందుగా అంచనా వేసి, వనరుల కేటాయింపును సద్వినియోగం చేసుకోవడంలో అలాగే ప్రాజెక్టుల పురోగతిని ప్రత్యక్షంగా పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఏఐ సాధనాలు ప్రాంతాల వారీగా ఉపాధి అవసరాలను ముందుగానే అంచనా వేయడం ద్వారా సమయోచితంగా ఉద్యోగ కేటాయింపులు జరిగేలా చేస్తాయి కానీ ఈ సాంకేతికను ఉపయోగించుకోవడానికి స్థానిక సంస్థలు గ్రామీణాభివృద్ధి సిద్ధంగా లేవు.

ఈ సంస్కరణల్లో ప్రధానమైన సాంకేతిక ఆవిష్కరణ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్. ఈ సిస్టమ్ జియోట్యాగింగ్ సాయంతో రోడ్లు, కాల్వలు, వరద రక్షణ నిర్మాణాలు వంటి ప్రాజెక్టులు నిర్దేశి త ప్రణాళిక ప్రకారం అమలవుతున్నాయా అని రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తుంది. ఇది నిధుల లీకేజీలను తగ్గించి, బాధ్యత నిర్ధారిస్తుంది. కొత్త డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా కార్మికులు మొబైల్ లేదా వెబ్ యాప్‌ల ద్వారా పనికోసం దరఖాస్తు చేసుకొని, కేటాయింపులను తెలుసుకోవచ్చు, వేతన చెల్లింపుల స్థితిని వెంటనే తనిఖీ చేయవచ్చు. అలాగే ప్రెడిక్టివ్ అనలిటిక్స్ ఆధారంగా వలస, వ్యవసాయ చక్రా లు, స్థానిక అవసరాలపై పాత డేటాను విశ్లేషించి, మట్టి సంరక్షణ, వనరుల పెంపకం, పునరుత్పత్తి శక్తి ప్రాజెక్టుల వంటి పనులు సమాజ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్నారు. అలాగే కరకట్టల నిర్మాణం, చెరువు ల్లో కుంటలు, తలపిరులు వంకలు సూయిజ్ సప్లయి ఛానెల్స్ మరమత్తులకు, అలాగే నాలా వ్యవస్థను పటిష్టపరచడానికి డ్రోన్ వ్యవస్థను అనుసంధానం చేయాలి.

ఈ ఏఐ ఆధారిత సాధనాలు ఇప్పటికే అమలులో ఉన్న డిజిటల్ చెల్లింపు విధానాలపై ఆధారపడి ఉన్నాయి, ఇవి నగదు లావాదేవీల లీకేజీలను గణనీయంగా తగ్గించాయి. అయితే, ఇంటర్నెట్ సదుపాయం లేని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా సవాళ్లు ఉన్నాయి. అందుకే ప్రభుత్వం సంప్రదాయ పద్ధతులతో కలిపి హైబ్రిడ్ పద్ధతిని అనుసరిస్తోంది. నారెగ పథకంలో చాలాకాలంగా ఉన్న సమస్యలు చెల్లింపు ఆలస్యం, వేతనాల క్షీణత, పర్యవేక్షణ లోపం వంటివి 2024 సంస్కరణలతో తగ్గుముఖం పట్టాయి. వేతనాలను ద్రవ్యోల్బణంతో అనుసంధానించి, పని పూర్తయిన 15 రోజుల్లో చెల్లింపులు జరిగేలా ఏఐ ఆధారిత పద్ధతులు అమలు చేస్తున్నారు. పథకం పరిధిని విస్తరించి, ప్రకృతి వనరుల నిర్వహణ మరియు నైపుణ్యాభివృద్ధికి అనువైన ప్రాజెక్టులను కూడా చేర్చారు. కనీసం ఒక మూడవ వంతు మంది మహిళల పాల్గొనడం తప్పనిసరిగా చేయడం ద్వారా లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు, సమానపనికి సమాన వేతనం దక్కుతుంది.




ఏఐ విశ్లేషణ ఆధారంగా వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒడిశాలోని వలస ప్రభావిత బ్లాకులలో లబ్ధిదారులకు అదనపు వేతనాలు ఇవ్వడం వంటి కొత్త చర్యలు కూడా ప్రవేశపెట్టబడ్డాయి. 2023–24 సంవత్సరానికి బడ్జెట్ రు.60,000 కోట్లు తగ్గిన, ప్రభుత్వం ఏఐ ఆధారిత ఆడిట్లు మరియు సోషల్ ఆడిట్ల ద్వారా పారదర్శకతను, ఖర్చు తగ్గింపును సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. నిపుణుల అంచనా ప్రకారం, ఈ సంస్కరణలు గ్రామీణ ఉపాధి సృష్టిని పెంచి, పట్టణ వలసలను తగ్గించి, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచగలవు. అయితే అమలులో కొన్ని అడ్డంకులు కూడా ఉన్నాయి. కార్యాలయం ఆలస్యం, సాంకేతికతను అంగీకరించడంలో ప్రతిఘటన, గ్రామీణ కార్మికులలో డిజిటల్ అక్షరాస్యత లోపం. దీనికి పరిష్కారంగా ప్రభుత్వం స్థానిక పంచాయతీ సామర్థ్యాన్ని పెంచడం పై దృష్టి సారించింది. అలాగే స్వచ్ఛంద సంస్థలతో భాగస్వామ్యం ద్వారా కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. తమిళనాడులో ఈ సంస్కరణలు విజయవంతమయ్యాయి. ఏఐ ఆధారిత అమలు విధానం స్థానిక ఉపాధి అవసరాలు తీరడమే కాకుండా మౌలిక వసతుల అభివృద్ధి చేసింది. ఏఐ ఆధారిత జాతీ య ఉపాధి హామీ పథకం కేవలం ఉద్యోగాలు ఇవ్వడమే కాదు, గ్రామీణ ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది.

2030 నాటికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ ప్రాజెక్టుల ను సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానం చేయడం ప్రభుత్వ లక్ష్యం. ఏఐ ఆధారిత ప్రణాళికలు పర్యావరణానికి అనుకూలమైన ప్రాజెక్టులను నిర్ధారించనున్నాయి. సమయానికి వేతనాలు రావడం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం జీవితాలను మార్చేసిందని లబ్ధిదారులు అంటున్నారు. 2024 సంస్కరణలు కేవలం ఉపాధి హామీ పథకం కంటే ఎక్కువ. ఇవి గ్రామీణ భారతదేశాన్ని సాంకేతికంగా శక్తివంతం చేసే దిశగా ముందడుగు. కృత్రిమ మేధస్సు ఆధారంగా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ, ఈ పథకం ఉపాధి నుండి సుస్థిర అభివృద్ధి దిశగా ప్రయాణిస్తోంది.

డా. సిహెచ్. నవీన్ కుమార్ రెడ్డి

## వ్యర్థాల పునర్వినియోగానికి పెద్ద పీట వేద్దాం

వ్యర్థాలను మట్టిలో వదిలేయకుండా ఉపయోగించి నూతన ప్రయోజనకర వస్తువులను తయారు చేసే ప్రక్రియను రీసైక్లింగ్ (పునర్వివియోగ ప్రక్రియ) అని పిలుస్తాం. వ్యర్థాలు రేపటి సమాజ అనారోగ్య కారణాలు. వ్యర్థాలతో నేల తల్లి తల్లడిల్లుతున్నది. గరళ వ్యర్థాల కారణంగా వన్యప్రాణులు, జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. నేలపై వ్యర్థాల కుప్పలను తగ్గించడం, కాలుష్యాన్ని తగ్గించడం, నీటి వనరుల రక్షణ, శక్తి ఆదా, హరితగృహ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, ఆర్థిక వెసులుబాటు, ఉద్యోగాల కల్పన, కొత్త ఉత్పత్తుల తయారీ లాంటి ప్రయోజనాలు కలిగిన రీసైక్లింగ్ ప్రక్రియను వ్యక్తి నుంచి మొదలై పౌర వ్యవస్థలు, సంస్థలు, ప్రభుత్వాల వరకు అందరూ నిరంతరం కృషి చేయాలి. ఒక టన్ను వ్యర్థ పేపర్‌ను రీసైక్లింగ్ చేయడం ద్వారా పరోక్షంగా వేల చెట్లు, 7,000గ్యాలెన్ల నీరుకా సమానంగా ప్రయోజనం జరుగుతుందని తేలింది.

వ్యర్థాల రీసైక్లింగ్ ప్రక్రియ ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆచరణలో పెట్టడానికి ఏటా 15 నవంబర్ రోజు జాతీయ రీసైక్లింగ్ దినోత్సవం (నేషనల్ రీసైక్లింగ్ డే) పాటించడం అమెరికా నుంచి ప్రారంభానికి నేడు విశ్వ వ్యాప్తం అవుతున్నది. ప్రస్తు త పౌర సమాజ ఆరోగ్య పరిరక్షణే కాకుండా భవిష్యత్తు తరాల మనుగడకు నేడే రీసైక్లింగ్ పునాదులు పడాలి. రీసైక్లింగ్ ఫలితంగా పర్యావరణం పరిరక్షణ, నేలపై వ్యర్థాల కుప్పలు తగ్గడం, ఆర్థిక అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, శక్తి పొదుపు, పౌర సమాజ అభివృద్ధి, వన్యప్రాణుల రక్షణ, సహజ వనరుల సంరక్షణ, భూపాల వాయువుల కట్టడి లాంటి ప్రయోజనాలు కలిగిన రీసైక్లింగ్ ప్రక్రియ పట్ల ప్రజల్లో లోతై న అవగాహన కల్పించాలి. వ్యర్థాల నియంత్రణ సూత్రాలుగా రెడ్యూస్ (తగ్గించడం), రీయూజ్ (తిరిగి వాడడం), రీసైక్లింగ్ (నూతన వస్తువుల తయారీ), రెఫ్యూజ్ (తిరస్కరించడం), రీకవర్ (తిరిగి పొందడం), రోట్ (జీవవిచ్ఛిన్నం చేయడం), రీపర్పస్ (మరో పనికి వాడడం) లాంటి ప్రధాన అంశాలను పేర్కొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యం రానున్న రోజుల్లో ప్రమాదకరంగా మారనుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టిలో జీవవిచ్ఛిన్నం కావడానికి వందల ఏండ్ల పట్టడం వల్ల ఈ వ్యర్థాలతో వన్యప్రాణులు, జల తరాల మనుగడ ప్రాణాంతకంగా మారింది. రీసైక్లింగ్ అనే ప్రక్రియ మన నిత్య మంత్రం కావాలి. వ్యర్థాలను తగ్గించడం ఇంటి నుంచే మొదలు కావాలి. నేటి వ్యర్థం రేపు మన ప్రాణాలను తీసే ప్రమాదం కూడా ఉందని తెలుసుకోవాలి. రీసైక్లింగ్ ప్రాధాన్యాలను గుర్తించిన విశ్వ పౌర సమాజం ప్రతి ఏట 18 మార్చి రోజు ప్రపంచ రీసైక్లింగ్ దినం, 27 మార్చి రోజు శూన్య వ్యర్థాల అంతర్జాతీయ దినం కూడా పాటించడం జరుగుతుంది.

(15 నవంబర్ జాతీయ రీసైక్లింగ్ దినోత్సవం సందర్భంగా)

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# బిర్సా ముండా... ఆదివాసీ స్వేచ్ఛా హక్కుల సింహగర్జన

భారత స్వాతంత్ర్య పోరాట గాథలో అనేక మంది ధీరులు తమ ధైర్యం, త్యాగం, సంకల్పంతో చరిత్ర సృష్టించారు. కానీ ఆ విప్లవ జ్వాలలో అరణ్యాల మధ్యనుండి మహాగర్జనగా ఎదిగి, ఆదివాసీ హక్కుల కోసం అచంచలంగా పోరాడిన నాయకుడే బిర్సా ముండా. 15 నవంబర్ 1875లో జార్ఖండ్‌లోని ఉలిహాటు గ్రామంలో పేద కౌలు రైతు కుటుంబంలో జన్మించిన ఈ గిరిజన బాలుడు చిన్నతనం నుంచే బ్రిటిష్ దోపిడీ, భూస్వాముల అణచివేత, ఆదివాసీలపై జరుగుతున్న దౌర్జన్యాలను చూసి రగిలిపోయాడు. 19వ శతాబ్దం చివర్లో ఛోటానాగ్పూర్ ప్రాంతంలో బ్రిటిష్ పాలకులు 'ఖుంట్ కట్టి' భూమి వ్యవస్థను (సమిష్టి భూమి యాజమాన్య హక్కులు) రద్దు చేయడం, ఆదివాసీ భూములను ఆక్రమించడం, పన్నుల భారం మోపడం, బలవంతపు శ్రమను అమలు చేయడం వంటి చర్యల వల్ల ఆదివాసీల జీవితం పూర్తిగా దెబ్బతింది. తాము సాగుచేసిన భూమిపై హక్కులు కోల్పోయిన గిరిజనులు అణచివేతలో కూరుకుపోయారు. ఈ సమయంలో బిర్సా ముండా వారిలో నిద్రించిన ఆత్మగౌరవాన్ని మేల్కొలిపి, వారిని స్వాభిమాన పోరాటానికి నడిపించాడు. అతని ఆధ్యాత్మిక శక్తి, నాయకత్వం లోని దృఢత్వం ప్రజలకు కొత్త జీవం పోశాయి. గిరిజనులు అతన్ని ధర్తి అబ్బా, రక్షకుడు, దివ్య నాయకుడిగా, 'అబ్బా బిర్సాగా' భావించారు. వారిలో 'బిర్సాయిత్' అనే సంప్ర దాయాన్ని, విశ్వాసాన్ని నెలకొల్పి గిరిజన సంఘాలన్నింటిని ఏకీకరణ చేసి ఉద్యమం వైపు నడిపించాడు. బిర్సా ముండా నాయకత్వంలో ఆవిర్భవించిన మహా పోరాటం ఉలుగులాన్ అంటే మహాగర్జన. ఇది బ్రిటిష్ వలస పాలనను అణచివేసే శక్తివంతమైన ఆదివాసీ తిరుగుబాటు. బిర్సా గెరిల్లా యుద్ధ వ్యూహాలను ప్రయోగించి అరణ్యాల భౌగోళిక పరిజ్ఞానాన్ని తన సేనకు శక్తిగా మార్చాడు. అతని సేనలో ప్రజల ఐక్యత, నైతిక ధైర్యం, స్వేచ్ఛా సంకల్పం. ఇవన్నీ కలిసి అజేయ శక్తిగా నిలి చాయి. ఈ పోరాటం కేవలం ఆయుధ యుద్ధం కాదు. ఇది సంస్కృతి రక్షణ, భూమి హక్కుల పునరుద్ధరణ, న్యాయం కోసం సాగిన పవిత్ర విప్లవం.



మన భూమి మనదే. మన స్వేచ్ఛ మన హక్కు. అని ఇచ్చిన బిర్సా నినాదం అరణ్యాల్లో ప్రతిధ్వనించింది. అతని ప్రబల ప్రభావంతో భయపడిన బ్రిటిష్ పాలకులు 1900లో బిర్సాను అరెస్టు చేశారు. రాంచీ జైలులో 25 ఏళ్ల వయసులోనే అతను మరణించినా, అతని పోరాటం అమరత్వం పొందింది. అతని త్యాగం అనంతరం బ్రిటిష్ ప్రభుత్వం 'చోటానాగ్పూర్ టెనెన్సీ చట్టం' (1908)ను అమలు చేసేందుకు అంగీకరించింది. ఇది గిరిజన భూములకు చట్టబద్ధ రక్షణ కల్పించిన చారిత్రక అడుగు. బలవంతపు శ్రమను రద్దు చేయడం, భూబదిలీ నియంత్రణ వంటి సంస్కరణలు బిర్సా పోరాటానికి ప్రత్యక్ష ఫలితాలు. నేడు బిర్సా ముండా పేరు భారతదేశానికే పరిమితం కాదు. ప్రపంచ వ్యాప్తంగా స్వదేశీ ప్రజల హక్కుల కోసం జరుగుతున్న పోరాటాలన్నింటికీ ఆయన జీవితం ప్రేరణ. ఆయన జయంతిని భారత ప్రభుత్వం జాతీయ గిరిజన దినోత్సవం 'జన జాతీయ గౌరవ దివస్' గా ప్రకటించడం ఆయన చారిత్రక పోరాట ప్రభావానికి నిదర్శనం.

(నవంబర్ 15న బిర్సా ముండా జయంతి సందర్భంగా)

గిలకత్తుల వెంకటరమణ
9866878769

## విద్యార్థులను అభినందించిన కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ఏ లాస్య ప్రియ, ఏ మహిమ 9వ తరగతి మహారాష్ట్రలో ఈ నెల 7నుండి 9 వరకు జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్ బేస్ బాల్ క్రీడలో ద్వితీయ స్థానం గెలుపొంది, తెలంగాణకు,పెద్దపెల్లి జిల్లాకు పేరు తెచ్చారు. శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యార్థులను కృషిని, పట్టుదలని, అభినందించారు. ఈ అభినందనకు గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ జాతీయ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయిలో కూడా విద్యార్థులు రాణించాలని, క్రీడల పట్ల ఆసక్తి నైపుణ్యాలు పెంపొందాలని, కలెక్టర్ ప్రశంసపైన సంతోషాన్ని వ్యక్తం చేసి, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అల్లంకి రజనీ దేవి , ప్రిన్సిపాల్ విజయ్, కోచ్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

## పెద్దపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఎసిబి దాడులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి అవినీతిని నిరోధించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ రోజు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. కార్యాలయంలో రికార్డులను పూర్తిగా పరిశీలిస్తున్నారు. డాక్యుమెంట్లు ఇతర పత్రాలను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లను సైతం విచారిస్తున్నామని విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలియజేశారు.




## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** కొనుగోలు కేంద్రాలకి వచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలకు రాగానే త్వరగా కొనుగోలు చేయాలని జిల్లా, కల్టెర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. మెట్ పల్లి మండలంలో ఆత్మనగర్, ఆత్మకూర్, జగ్గసాగర్, గ్రామాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శ్రక్రవారం జిల్లా .కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. అనంతరం ఈ సందర్భంగా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలో నాణ్యంత ప్రమాణాలను పరీక్షించి ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని నిర్వహకులకు కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివారాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలి. రైతులకు 24/48 గంటల లోగా చెల్లింపులు జరిగేలా చూడాలి. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి. గ్రేడ్ ఏ రకానికి 2389/ రూ సాధారణ రకానికి రూ. 2369 సన్నరకం ధాన్యానికి క్వింటకు 500 రూపాలు బోనస్ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను సందర్శించి నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ ఎటువంటి ఇబ్బందులు జరగకుండా కొనుగోలు సజావుగా జరిగే విదంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. వారి వేంట ఆర్డీవో శ్రీనివాస్,డిఆర్‌డిఓ రఘువరన్, ఎమ్మార్వోలు , తదితరులు పాల్గోన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై మహాధర్నా

ఎఐటియుసి నాయకులు వేన్న మహేష్



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్, డిఎంహెచ్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి నాయకులు వేన్న మహేష్ మాట్లాడుతూ ఎన్.హెచ్.ఎం స్కీంలో దాదాపు 78 క్యాడర్లలో సుమారు 17,541 మంది ఉద్యోగులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరు పేద, మధ్య తరగతి చెందినవారు. ప్రతి నెలా 1వ తేదీన జీతం అందితే తప్ప వారి కుటుంబాలు నడవలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గత సెప్టెంబర్, అక్టోబర్ 2025 (2 నెలల) జీతాలు అందకపోవటంతో కార్మికుల పరిస్థితి దయానీయంగా ఉన్నదని కుటుంబ పోషణ కష్టంగా ఉందని అన్నారు. గతంలో అనేక సందర్భాలు జిల్లా స్థాయి అధికారులకు వినతులు ఇవ్వటం జరిగిందని కాని నేటి వరకు కూడా జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మా సమస్యలు పరిష్కరించని కారణంగా గతంలో ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసిన ఫలితము రానందున ఈ నెల 17 నవంబర్ తేదీన హైదరాబాద్, కోఠి ఎన్.హెచ్.ఎం డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట ఉదయం 11 గంటలకు మహాధర్నా చేపట్టామని ఎన్.హెచ్.ఎం ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. వెంటనే ఎన్.హెచ్.ఎం ఉద్యోగులకు పిఆర్సి, ఏరియర్స్ అలాగే ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని వేంటనే సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

## ఉద్యోగాలు సాధించిన మహిళా నిరుద్యోగుల కుటుంబాలలో ఆనందం



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ సహకారంతో ప్రముఖ మొబైల్ ఫోన్ విడిభాగాల తయారీ కంపెనీ ఫాక్స్ కాన్ కంపెనీ లో బ్లూ ఓషన్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్ కంపెనీ అద్వర్యంలో జగిత్యాల పద్మనాయక కళ్యాణ మండపంలో నిర్వహించిన మెగాజాబ్ మేళాలో దాదాపు 1000 మంది మహిళా నిరుద్యోగులు పాల్గొనగా దాదాపు 350 మంది ఫాక్స్ కాన్ కంపెనీలో ఉద్యోగాలు పొందారని కంపెనీ నిర్వాహకులు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ సోమవారం నియామక పత్రాలు తీసుకొని విధుల్లో చేరడానికి జగిత్యాల నుండి బస్సులను ప్రారంభిస్తారని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన మహిళా నిరుద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ఈ ఉద్యోగం కొండంత అండ అని వారు అన్నారు. కంపెనీకి సెలెక్ట్ అయిన నిరోగ్యోగులతో ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ చరవాని ద్వారా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫాక్స్ కాన్ ఆఫీస్ ఇంచార్జీ వీర మహేష్ కుమార్, కో ఆర్డినేటర్ సదాశివ రెడ్డి, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, మాజీ ఏఎంసి చైర్మెన్ గన్నె రాజిరెడ్డి, పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్, మల్లేష్, మహేంద్ర బాబు, డా.రాజీ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## బాలల దినోత్సవం రోజున విషాదం 11ఏళ్ళ బాలిక బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి

**ప్రజాపక్షం/అక్కన్నపేట:** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గౌరవెళ్లిలో బాలల దినోత్సవం రోజున విషాదం చోటుచేసుకుంది.మాజీ వైస్ ఎంపీపీ మజ్జిక మొగిళి మనవరాలు,ప్రదీప్,శ్రీవాని దంపతుల కుమార్తె నివేదిత (11) హుస్నాబాద్‌లోని సిద్దార్థ స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది.బాలల దినోత్సవం నాడు ఆ చిన్నారికి రెండు రోజుల నుంచి తీవ్రజ్వరంతో పాటు ఫిట్స్ రావడంతో హుస్నాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి రెఫర్ చేయడంతో అక్కడ చికిత్స అందించగా అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మృతి చెందింది.ఈ విషాదంతో గౌరవెళ్ళి గ్రామం దిగ్భ్రాంతి చెందింది.

# విద్యార్థులకు ఎలాంటి కొరత లేకుండా చర్యలు

కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ హైమావతి అకస్మీకంగా సందర్శించి..భోజన ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మెనుప్రకారం అన్నం, టమాట. పప్పు, సాంబారు, గుడ్డు, వండినట్లుగా వంటసిబ్బందిగా తెలుపగా ఆహారపదార్థలను తనికీ చేశారు. కూర నాణ్యత మెరుగుపర్చాలని రుచికరంగా వండాలని సిబ్బందిని ఆదేశించారు. వడ్డించే ప్రక్రియను పరిశీలిస్తూ విద్యార్థుల హాజరు ప్రకారం భోజనం తయారు చేయాలని, మొత్తం ప్రక్రియను ప్రిన్సిపల్ పర్యావేక్షణ చేయాలని, ఏ ఒక్క విద్యార్థికి ఏలాంటి కొరత లేకుండ చూసుకోవాలని ప్రినిపాల్‌ను ఆదేశించారు. అన్నం తినేముందు విద్యార్థులు ప్రార్థన చేయించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థులను పలకరిస్తూ కడుపునిండ తినాలని, అన్నం పరబ్రహ్మ స్వరూపం పారవేయ్యకుండ మొత్తం తినాలని, శారీరకంగా ధృడంగా ఉంటేనే మానసికంగా ఆరోగ్యంగా ఉండి చదువుకోవటానికి వీలుగా ఉంటుందని సూచించారు.

**జక్కాపూర్ ఐకెపి సెంటర్‌లో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్**

మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామంలో ఐకెపి సెంటర్‌లో వరిధాన్యం కొనుగోలును ప్రక్రియను జిల్లా కలెక్టర్ హైమావతి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తేమశాతం తనిఖీ చేశారు. తేమశాతం రాగానే వెంటనే గన్నీ బ్యాగులో నింపి లారీల్లో లోడ్ చేయించాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. రోజు రెండు లారీల చొప్పున రామంచ గ్రామ హనుమాన్ మిల్‌కు ధాన్యం పంపిస్తున్నారని, సెంటర్ సిబ్బందికి కలెక్టర్ తెలిపారు. రైతులకు ఏలాంటి ఇబ్బంది సెంటర్‌లో అన్ని వసతులు కల్పించాలని కొనుగోలు జాప్యం కాకుండ చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి అకస్మీకంగా తనిఖీ చేశార. అటెండెన్స్ రిజిస్టర్ వేరిఫై చేసి మెడికల్ ఆఫీసర్ బాపురెడ్డి డ్రైడే వెళ్లారని ఇతర సిబ్బంది సునిత, సుధారాణి ఫీల్డుకు వెళ్లినట్లు సిబ్బందికి తెలుపగా ఆరా తీయాలని తహశీల్దార్ ఆదేశించారు. ఏదో మొక్కుబడిగా ఓపి రిజిస్టర్ రాస్తు ఫీల్డు. మీటింగ్ పేరుతో విధులు నిర్వహించని యేడల కఠిన చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఓకు ఫోన్ ద్వారా హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందివ్వటం కోసం తరుచుగా పిహెచ్‌సిని పర్యావేక్షణ చేయాలని తహశీల్దార్‌కు ఆదేశించారు.



## పెండింగ్ కాజ్ వేల నిర్మాణ పనులు చేపట్టండి

రాష్ట్ర మంత్రులకు సిపిఐ నేత చాడ వెంకట్‌రెడ్డి లేఖ



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ మొగిలి పాలెం గ్రామాలకు వెళ్లే రహదారిలో లో లెవల్ కాజ్‌వే, రేకొండ గ్రామంలోని ఊర చెరువు హైలెవల్ కాజ్ వే నిర్మాణ పనులు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి రాష్ట్ర మంత్రులు కోమటి రెడ్డి వెంకటరెడ్డి, దనసరి అనసూయ (సీతక్క) లకు లేఖలు రాశారు. మానకొండురు నుండి హుస్నాబాద్ వెళ్లే రహదారి 2020 లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతినడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అప్పటి ప్రభుత్వం రేకొండ మొగిలి పాలెం గ్రామాలకు వెళ్లే రహదారిలోని లో లెవల్ కాజ్ వే.. రేకొండ ఊరచెరువు మత్తడి హైలెవల్ కాజ్ వే పనులకు టెండర్ లు పిలిచి ఇప్పటి రవకు పనులు చేపట్టలేదని చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. వంతెనల నిర్మాణాలు చేపట్టక పోవడం మూలంగా ఇటీవల కురిసిన మొంతా తుఫాన్ వలన రేకొండ,మొగిలి పాలేం, పెద్దమ్మపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. హుస్నాబాద్ నుండి మానకొండూర్ వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పనులు మంజూరైటెండర్ స్థాయిలో నిలచి పోయినందున తక్షణమే నిర్మాణ పనులు చేచపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు లేఖను రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కార్యాలయంలో అందజేసినట్లు చాడ వెంకటరెడ్డి తెలిపారు.

రేకొండ నుండి ఎక్లాస్ పూర్ వెళ్లే రహదారి పై కాజ్ వే నిర్మాణ పనులు మంజూరై, టెండర్ పూర్తయి మూడు సంవత్సరాలు గడుస్తున్నా పనులు చేపట్టక పోవడం మూలంగా కొద్దిపాటి వర్షం కురిసిన తొక్కుడు బండ వద్ద ఉన్న వాగు ప్రవహిస్తుండటంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు, వ్యవసాయ బావులకు వెళ్లే రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, రేకొండ నుండి ఎక్లాస్ పూర్ వరకు కాజ్ వే నిర్మాణానికి రూ.29 లక్షలు, ఎక్లాస్ పూర్ స్మశాన వాటిక వరకు రూ.4.70 లక్షలు మంజూరు చేసి పనులకు, శంకు స్థాపనలు చేశారని తెలిపారు. టెండర్స్ పిలిచి కాంట్రాక్టర్ తో అగ్రిమెంట్ పూర్తయినప్పటికి పనులు మొదలు కాలేదని పేర్కొన్నారు.మొంతా తుపాన్ ప్రభావంతో వరద ప్రవాహం పెరిగి రెండు ఆవులు, దూడలు వరదలో కొట్టుకుపోయి చని పోయాయని, లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని, కాజ్ వే నిర్మాణ పనులు చేపట్టాలని చాడ కోరారు. ఈ మేరకు మంత్రికి రాసిన లేఖను మంత్రి కార్యాలయంలో అందజేసినట్లు పేర్కొన్నారు.

## నిజాం రాజులను గద్దె దింపిన చరిత్ర సిపిఐదే!




జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ప్రచార జాత కరపత్రాలను శుక్రవారం నాడు గోదావరిఖనిలోని స్థానిక భాస్కర రావు భవన్ లో సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాదిమంది ప్రజలతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసిన క్రమంలో రాష్ట్ర నలుమూలల నుండి సిపిఐ శతాబ్ది ఉత్సవాల ప్రచార జాతాలను ప్రారంభించుకోవడం జరుగుతుంది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జోడేఘాట్ నుండి రేపు నవంబర్ 15వ తారీకు ప్రచార జాత ప్రారంభమవుతుంది దీనికి సిపిఐ మాజీ ఎమ్మెల్యే జాతీయ నాయకులు కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేనా శంకర్ డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. రేపు 15 తారీకు జోడేఘాట్ నుండి ప్రారంభమయ్యే ప్రచార జాత 16 తారీకు ఉదయం 10 గంటలకు గోదావరిఖనిలో భారీ బైక్ ర్యాలీతో ప్రారంభమై ఖని చౌరస్తాలో బహిరంగ సభ ఏర్పాటు జరుగుతుందని, భారత కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర కోసం పోరాటం చేయడంతో పాటు భారతదేశానికి స్వతంత్రం వచ్చిన అనంతరం తెలంగాణ ప్రాంతంలో నిజాం రాజులు స్వతంత్రాన్ని ప్రకటించక పోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించి నిజాం రాజులను గద్దె దింపిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీది అని, లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచడంతోపాటు సాయిధ పోరాటంలో 4,500 మంది యువ కమ్యూనిస్టుల ప్రాణాలను త్యాగం చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని వారన్నారు. సిపిఐ నగర సమితి కార్యదర్శి కే కనకరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోషిక మోహన్, గౌతమ్ గోవర్ధన్, ఓదెమ్మ , సూర్య, లక్ష్మీ నారాయణ, శంకర్, టి.రమేష్ కుమార్ రాజయ్య, గంగారపు చంద్రయ్య, రాణవేణి సుధీర్ కుమార్, లెనిన్, సాధుల శివ, ఆసాల నవీన్, గండి ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె

మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి

జిల్లా ప్రధాన కార్యదర్శి పూసాల రమేష్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో నేటి నుండి నిరోధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు, కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్టు జిల్లా మధ్యాహ్న భోజన ప్రధాన కార్యదర్శి పూసాల రమేష్ తెలిపారు. శుక్రవారం రోజున స్థానిక జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 15 నుండి జరిగే నిరవధిక సమ్మెకు సమ్మె నోటీసు అక్టోబర్ 31–2025 రోజున జిల్లా విద్యాశాఖ అధికారికి, జిల్లా కలెక్టర్ కు ఇవ్వడం జరిగిందని,ఒక పూట భోజనంతో ప్రారంభమైన మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వాలు మారిన కొద్దీ మెనూ మార్చుకుంటూ పిల్లలకు మంచి పౌష్టిక ఆహారం అందాలనే దృష్టితో మారుస్తున్నారు కానీ, సరిపడ బిల్లులు ఇవ్వకుండా, మధ్యాహ్న భోజన కార్మికులపై పెనుబారు మోపుతున్నారనీ, గతంలో కోడిగుడ్డును భోజనము లో ఇవ్వాలని నిర్ణయించి, కోడుగుడ్డుకు 50 పైసలు మాత్రమే ఇచ్చారని, రెండవ కోడి గుడ్డును కూడా ఇవ్వాలిని నిర్ణయించి, అప్పటి నుండి కోడిగుడ్డు మార్కెట్లో ఎంత దొరుకుతుందో అంతకంటే తక్కువగా కోడ్ చేసుకుంటూ మూడవ కోడిగుడ్డు ఇప్పుడు ఇస్తున్నారనీ, కాబట్టి మధ్యాహ్న భోజన కార్మికులను ఫుల్ టైం వర్కర్లు గా గుర్తించి కనీస వేతనం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందనీ అన్నారు. ఏ ప్రభుత్వం వచ్చిన మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవేతరం పెంచకుండా ఇబ్బందుల పాలు చేస్తుందని, కనుక మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం 10000 రూపాయలు ఇచ్చి, అంగన్వాడిలకు ప్రభుత్వం ఏ విధంగా నీతో నిత్యవసర సరుకులు సరఫరా చేస్తుందో అదే విధంగా మాకు కూడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలా చేసే వరకు నవంబర్ 15 నుండి పాఠశాలలో వంటలు బంద్ చేసి పెద్దపెల్లి జిల్లా వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని ప్రభుత్వానికి తెలియజేశామని, నవంబర్ 15న మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నా చేసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి మధ్యాహ్న భోజన వర్కర్లు హాజరవుతారని తెలిపారు.

## లక్ష్య సాధనకు కఠోరంగా శ్రమించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంగనర్:** విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు నిత్యం కఠోరంగా శ్రమించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బాల బాలికలు నిత్యం చదువుపైనే ధ్యాస పెట్టాలని, అనవసర విషయాలు పట్టించుకోవద్దని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ఇంట్రెస్ట్ చూపాలని, బాధ్యాయుతంగా క్రమశిక్షణతో చదువుతూ మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. లక్ష్యాన్ని సాధించే వరకు పట్టుదలతో ముందుకెళ్లాలని పేర్కొన్నారు.



స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాకడే మాట్లాడుతూ చిన్నారులు ఎంజాయ్ చేస్తూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి పేరు తీసుకు రావాలని కోరారు. అత్యుత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ వేడుకలలో బాలభవన్, బాల సదనం, కేజీబీవి, సంక్షేమ ట్రస్ట్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్, పోలీస్ కమిషనర్, జడ్జ్, టీచర్, రైతు, అడ్వకేట్, డాక్టర్ వృత్తి నిర్వహించి ప్రజలకు వారు ఏ విధంగా సేవలందిస్తారోఅవగాహన కల్పించారు. అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఆహుతులను ఆకట్టుకున్నారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సబితా, సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జెసిబివో కృపారాణి, డిసిపివో పర్వీన్, 1098 జిల్లా కో ఆర్డినేటర్ ఆవుల సంపత్, సిడిపివోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు కృషి : కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పిల్లల ఉజ్వల భవిష్యత్తు కల్పించేందుకు మన మంతా కలిసి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్స్ మీటింగ్ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ప్రణాళికాబద్ధంగా మనమంతా కలిసి పనిచేయాలని అన్నారు. పిల్లల హాజరు, పాఠశాలలో నాణ్యమైన బోధన, ఆంగ్ల బోధన, కెరియర్ గైడెన్స్ వంటి వివిధ అంశాలలో విద్యార్థులకు తోడుగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.పిల్లలు పాఠశాలకు రెగ్యులర్ గా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాలకు విద్యార్థులు రాని పక్షంలో వెంటనే ఫాలో అప్ చేయాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే బోధనలో నాణ్యత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందనీ , పిల్లలకు పాఠ్యాంశాలు, అర్థమయ్యే విధంగా బోధన పద్ధతులలో కూడా మార్పులు చేస్తున్నామని అన్నారు. పిల్లలు ఎదిగి సమాజంలో గౌరవప్రదమైన జీవితం సాధించేందుకు అవసరమైన అన్ని రకాల సహకారాలు అందించాలని, జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగేందుకు ఆంగ్ల భాష పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, కెరియర్ గైడెన్స్, ఎక్స్పోజర్ విజిట్స్ చాలా అవసరమని అన్నారు. ప్రైవేట్ పాఠశాల లోని విద్యార్థులకు దీటుగా మన పిల్లలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పేరెంట్ టీచర్స్ మీటింగ్ లకు తల్లిదండ్రులు రెగ్యులర్ గా హాజరు కావాలని కలెక్టర్ కోరారు.పిల్లలపై శ్రద్ధ వహిస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పాటు ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా కొంత బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ కోరారు.అనంతరం జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలోని అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యను కూడా అందించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## పిల్లలకు అన్ని విషయాల గురించి అవగాహన కల్పించాలి: సిపి

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** దేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నేహ్రుకు చిన్నారులంటే చాల ఇష్టమని.. జవహర్‌నేహ్రు జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్‌కమార్ అన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం బాగా తీసుకోవాలని, రోజు వ్యాయామం చేయాలన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలల దినోత్సవం నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన పిల్లలకు బహుమతులు అందచేశారు. ఈసందర్భంగా సిపి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎల్లప్పుడు జాగ్రత్తగా ఉంటూ సమాజంలో అసభ్యంగా ప్రదర్శించే ప్రక్రియను గుర్తించేలా పిల్లలకు, గుడ్,బ్యాడ్ టచ్‌ల గురించి చెప్పాలని అధికారులకు తెలిపారు. మీ పాఠశాల, గురుకుల సమాజంలోకాని ఎక్కడ ఏలాంటి నేరాలు నమోదైన ఎవరైన అసభ్యంగా ప్రవర్తించిన 100 డయల్‌కు ఫోన్ చేయాలన్నారు. చైల్డ్ కేర్ సెంటర్‌లో ఉంటున్నట్లు బ్యాడ్ ఫీలింగ్ ఉండకూడదని, మీ కోసం ప్రభుత్వం వివిధ ఏజెన్సీలు ప్రోత్సాహం వారి సహకారంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. రోజు సమాజంలోజరిగే విషయాలు తెలుసుకోవటం కోసం న్యూస్ పేపర్లు, పులవురు పుస్తకాలు చదువాలని తెలుగు, ఇంగ్లీష్, హిందీ పలు బాషలు చుట్టు పరిసరాల్లో జరుగుతున్న విషయాలను నేర్చుకోవాలని కోరారు. సబ్జెక్టు జ్ఞానం కాకుండ బయట విషయాలను సైతం నేర్పించాలని ప్రతి అధికారికి తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఏలా ఉండాలనుకుంటున్నారో ఒక కల ఉండాలని, ఆ కలను సాకారం చేయటం కోసం ప్రతి రోజు కష్టపడితే లక్ష్యాన్ని చేరుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ అందరికి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. పిల్లలు మంచి ఆహారాన్ని తీసుకుంటూ.. ఆటలు ఆడుతూ సంతోషంగా ఉండాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యంగా పెట్టుకొని సమయం వృధా చేయకుండ చదువాలని తెలిపారు. అనంతరం బాలికల సంరక్షణకు సంబంధించిన పలు పోస్టర్‌లను అధికారులతో కలసి ఆవిష్కరించారు.



## పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కౌటాల :**మండలంలోని శ్రీ వైష్ణవి మాత జిన్నింగ్ మిల్లు వద్ద సిసిఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు.వారు మాట్లాడుతూ పత్తి రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.8110 మద్దతు ధర ప్రకటించిందని, రైతులందరూ సి సి ఐ కొనుగోలు కేంద్రాల వద్దే పత్తిని అమ్మకానికి పెట్టాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన కపాస్ కిసాన్ మొబైల్ యాప్ ను ప్రతి రైతు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.సిపిఐ వెంగళ్ రెడ్డి, డిఎంఒ అష్రఫ్, ఎఒ ప్రేమలత, మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బండి రాజేందర్ గౌడ్, మాజీ జడ్పిటిసి ఎల్ములే మల్లయ్య, మాజీ ఎంపిటిసి దుర్గం మోతిరాం, రైతులు పాల్గొన్నారు.

## వరి దుబ్బులు కాల్చొద్దు

జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ

**ప్రజాపక్షం/మందమర్రి:**పంట కోతల తర్వాత వరి మొదళ్లను కాల్చకుండా సేంద్రియ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం సారంగపల్లి గ్రామాల్లోని వరి పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ డివిజన్ ఎడిఎ బానోత్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు. వరి దుబ్బులను నేలలో కలుపుట ద్వారా సూక్ష్మ జీవులు పెరిగి భూమికి బలం చేకూరుతుందని, అధిక దిగుబడులు సాధ్యమవుతాయని సురేఖ వివరించారు. దుబ్బులు కాల్చడం వలన భూమి నిర్జీవమై దిగుబడులు తగ్గడమే కాకుండా వాతావరణ కాలుష్యం పెరుగుతుందని హెచ్చరించారు. ధాన్యంలో తేమ శాతం 14–17 మధ్య ఉన్నప్పుడే కోతలు చేపట్టాలని, కోసిన ధాన్యాన్ని విస్తరణ అధికారి అనుమతితోనే కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ఆమె సూచించారు. పత్తి, వరిపైనే ఆధారపడకుండా పంట మార్పిడి చేపట్టి ఆదాయం పెంపు కోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు రాయమల్లు, కమల, మనోహర్ రావు పాల్గొన్నారు.

## అడవిలో పులి సంచారం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ హెచ్చరిక

**ప్రజాపక్షం / సిర్పూర్ టి:**సిర్పూర్ టి మండలంలో పులి సంచారం కలకలం రేపుతోంది. కాగజ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలోని రైల్వే వంతెన వద్ద పులి రోడ్డు దాటుతున్న దృశ్యాన్ని ప్రయాణికులు ప్రత్యక్షంగా చూసినట్లు సమాచారం. అదే పులి కాగజ్ నగర్, చింతగూడ వైపుకు వెళ్లినట్టు, అనంతరం మళ్లీ సిర్పూర్, అరేగూడ రహదారి దిశగా కదిలినట్టు స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఒ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణికులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రాత్రివేళల్లో ఒంటరిగా ప్రయాణించకూడదని, అడవి ప్రాంతాలకు దగ్గరగా వెళ్లడం నివారించాలని ఆయన సూచించారు. అటవీ శాఖ అధికారులు పులి కదలికలపై పర్యవేక్షణ పెంచి, గ్రామాలకు సమాచారం చేరవేస్తున్నట్లు తెలిపారు.

## సిర్పూర్‌టిలో ఆగని రేషన్ దందా

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :**సిర్పూర్ టి మండలంలోని హుడికిలి, వెంకట్రావ్‌పేట్ గ్రామాల నుంచి రేషన్ బియ్యం అక్రమంగా మహారాష్ట్ర సరిహద్దుకు తరలింపు కొనసాగుతూనే ఉంది. రాత్రివేళల్లో చిన్న వాహనాలు, ఆటోలు, బోలెరోలు, ఐచర్ వ్యాన్ల ద్వారా బియ్యం తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రేషన్ డీలర్లు, మధ్యవర్తుల అనుమతి లేకుండా ఇలాంటి రవాణా సాధ్యం కాదని, పట్టుబడిన బియ్యం తిరిగి మార్కెట్లకే చేరుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ పలు వాహనాలు బియ్యం తీసుకెళ్తున్నాయని, అధికారులు చూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు సరిహద్దు చెక్‌పోస్టుల్లో కఠిన తనిఖీలు, రాత్రి పర్యవేక్షణ, రేషన్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## నూతన గ్రామపంచాయతీ భవనాలకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్:**మండలంలోని చేడ్వాయి, బొంబాయిగూడ గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీదండే విఠల్ స్థానిక నాయకులు, అధికారులతో కలిసి శుక్రవారం శంకు స్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఒక్కో భవనాన్ని సుమారు 20 లక్షల రూపాయలతో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, పల్లెల్లో ప్రజలకు మెరుగైన పాలనా సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కొత్త గ్రామ పంచాయతీ భవనాలను నిర్మిస్తుందన్నారు. గ్రామ కార్యకలాపాలు నిర్వహించడానికి, ప్రజలకు సేవలు అందించడానికి ఈ భవనాలు శాశ్వత వేదికగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జెఇ జీవన్, ఎంపిడిఒ ఆల్బర్ట్, ఎంఇఒ రమేష్ బాబు, నాయకులు సముద్రాల రాజన్న,చౌదరి శ్రీనివాస్,సత్తయ్య,గంగారాంఆశన్నతదితరులుపాల్గొన్నారు.

## బాసరలోని శివాజీ చౌక్ నుండి సిపిఐ బస్ జాతర ప్రారంభం

కామ్రేడ్ ఎస్.విలాస్..

**ప్రజాపక్షం/ముధోల్ :**నేడు బాసరలోని శివాజీ చౌక్ నుండి ప్రారంభం కానున్న సిపిఐ శత వార్షికోత్సవ బస్ జాతరను ప్రజలు,పార్టీ సంఘాల నాయకులు విజయవంతం చేయాలని కామ్రేడ్ విలాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.ఇట్టి కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,కామ్రేడ్ పశ్య పద్మ రానున్నారని తెలిపారు. పార్టీని గ్రామ గ్రామాన బలోపేతటం చేయడంలో భాగంగానే బస్ జాతరను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.బస్ జాతర కొనసాగే మార్గంలో వివిధ ప్రాంతాల నాయకులు పెద్ద మొత్తంలో పాల్గొని విజయవంతం అయ్యేలా కృషి చేయాలని తమ సంఘాలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

## బ్లాక్‌స్పాట్‌లలో సంయుక్త తనిఖీలు





**ప్రజాపక్షం/మందమర్రి:** మందమర్రి సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సమిష్టి చర్యలు చేపట్టాలని రామగుండం సిపి అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డిసిపి ఎ. భాస్కర్, సూచనలతో పోలీసులు ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించారు. శుక్రవారం బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ పర్యవేక్షణలో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి స్థానిక అధికారులతో కలిసి సంయుక్త తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి డిఇఇ, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు కలిసి శ్రీనివాస్ గార్డెన్ నుండి బొక్కలగుట్ట ఎక్స్ రోడ్ వరకు రహదారిని పరిశీలించారు. ప్రమాదాలైన ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని అదుపుచేయడం కోసం స్పీడ్ బ్రేకర్లు, స్పష్టమైన సూచిక బోర్డులు, రాత్రి వేళల్లో రహదారిపై దృశ్యమానత కోసం మధ్యలో లైటింగ్ ఏర్పాటు వంటి చర్యలను తక్షణమే అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారిపై నివసించే ప్రజలు నిర్దేశిత ప్రదేశాల్లోనే రహదారి దాటాలని, పశువులను రోడ్లపైకి వదలకూడదని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్ రెడ్డి సూచించారు. నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు తప్పవని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో ఆర్‌డిఒ తనిఖీ

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**రైతులు పండించిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలి మెదక్ కార్డు రమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ముస్లాపూర్ పిఎసిఎస్ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ, రైతులు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని త్వరగా తూకం వేసి రైస్ మిల్ కు పంపాలని రైతుల వివరాలు వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతు ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో బాలల దినోత్సవం లో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట తహసిల్దార్ మల్లయ్య, పిఎసిఎస్ అధికారులు సాయిబాబా తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ప్రభుత్వసలహాదారు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ





**ప్రజాపక్షం/నిజామాబాద్:**విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేలా నాణ్యమైన విద్యను బోధించాలని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి,మైనార్టీ సంక్షేమ శాఖల సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను శుక్రవారం ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిలతో కలిసి ప్రభుత్వసలహాదారు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ లాంఛనంగా ప్రారంభోత్సవాలు చేశారు. వసతిగృహ నిర్మాణాల కోసంపూర్వ విద్యార్థి ప్రతాప్‌రెడ్డి రూ.1.06 కోట్ల విరాళం అందించగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ రూ.2.86 కోట్ల నిధులను విరాళంగా అందజేసింది. ఈ నిధుల తోడ్పాటుతో ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో బాల, బాలికలుఎస్‌సి,ఎస్‌టివిద్యార్థులకోసం వేర్వేరుగానిర్మించిన నూతన వసతిగృహాలను ప్రభుత్వసలహాదారు సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి సహకార ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గత పదేళ్లలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన సాంకేతిక విద్యను బలోపేతం చేయాలనే కృతనిశ్చయంతో సిఎం రేవంత్‌రెడ్డి విస్తృత చర్యలు చేపడుతున్నారన్నారు. ఆధునిక సాంకేతిక విద్యను అభివృద్ధి చేయటం ద్వారా యువతకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికనుగుణంగా పాలిటెక్నిక్ కళాశాలలో మెరుగైన సాంకేతిక విద్యనుబోధిస్తూ విద్యార్థులకు ఉజ్వల భవితవ్యానికి బాటలు వేయాలని అధ్యాపకులకు సూచించారు. ఈ మేరకు అవసరమైన అన్నిమౌలిక, వసతి సదుపాయాలను కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. షబ్బీర్‌అలీ మాట్లాడుతూ నేటి సామాజిక అవసరాలకనుగుణంగా ఆధునిక సాంకేతిక విద్యతో కూడిన కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో నూతనంగా 66 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. నిర్దేశిత కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సత్వరమేఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకుందని, టాటా కంపెనీతో ఒప్పందం సైతం కుదుర్చుకుందని తెలిపారు. ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూదేశ ప్రగతికి ప్రణాళికాబద్ధంగా కృషి చేసిన దార్శనికుడు,దేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతి రోజున పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టళ్లను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వసతిగృహాల నిర్మాణాల కోసంవిరాళమందించిన పూర్వ విద్యార్థి ప్రతాప్‌రెడ్డిని భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ సహాయ జనరల్ మేనేజర్ సెల్వంలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ హందాన్, డైరెక్టర్ మానాల మోహన్‌రెడ్డి, అంతిరెడ్డిరాజారెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భారతి పాల్గొన్నారు.

## దేశ పురోగతి కోసం కలిసి నడుద్దాం

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిలో ఆదిలాబాద్ ఎంపి నగేష్





**ప్రజాపక్షం /ఆసిఫాబాద్;**దేశ పురోగతి కోసం మహనీయుల ఆశయాల స్ఫూర్తిగా అందరం కలిసి నడుద్దామని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు గొడం నగేష్ అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేరా భారత్ ఐక్యత మార్చ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమీకృత కలెక్టరేట్ భవనం నుండి కొమురం భీం చౌరస్తా మీదుగా తిరిగి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని ఎంపి గొడం నగేష్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపి గొడం నగేష్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యత కోసం అహర్నిశలు కృషి చేశారని, స్వాతంత్ర్యానంతరం ఎన్నో రాజరిక రాజ్యాలను ఏకం చేసి భారతదేశాన్ని సమగ్రమైన దేశంగా మలిచారని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ పటేల్ దేశ తొలి హోం శాఖ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా దేశ సమగ్ర అభివృద్ధిలో పాలుపంచుకున్నారని, ఆయన హయాంలో ఏర్పాటు అయిన సంస్థలు నేటికీ కొనసాగుతున్నాయని తెలిపారు.సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని యువత దేశ ఐక్యత, అభివృద్ధి కోసం కృషి చేయాలని తెలిపారు. మేరా భారత్ కార్యక్రమం ఇన్‌చార్జ్, జిల్లా యువ అధికారి శైలి బెల్లాల్, నోడల్ అధికారి రమాదేవి, జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి అహ్మద్, జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నాబహుసాటే అడుగుజాడల్లో నడుచుకోవాలి

విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావ్ పటేల్



**ప్రజాపక్షం/భైంసా :**సాహిత్య సామ్రాట్ అన్నబహు సాటే బోధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు.శుక్రవారం భైంసాలో అన్నా బాహు సాటే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆ యన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.సాటే బోధనలు పేద బడుగు బలహీన వర్గాల వారికి ఎంతో న్యాయం చేశాయన్నారు.మహనీయుల మార్గదర్శకానుసారంగా నడుచుకుంటే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు.విగ్రహ కమిటీ వారికి ఎన్నికష్టాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాన్ని సాధిం చి,విగ్రహాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామమని,ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు అ భినందనలు తెలియజేశారు.తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు.అన్నా బాహు సాటేకు భారతరత్న ఇచ్చేలా తన వంతుగా, మ ద్దతు ఇవ్వనున్నట్లు చెప్పారు.కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతించి శాలువతో సత్కరించారు.విగ్రహ ఆవిష్కరణ కంటే ముందు పాదయాత్రగా ఎమ్మెల్యేతో పాటు నాయకులు క మిటీ సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొ ని పూల మాలవేసి నివాళులు అర్పించారు.విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈనెల15న సిపిఐ ప్రచార జాత షురూ

మండల కార్యదర్శి దాగం మల్లేష్



**ప్రజాపక్షం/కాసిపేట :**భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) డిసెంబర్ 26న ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా చలో ఖమ్మం ప్రచార జాతను జయప్రదం చేయాలని సిపిఐ కాసిపేట మండల కార్యదర్శి దాగం మల్లేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కరపత్రం విడుదల చేశారు. నవంబర్ 15 నుంచి కొమరం భీమ్ జోడేఘాట్ నుండి భద్రాచలం వరకు ప్రచార జాత ప్రారంభం కానుందని నాయకులు తెలిపారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా సోమగూడెం క్రాస్ రోడ్డు వద్దకు 15న సాయంత్రం 6 గంటలకు జీపు జాత చేరుకుంటుందని, ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున హాజరై ఈ జాతలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు జాడి పోచం, దాడి గట్టయ్య, మినుగు లక్ష్మీనారాయణ, దుర్గం సుధాకర్, ఆవులూరి రాజు, లింగంపల్లి లింగన్న, దాసరపు సత్తయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

## నేటి బాలలే రేపటి తెలంగాణ భవిష్యత్తు ; కలెక్టర్



**ప్రజాపక్షం /నస్పూర్:**రేపటి తెలంగాణ భవిష్యత్తు నేటి బాలలపై ఆధారపడి ఉందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. 2047 రైసింగ్ తెలంగాణ విజన్ లో పిల్లల పాత్ర అత్యంత కీలకమైనదని, 018 సంవత్సరాల వయసు ఉన్న వారందరూ పిల్లలుగా పరిగణించబడతారని కలెక్టర్ తెలిపారు. పిల్లలకు రాజ్యాంగం చట్టపరమైన హక్కులను కల్పించిందని, వీటిపై బాలలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. బాలికలు తమ ప్రతి హక్కును తెలుసుకోవాలని, దాడులు, వేధింపులను నిర్మూలించేందుకు సమాజం కట్టుబడి ఉండాలని కోరారు. పిల్లలు ఆరోగ్యంగా, సంతోషంగా, ధైర్యంగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తుందని, మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తుందని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా మా రోజు మా హక్కు నినాదంతో బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. పిల్లల హక్కులపై అవగాహన పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టి చైతన్య పరచడం జరుగుతుందని, ఆ దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమానికి ముందుగా సంతకాల సేకరణ చేపట్టి, బాలల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి బాలలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ వేడుకలకు జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇది షాపింగ్ మాలా? లేక పాఠశాలనా?





తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం

**ప్రజాపక్షం/కౌడిపల్లి :**జనం బాటలో భాగంగా శుక్రవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కౌడిపల్లి మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలకు చేరుకొని విద్యార్థులతో మాట్లాడి క లిసి భోజనం చేశారు. విద్యార్థుల యోగక్షేమాలను తెలుసుకొని కాసేపు ముచ్చటించారు. భోజనం రోజు ఇలానే పెడుతున్నారా, మెనూ ప్రకారం పాటిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు భో జనం బాగుంటుందని బదులిచ్చారు. ఈ రోజు చిల్డ్రెన్స్ డే కావడంతో విద్యార్థులకు చిల్డ్రెన్స్ డే శుభాకాంక్షలు తె లిపారు. ఈ సందర్భంగా మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ, జనం బాట పర్యటలో భా గంగా కౌడిపల్లి నుండి వెళ్తుంటే అకస్మాత్తుగా షాపింగ్ మాల్ తరహా భవనంలో విద్యార్థులు ఉన్నారని ఇది షాపి ంగ్ మాలా లేక పాఠశాలనా అని వెళ్లి చూసేసరికి ఇది ని జంగా పాఠశాల అని పాఠశాల వాతావరణం లేని బిల్డి ంగ్‌లో ఎలా కొనసాగిస్తారని ఆమె ప్రశ్నించారు. కనీసం అద్దె భవనానికైనా కనీస వసతులు లేక హైవే పక్కన ప్రమాదకరంగా పాఠశాల భవనం కొనసాగుతుందని వెంటనే ప్రభుత్వం స్పందించి సొంత భవనం మంజూరు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కనీసం అద్దె భవనంలోనైనా పాఠశాల వాతావరణం కనీస వసతులు ఉండేటట్లు చూడాలని ప్రభుత్వానికి సూచించారు.

**కాళేశ్వరంనీళ్ళురాలే..ఘనపూర్ ఎత్తు పెరగలే, ప్రాజెక్టు ఎత్తు పెంపుకు మోక్షమెప్పుడు?**

కాళేశ్వరం నీళ్ళు సింగూరుకు రాలే.... ఘనపూర్ ప్రాజె క్టు ఎత్తు పెరగలేదని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత ఎద్దేవా చేశారు. శుక్రవారం జన జాగృతి కార్యక్రమంలో భాగంగా ఘనపూర్ ప్రాజెక్టు ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె నిలిచిన ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..నిధుల లేమితో అర్ధాంతరంగా నిలిచిన ఘనపూర్ ప్రాజెక్టు పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి మోక్షం కల్పించాలని అన్నారు. నిజాం కాలం నాడు నిర్మించిన ప్రాజెక్టు పూడిక లేక నీటి సామర్థం పెంచక పోవడంతో సాగు భూములు బీడు భూములుగా మారుతాయని గ్రహించి గత దశాబ్ద కాలం నాడు ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు పూనుకొని పనులు ప్రారంభించిన పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని, గత ప్రభుత్వ హయంలో అరకొర నిధులు విడుదల చేయడంతో పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయని ముంపుకు గురైన రైతుల భూముల కొంత మంది రైతులకు అందగా ఇంకా కొన్ని గ్రామాల రైతులకు భూముల డబ్బులు అందాల్సి ఉందన్నారు. నిజాంకాలంలో నిర్మించిన ప్రాజెక్టుకు ప్రభుత్వం వెంటనే 30కోట్ల నిధులు విడుదల చేసి ప్రాజెక్టు ఎత్తు పనులు జరిగేలా చూడాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం వన దుర్గ భవాని మాత ఆలయం చేరుకోగా ఇఒ చంద్రశేఖర్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె వన దుర్గ భవాని మాతకు పట్టు వస్త్రాలు సమర్పించి అమ్మ వారిని దర్శించుకొనిప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వీరికి ఆలయ ఇఒచంద్రశేఖర్ శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఆమె వెంట కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## రెండు పడకల ఇండ్లలో మౌలిక వసతులు



జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆదేశం

**ప్రజాపక్షం/కాగజ్ నగర్:**నిరుపేదల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు పడకల ఇండ్లలో మౌలిక వసతులను వెంటనే కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం బోరిగాం గ్రామ శివారులో నిర్మాణాలు పూర్తి అయిన రెండు పడక గదుల ఇండ్లను సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఇతర శాఖల అధికారులతో కలిసి సందర్శించి సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదల కొరకు ప్రభుత్వం నిర్మించిన ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఇండ్లలో విద్యుత్ సరఫరా, కిటికీలు, తలుపులు, అంతర్గత రహదారులు, త్రాగు నీరు, మురుగు కాలువల నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేసి ఇండ్లను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని, పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఇండ్ల మధ్యలో ఉన్న ముళ్ళ పొదలను తొలగించాలని, నివాస ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఇ శేషరావు, గృహ నిర్మాణ శాఖ డిఇఇ వేణుగోపాల్, రోడ్లు భవనాల శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు, తహసిల్దార్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ




# తొలి రోజు టీమిండియాదే!



సొంతగడ్డపై మరో టెస్టు సిరీస్‌పై గురిపెట్టిన జట్టు ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈడెన్ గార్డెన్స్‌లో ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ విజేత దక్షిణాఫ్రికాను టీమిండియా వణికించింది. తొలి టెస్టులో జస్ప్రీత్ బుమ్రా(35–27) నిప్పులు చెరగడంతో సఫారీలను 159కే ఆలౌట్ చేసిన భారత్ తొలి రోజు పైచేయి సాధించింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన గిల్ సేన వికెట్ కోల్పోయి 37 రన్స్ చేసింది. ఆట ముగిసే సరికి ఓపెనర్ కేఎల్ రాహుల్(13 నాటౌట్), వాషింగ్టన్ సుందర్(6 నాటౌట్)లు క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ పర్యటనలో సిరీస్ సమం చేసిన టీమిండియా సొంతగడ్డపై జోరు చూపిస్తోంది. వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేసిన భారత్ ఈసారి డబ్ల్యూటీసీ విజేత దక్షిణాఫ్రికాను రెండొందల లోపే కుప్పకూల్చింది. పేస్ ట్రాక్ మీద ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా(5–27) రెచ్చిపోవడంతో సఫారీలు డగౌట్‌కు క్యూ కట్టారు. బుమ్రాకు కుల్దీప్ యాదవ్ తోడవ్వడంతో పర్యాటక జట్టు ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ ఓపెనర్ యశస్వీ జైస్వాల్(12) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్(6 నాటౌట్), కేఎల్ రాహుల్(13 నాటౌట్) మరో వికెట్ పడనీయలేదు. అయితే.. వెలుతురు తగ్గిపోవడంతో త్వరగానే ఆటను ముగించారు. దాంతో.. తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 37 పరుగులు చేసిన టీమిండియా ఇంకా 122 పరుగులు వెనకబడి ఉంది.

### రికెల్టన్‌ను బౌల్డ్ చేసి

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించింది. ఓపెనర్లు రియాన్ రికెల్టన్(23) ఎడెన్ మర్క్‌రమ్(31)లు ధనాధన్ ఆడుతూ భారత్‌పై ఒత్తిడి పెంచాలనుకున్నారు. తొలి వికెట్‌కు 57 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని జస్ప్రీత్ బుమ్రా విడదీసి వికెట్ల వేటకు తెరతీశాడు. మొదట రికెల్టన్‌ను బౌల్డ్ చేసిన యార్కర్ కింగ్ ఆ తర్వాత.. మర్క్‌రమ్‌ను పెవిలియన్ ఆ తర్వాత కెప్టెన్ తెంబా బవుమా(3)ను కుల్దీప్ యాదవ్ బోల్తా కొట్టించాడు. 82కే మూడు వికెట్ల పడిన వేళ.. కుర్రాళ్లు టోనీ డిజోర్జి(24), ట్రిస్టన్ స్టబ్స్(15 నాటౌట్) సఫారీ టీమ్‌ను ఆదుకున్నారు. వీరిద్దరూ కీలక రన్స్ జోడించి స్కోర్ వంద దాటించారు. అయితే.. ఈ జోడీని విడదీసిన బుమ్రా.. ఆ తర్వాత మరో రెండు వికెట్లు తీసి దక్షిణాఫ్రికా పతనాన్ని శాంసించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా టెయిలెండర్ల సాయంతో స్టబ్స్ జట్టు స్కోర్ రెండొందలు దాటించాలనుకున్నాడు. కానీ.. హర్మర్, కేశవ్ మహరాజ్(0)లను ఔట్ చేసిన బుమ్రా 159కేసఫారీల ఇన్నింగ్స్ ముగించాడు.

## వైభవ్ ఊచకోత..

### 32 బంతుల్లోనే శతకం



ఐపిఎల్‌లో మెరుపు సెంచరీతో వార్తల్లో నిలిచిన వైభవ్ సూర్యవంశీ మళ్లీ చెలరేగిపోయాడు. అండర్ 19 విభాగంలో రెచ్చిపోయి ఆడుతున్న ఈ యంగ్‌స్టర్ అసియాకప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో ఊచకోతకు తెగబడ్డాడు. ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ యూఏఈ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ 32 బంతుల్లోనే శతకగర్జన చేశాడు. ఆకాశమే హద్దుగా దంచేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్ 10 ఫోర్లు, 9 సిక్సర్లతో మూడంకెల స్కోర్ అందుకున్నాడు. జూనియర్ క్రికెట్‌లో సంచలనంగా పేరొందిన వైభవ్ సూర్యవంశీ మరో రికార్డు బద్దలు కొట్టాడు. ఏసీసీ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో వీరబాదుడుతో యూఏఈపై శతకం సాధించాడు. పురుషుల టీ20ల్లో భారత్ తరఫున మూడో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. దొరికిన బంతినల్లా బౌండరీకి పంపిన ఈ చిచ్చరపిడుగు.. వెస్టిండీస్ వెటరన్ క్రిస్ గేల్ అత్యధిక స్కోర్‌ను అధిగమించేలా కనిపించాడు. కానీ, వైభవ్ 144 వద్ద ఔట్ కావడంతో గిల్ రికార్డు అలానే ఉండిపోయింది.

**శాంసన్ గాయం.. వైభవ్‌కు వరం**

ఐపీఎల్ 18వ సీజన్ నుంచి వైభవ్ పేరు గట్టిగా వినిపిస్తోంది. ఓపెనర్‌గా అదరకబెదరక సిక్సర్ల వాన కురిపించే అతడు క్రీజులో ఉన్నాడంటే బౌలర్లు జడుస్తున్నారు. పన్నెండేళ్లకే రంజీల్లో అరంగేట్రం చేసిన వైభవ్‌ను ఆ ఎడిషన్ మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. రూ.1.5 కోట్లకు రాజస్థాన్ శిబిరంలో చేరిన ఈ కుర్రాడు తన బ్యాటింగ్‌ను సానబెట్టుకున్నాడు. కెప్టెన్ సంజూ శాంసన్ గాయపడడంతో లక్నోతో మ్యాచ్‌లో వైభవ్‌కు ఓపెనర్‌గా అవకాశం వచ్చింది. తొలి మ్యాచ్‌లోనే 35 పరుగులతో ఆకట్టుకున్న ఈ చిచ్చరపిడుగు.. ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీతో గర్జించాడు. సిరాజ్, రషీద్ ఖాన్ వంటి మేటి బౌలర్లను అలవోకగా ఆడేసిన వైభవ్ .. ఐపీఎల్ హిస్టరీలోనే రెండో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. బౌలర్ మారినా బంతి గమ్యం స్టాండ్స్‌లోకే అన్నట్టు చెలరేగిన వైభవ్.. 35 బంతుల్లోనే వందతో జైపూర్ ప్రేక్షకులకు సెల్యూట్ చేశాడు. అతడి విధ్వంసక ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 11 సిక్సర్లు ఉండడం విశేషం. ఐపీఎల్ స్టార్‌గా భారత అండర్19 జట్టులోకి వచ్చిన వైభవ్ ఇంగ్లాండ్ పర్యటనలో.. ఆపై ఆస్ట్రేలియా గడ్డపై చితక్కొట్టాడు. ఆసీస్‌తో జరిగిన యూత్ వన్డేలో మెరుపు హాఫ్ సెంచరీ బాదిన వైభవ్.. అత్యధిక సిక్సర్లతో మరో ఫీట్ సాధించాడు. మాజీ టీమిండియా ప్లేయర్ ఉన్ముక్త్ చంద్ పేరిట ఉన్న రికార్డును తన పేరిట రాసుకున్నాడీ చిచ్చరపిడుగు.

# ఫోకస్ సైన్స్

## ల్యాబ్‌లో న్యూరాన్ సృష్టి!



అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మాసెచూసెట్స్ శాస్త్రవేత్తలు ప్రయోగశాలలో ఓ అద్భుతాన్ని ఆవిష్కరించారు. క్రియాశీల న్యూరాన్‌ను సృష్టించారు. ఇది మానవ మెదడు కణం లాగా ప్రవర్తిస్తుంది. జీవన న్యూరాన్‌లతో కూడా కమ్యూనికేట్ చేస్తుంది. 'జియోబాక్టర్ సల్ఫరెడ్యూసెన్స్' అనే సూక్ష్మ జీవి నుంచి తీసిన ప్రొటీన్ నానోవైర్లను ఈ న్యూరాన్ నిర్మాణానికి శాస్త్రవేత్తలు ఉపయోగించారు. ఈ నానోవైర్లు విద్యుత్ ప్రసారం చేయడంలో సహాయపడతాయి. ఇవి మానవ న్యూరాన్‌ల మాదిరిగానే 0.1 వోల్ట్ సామర్థ్యంతో పనిచేస్తాయి. నిజానికి ఇదే మెదడు లోని అసలైన సిగ్నల్ ఉద్దీపన శక్తి. ఇవి జీవన న్యూరాన్‌లతో సురక్షితంగా కమ్యూనికేట్ చేస్తాయి కాబట్టి, వాటితో కృత్రిమ భాగాలను మరింత సమగ్రంగా, సమర్థవంతంగా కలవచ్చు. ఈ కృత్రిమ న్యూరాన్లను ఉపయోగించి నరాల పని తీరును మెరుగుపరచవచ్చు. స్పర్శను పునరుద్ధరించవచ్చు. తక్కువ శక్తితో, న్యూరాన్ తరహా అభ్యాసం, సమాచార లక్షణాలను పెంపొందించే అవకాశం ఉంటుంది. నివర్స్, హార్ట్ సెల్స్ లాంటి జీవకణాల సహజ స్పందన శైలికి ఈ న్యూరాన్‌లు చాలా దగ్గరగా ఉంటాయి. ప్రకృతిలో సుస్థిర నానోవైర్ల ఆవిర్భావం, మనిషి దేహానికి సరైన చేయూత ఈ ల్యాబ్‌లో తయారైన న్యూరాన్లు ఇవ్వగలుగుతాయి. క్లినికల్ ట్రయల్స్ జరిగి, ఈ కృత్రిమ న్యూరాన్లు అందుబాటులోకి వస్తే, ఎన్నో రకాల రుగ్మతలకు చికిత్స సాధ్యమవుతుంది.

## మార్స్.. ఒకప్పటి వాయుగోళం!



మార్స్ (కుజుడు లేదా అంగారకుడు) గ్రహం ఒకప్పుడు భూమి కంటే దట్టమైన వాతావరణంతో, పెద్ద వాయుగోళంగా ఉండేదని శాస్త్రవేత్తలు నిర్ధారిస్తున్నారు. ఈ తాజా పరిశోధనా వ్యాసం, ప్రస్తుతం కుజ గ్రహంపై అందుబాటులో ఉన్న లేదా శాస్త్రవేత్తలు ఊహించుకున్న వివరాలకు పూర్తి భిన్నంగా ఉంది. మార్స్‌పై నాలుగు వందల కోట్ల సంవత్సరాల నాటి, ఖగోళ శిలలు, ఉపగ్రహాల స్కాన్లు, భూగర్భ ఖనిజ వివరాలు విశ్లేషించారు. అప్పట్లో ఈ గ్రహం ఒక దట్టమైన వాతావరణంతో కూడిన వాయుమండలంగా ఉండేదని, ఆక్సిజన్ అధిక పీడనంతో ఉండేదని గుర్తించారు. దీనిని బట్టి, మార్స్‌పై మేఘాలు, నదులు, సరస్సులతో కూడిన చక్కటి వాతావరణం ఉండేదని అనుకోవచ్చు. అప్పట్లో మార్స్‌పై ఉన్న వాతావరణ ఒత్తిడి, తీక్షణతలు ప్రస్తుతం భూమి కంటే ఎక్కువగా ఉండవచ్చు. ప్రాథమిక ఆధారాలను అనుసరించి, అప్పట్లో, మార్స్‌పై నదులు, సరస్సులు, చిన్న సముద్రాలు ఉండే అవకాశం ఉందని ఇప్పటికీ కనిపిస్తున్న శిలలు, ఎండిపోయిన నదులను పోలిన ఆధారాలను బట్టి శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అయితే, మార్స్‌పై వాతావరణం ఎలా అంతమైందనే ప్రశ్న తలెత్తుతుంది. శాస్త్రవేత్తల అంచనాలను అనుసరించి, ఈ గ్రహం గురుత్వాకర్షక కేంద్రాన్ని కోల్పోయిన తర్వాత, సూర్యుడి నుంచి అత్యంత ప్రమాదకర రేడియేషన్ కారణంగా తీవ్రంగా ప్రభావితమైంది. వాతావరణం లుప్తమైంది. ప్రస్తుతం ఈ గ్రహంపై అత్యంత పలుచటి వాతావరణ పొర ఉంది. ఇందులో అధిక శాతం కార్బన్ డైయాక్సైడ్ ఉన్నట్టు శాస్త్రవేత్తల అంచనా. ఏదిఏమైనా అప్పట్లో మార్స్‌పై జీవం ఏర్పడేందుకు భూమికంటే మెరుగైన పరిస్థితులు ఉండేవని ఊహిస్తున్నారు. కాగా, కొత్త పరిశోధన ఇచ్చిన ఊతంతో, మార్స్‌పై జరిగే తుదపరి ప్రయోగాలు అక్కడ జీవం ఉండేదని నిరూపించే కొత్త ఆధారాల సేకరణపై దృష్టి సారించే అవకాశాలు పెరిగాయి.

## వ్యవసాయ రంగంలో విస్తారంగా ఎఐ టూల్స్




భారత దేశంలో గూగుల్ ప్రయోగాత్మకంగా తయారు చేసిన కృత్రిమ మేధస్సు (ఎఐ) వ్యవసాయ పరికరాలు ఇప్పుడు విస్తారంగా విదేశాలకు చేరుతున్నాయి. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం, అగ్రికల్చరల్ ల్యాండ్‌స్కేప్ అండర్‌స్టాండింగ్ (ఎఎల్‌యు), అగ్రికల్చరల్ మానిటరింగ్ అండ్ ఈవెంట్ డిటెక్షన్ (ఎఎంఇడి) అనే రెండు ఎఐ టూల్స్‌ను ఇప్పుడు మలేషియా, వియత్నాం, ఇండోనేషియా, జపాన్ దేశాల్లో కూడా పరీక్షిస్తున్నారు. ఈ టూల్స్ మొదట భారత్‌లోనే అభివృద్ధి చేశారు. ఇప్పుడు అవి ఇతర దేశాలకు విస్తరించడం గూగుల్ వ్యవసాయ రంగాన్ని మరింత టెక్నాలజీ ఆధారంగా, స్థిరంగా మార్చాలనే ప్రయత్నంలో భాగం. భారత్‌లో ఈ మోడళ్లను ఉపయోగించిన తర్వాత కంపెనీ గమనించింది టెక్నాలజీ ద్వారా రైతులు వేగంగా, ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోగలుగుతున్నారు. భారత్‌లో సవాళ్లకు పరిష్కారం కనుక్కోగలిగితే, ప్రపంచంలోని అనేక దేశాలకు కూడా అది ఉపయోగపడుతుదని గూగుల్ భావిస్తున్నది. ఆసియాపసిఫిక్ ప్రాంతంలోని దేశాలకు భారత వాతావరణం, వ్యవసాయ పరిస్థితులు దాదాపు సమానంగా ఉండటంతో, ఈ టూల్స్ అక్కడ కూడా బాగా పని చేస్తాయని గూగుల్ నమ్ముతోంది. ఈ రెండు సాంకేతికతలు పంటల పెరుగుదల దశలను, వర్షం లేదా వరద సూచనలను, వాతావరణ వివరాలను అందిస్తుంది. పంట వేయడం నుంచి కాపు కోతల వరకూ ప్రతి దశలోనూ రైతులకు అవసరమైన సూచనలు అందిస్తుంది. ఈ డేటా ప్రతి 15 రోజులకు ఒకసారి అప్డేట్ అవుతుంది. అంటే, రైతులు, అధికారులు వ్యవసాయ పరిస్థితులపై సత్వర సమాచారాన్ని పొందగలరు. ఈ విధంగా వారు పంటల ఆరోగ్యం, నీటి వినియోగం, వాతావరణ పరిస్థితులను బట్టి సరైన నిర్ణయాలు తీసుకోవచ్చు. అందుకే ఈ వ్యవస్థ భారత్‌లో విజయంతమైంది. గూగుల్ దీనిని విదేశాలకు విస్తరిస్తున్నది.

---

## బిఎస్‌సి నర్సింగ్‌లో విద్యార్థులకు సెకండ్ ఫేస్ అవకాశం కల్పించాలి

### కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విసికి ఎఐఎస్ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/వరంగల్ :** బిఎస్‌సి నర్సింగ్‌లో విద్యార్థులకు సెకండ్ ఫేస్ అవకాశం కల్పించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, అధ్యక్షుడు పార్థు కోరారు. శుక్రవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విసి డాక్టర్ నందకుమార్‌రెడ్డిని కలిసి బిఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు సెకండ్ ఫేస్ ఆప్షన్ కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులు పెద్ద ఎత్తున దరఖాస్తు కౌన్సెలింగ్ అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, అందుకు వారికోసం తక్షణమే రెండో ఫేస్ ఆప్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు శ్రేయాస్, భరత్, ప్రశాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కుర్తికి సైనిక్ పాఠశాల తరలించాలి

### కబ్జాకు గురైన భూమిని రికవరీ చేయాలి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ డిమాండ్



**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** ఎల్కుర్తికి సైనిక పాఠశాల తరలించాలని, కబ్జాకు గురైన జూనియర్ కళాశాల భూమిని రికవరీ చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శుక్రవారం ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సిపతి వినయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంతోష్ మాట్లాడారు. ఎల్కుర్తి గ్రామంలో సైనిక్ పాఠశాల నిర్మాణం కోసం భూమిని కేటాయించడమే కాక అనుమతి కూడా వచ్చినా, గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆ పాఠశాలను హైదరాబాద్ కంటోన్మెంట్ ప్రాంతానికి తరలించిందని ఆయన మండి పడ్డారు. ఈ అన్యాయాన్ని సరిదిద్దేందుకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి చర్యలు తీసుకుని పాఠశాలను తిరిగి ఎల్కుర్తికి తీసుకురావాలని కోరారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు పెద్ద పట్టణాలకు వెళ్లి చదువుకోవడం కష్టమైపోతున్న నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అత్యవసరమన్నారు. ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మొత్తం ఐదున్నర ఎకరాల భూమి ఉండగా, అందులో ఎకరన్నార భూమి కబ్జాకు గురైందని, వెంటనే ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రహరి నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బొడ్డు హేమంత్, ఉపాధ్యక్షులు సాహిల్, రితీష్, సహాయక కార్యదర్శి సాయి ఈశ్వర్ సాత్విక్, నాయకులు విశాల్, తరుణ్, రిత్విక్, విగ్నేష్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచేలా ప్రదర్శన, సభ



### 10 లక్షల మందికి శతాబ్ది ఉత్సవ సందేశం

### జనసేవాదళ్ శిక్షణ కార్యక్రమంలో బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా డిసెంబర్ 26న సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. వందేళ్ల పోరాట చరిత్రను, సాధించిన విజయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరానికి అనుగుణంగా భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. జన సేవాదళ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ ఆధ్వర్యంలో లకారం ట్యాంక్‌బండ్‌పై జరుగుతున్న శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ డిసెంబర్ 26న జరిగే ప్రదర్శనలో యువ కమ్యూనిస్టులు, జన సేవాదళ్ కార్యకర్తలు కదం తొక్కనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా 10వేల మందికి శిక్షణ ఇస్తున్నామని హేమంతరావు తెలిపారు. ఇప్పటికే శతాబ్ది ఉత్సవ ముగింపు సభ ప్రచారం సాగుతుందని ఈనెల 21న రాష్ట్ర స్థాయి జాతా, ఖమ్మంజిల్లాలో పర్యటించనుందని హేమంతరావు తెలిపారు. సూర్యాపేట జిల్లా నుంచి 21న నేలకొండపల్లిలోకి ప్రవేశిస్తుందని నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం, కొణిజర్ల, వైరా, తల్లాడ, ఏన్కూరు మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. జనజాగృతిలో భాగంగా ఖమ్మంజిల్లాలోనూ కమ్యూనిస్టు పార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మూడు జాతాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వందేళ్లలో కమ్యూనిస్టు పార్టీ సాధించిన విజయాలను నేటి తరానికి తెలియజేయడంతో పాటు పెరుగుతున్న కమ్యూనిస్టుల అవసరాలకు అనుగుణంగా యువతరాన్ని కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షించేందుకు 10 లక్షల మందికి మహాసభ సందేశాన్ని అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ డిసెంబర్ మొదటి వారం నుంచి ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక కళారూపాలను రూపొందిస్తున్నామని, సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించడంతో పాటు వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రపై కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంలో అమరులైన వారితో పాటు సాయుధ తెలంగాణ పోరాట కాలంలో అశువులు బాసిన అమరుల చరిత్ర ప్రతిబింభించేలా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బాగం తెలిపారు. శిక్షణ శిబిరానికి శిక్షకులుగా రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్ వ్యవహరించగా ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, నాయకులు మామిళ్ల శ్రీనాథ్, మద్దోజు శ్రవణ్, చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

### పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ప్రచార జాతను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవని శంకర్ అన్నారు. శుక్రవారం సిపిఐ శతాబ్ది ఉత్సవాల కరపత్రాలను స్థానిక పెద్దపెల్లి సిపిఐ కార్యాలయంలో పార్టీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందంతో కలిసి ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాదిమంది ప్రజలతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్న క్రమంలో రాష్ట్ర నలుమూలల నుండి సిపిఐ శతాబ్ది ఉత్సవాల ప్రచార జాతాలను ప్రారంభించుకోవడం జరుగుతుందనీ, అందులో భాగంగా ఆదిలాబాద్ జోడేఘాట్ నుండి శనివారం నవంబర్ 15న ప్రచార జాత ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి సిపిఐ మాజీ ఎమ్మెల్యే, జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేనా శంకర్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. 15న జోడేఘాట్ నుండి ప్రారంభమయ్యే ప్రచార జాతా 16న గోదావరిఖనిలో భారీ బైక్ ర్యాలీతో ప్రారంభమై ఖని చౌరస్తాలో బహిరంగ సభ ఏర్పాటు జరుగుతుందని, అనంతరం ప్రచార జాతా పెద్దపల్లి చేరుకొని పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాబోయే తరానికి కమ్యూనిస్టు పార్టీ చరిత్రను స్ఫూర్తిగా మార్చే బాధ్యత మనపై ఉందని వారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి సునీల్, మండల కార్యదర్శి పూసాల రమేష్, పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్ కుమార్, ఆరేపల్లి మానస్ కుమార్, మాచర్ల అంజి, ఎల్లయ్య, వంశీ, కల్లేపల్లి రవి, తగరం నరేష్, సది, అల్వాల రాజేందర్, దొమ్మటి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించండి

### ఎఐటియుసి డిమాండ్





**ప్రజాపక్షం/వరంగల్ :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్‌ఖన్నా డిమాండ్ చేశారు. ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు ఆధ్వర్యంలో వరంగల్ డిఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా శుక్రవారం నిర్వహించారు . అనంతరం వరంగల్ డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్.బిసాంబశివరావుకు సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, పెండింగులో ఉన్న 2నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో ఈనెల 17 హైదరాబాద్ మహాధర్నా చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 7 నెలల ఏరియర్స్ బకాయిలు వెంటనే ఇవ్వాలని, ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు 1న వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి వరంగల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యాకూబ్ పాషా, వివిధ శాఖల ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు సునీత, జన్ను కొర్నేల్, ఆచంట అభిషేక్, స్వప్న, భాగ్యలక్ష్మి , రజియా, లావణ్య, ప్రవీణ్, ఎఎన్ఎంలు శారద, విజయలక్ష్మి , ఫెనీన, జయమణి, భాగ్యలక్ష్మి , ఉప్పలమ్మ, ఫార్మసిస్టు జోష్ణ, సతీష్, ప్రేమలత శ్రీనివాస్, స్వర్ణలత, ఎంఎన్‌ఒ విజయ నాయక్, సపోర్టింగ్ స్టాఫ్ జాన్సన్, గౌస్ పాషా, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ టౌన్ :** నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి సెప్టెంబర్, అక్టోబర్ నెలల వేతనాలు, ఏడాది ఏరియర్స్‌ను తక్షణమే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసిఫాబాద్ కలెక్టరేట్ నందు ఎఒ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతినెల 1న వేతనాలు చెల్లించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ, వేతనాల్లో జాప్యంతో నిరాశలో ఉన్నారన్నారు. కార్మికుల వేతనాల సమస్యను పరిష్కరించకపోతే ఈనెల 17 హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షులు చిరంజీవి, కోశాధికారి నగేష్, సహాయ కార్యదర్శి రాందాస్, సిబ్బంది దేవి, ప్రకాష్, శ్రీకాంత్, విజయసాగర్, భవాని, సమత తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ సత్యశారద



**ప్రజా పక్షం/నెక్కొండ:** మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద శుక్రవారం ఆకస్మికంగా రోడ్డు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ రాంరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాగరాజును అభినందించిన సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా 99వ డివిజన్ వెంగళరావు నగర్ పరిధిలోని జవహర్ నగర్ బస్తీ 210, 211, 212, 213, 214, 215, 216 బూత్‌లలో గతం కంటే ఎక్కువ మెజారిటీ సాధించడంలో కీలక పాత్ర పోషించిన సందర్భంగా, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే నాగరాజును అభినందించారు.అనంతరం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఘన విజయం సాధించిన సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేస్తూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకాటి, వివేక్ సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 'వాస్వీక్' సేవలు అభినందనీయం

సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జె.డి లక్ష్మీ నారాయణ



**ప్రజాపక్షం/జనగామ :** వాస్వీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మీ నారాయణ అన్నారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నతులుగా ఎదగాలని, తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి చేరాలన్నారు. వాస్వీక్ ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం శుక్రవారం జనగామలోని బ్రమరాంబ పంక్షన్ హాల్ లో ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మీ నారాయణ, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జెడి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ జనగామ జిల్లాలోనే కాకుండా రాష్ట్రం వ్యాప్తంగా వాస్వీక్ ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వయించిందన్నారు. కరోనా సందర్భం గా ఎవరు బయటకు రావాలంటే భయపడుతున్న క్రమంలో అనేక మందికి వాస్వీక్ ఫౌండేషన్ నిత్యావసర సరుకులతో పాటు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ రి జ్వాన్ బాష షేక్ సారధ్యంలో జనగామ జిల్లాలో రాష్ట్రంలోనే ముందు వరుస లో ఉంటుందని, నీటిని వడిసిపట్టే జిల్లాగా త్వరలోనే కేంద్రం ద్వారా అవార్డు అందుకోనున్నారన్నారు. విద్య లోనూ నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ చేయించి దేశంలోనే 36వ జిల్లాగా, తెలుగు రాష్ట్రాల్లో మొదటి జిల్లా గా జనగామ ఒక్కటే నిలిచిందన్నారు. జనగామ మరింతగా ముందుకు సాగుతూ మొదటి స్థానంలోని వెళ్లాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదవితేనే ఉన్నత శిఖరాలకు చేరుకో గలరని అందుకు మూడు లక్ష్యాలను పెట్టుకోవాలన్నారు. ఒకటి త మ తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి చేరాలని, రెం డు తాము చదువుకున్న పాఠశాల, కళాశాలకు ముఖ్యఅతధిగా వెళ్లెలా మూడోది మీ అటో గ్రాప్ తీసుకునేంత స్థాయికి చేరాలన్నారు. ఇప్పుడు ప డుతున్న కష్టం భవిష్యత్తుల్లో ఎంతగానో ఉపయో గ పడుతుంది, మనం ఎలా బతికామన్నది కాదని మనం ఎందరికి ఉపయోగ పడుతున్నామనేది ముఖ్యమన్నారు. తన కుమారుడు చిన్న వయస్సుల్లోనే చనిపోవడంతో ఆయన పేర వాస్వీక్ ఫౌండేషన్ ప్రారంభించిన నరేష్‌కుమార్ ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు నిర్వయించి అనేక మంది కి మార్గనిర్దేశకుడుగా ఉన్నాడన్నారు. త్వరలోనే సూర్యరష్మిని పొందు పే చేసే పరికరానాల్లో ప్రజల్లోకి తీ సుకురానున్నారన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బా ష షేక్ మాట్లాడుతూ వాస్వీక్ ఫౌండేషన్ జనగామ జిల్లాలోనే కా కుం డా ఇతర ప్రాంతాల్లోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వయించడం అభినందనీయమన్నారు. మరింతగా సే వా కార్యక్రమాలు విస్తరింపజేయాలన్నారు. డిసిపి రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా గత ఐదేళ్ల నుండి వాస్వీక్ ఫౌండేష న్ ఆధ్వర్యంలో బారికేట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు ప డకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వయిస్తున్నారన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ మాట్లాడుతూ వాస్వీక్ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. వైస్ ఛైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వయించడం జరిగిందన్నారు. పర్యావరణాన్ని కాపాడడం కోసం మొక్కలు పెంచడం, పారిశుధ్య సమస్య పరిష్కారం, పేదలకు పుస్తె మట్టెల పంపిణీ ఇలా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని వివరించారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వయించగా విజేదలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు శంకర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, రాంరెడ్డి, నరసింహరెడ్డి, రమేష్‌రెడ్డి, నెల్లుట్ల రవీందర్‌రావు, చిట్ల ఉపేందర్‌రెడ్డి, సంపత్, శ్రీనివాస్, రవికుమార్, ప్రతీఖ్, వేలాద్రి, భూపాల్‌రెడ్డి, మహేందర్, ప్రశాంత్‌రెడ్డి, మల్లిక్‌తేజ, పాటమ్మ రాంబాబు, శ్రీశైలం, పిఈడి కిషన్, చందు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలకు ఇండ్లు



**ప్రజాపక్షం/ఖానాపూర్:** నిరుపేదలకు ఇండ్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట మార్కెట్ వైస్ చైర్మన్, ఖానాపురం మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాలు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్ల జగన్మోహన్‌రెడ్డిలు అన్నారు. నర్సంపేట ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం మండలంలోని మంగళవారిపేట గ్రామ పంచాయతీకి చెందిన ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుడు సీనియర్ నాయకుడు పెనుక మనోజ్ ఇల్లు భూమి పూజ కార్యక్రమంలో వారు పాల్గొని శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్‌కే ముస్తఫా, ఖానాపురం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమనేని సాగర్‌రావు, ఖానాపురం మండల పార్టీ ఉపాధ్యక్షులు మూడు పుల్ సింగ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నవీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ సభ్యులు మల్లేష్, నాగరాజు, కుమార్, పాల్గొన్నారు.

## పంచవర్ష ప్రణాళికల ద్వారా నవ భారతానికి నెహ్రూ పునాదులు


టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** పంచవర్ష ప్రణాళికల ద్వారా నవ భారతానికి నెహ్రూ పునాదులు వేశారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఈ.వి శ్రీనివాస్ రావు అన్నారు. హన్మకొండ వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం శుక్రవారం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత దేశ మొట్ట మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు పూల మాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఈ.వి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ భారత దేశంలో నవ భారతానికి పునాదులు వేసి ఈనాడు ప్రపంచ దేశాల్లో గొప్ప ప్రజాస్వామిక దేశంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలబడిందంటే అది నెహ్రూ వల్లనే సాధ్యం అయింది. నెహ్రూ ముందు చూపుతో ప్రజలందరికి వైజ్ఞానిక దృక్పతంతో ఏర్పాటు చేయడం వల్లనే భారత దేశం ఈ స్థాయికి రావడం జరిగిందన్నారు.కార్పోరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వేంకటేశ్వర్లు, హన్మకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు బంక సరళ, ఎస్.సి డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మార్క విజయ్ కుమార్ గౌడ్, బంక సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటరాజ బాబు అధ్య క్షతన నిర్వహించిన 58వ గ్రంథాల యాల వారోత్స వాల వేడుకలకు ముఖ్య అతిథిగా సత్తన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రంథాలయాలు జ్ఞానబండా గారాలు అని, విద్య ప్రగతికి దోహదం చేస్తుందని, ప్రతీ ఒక్కరు విద్యను అభ్యసించాలని సూచించారు. అదేవిధంగా జీవిత పాఠాలు కూడా నేర్పిస్తుందని అన్నారు. నేడు సెల్ ఫోన్‌లు వచ్చిన తర్వాత ప్రతీ విషయాన్ని గూగుల్‌లో సెర్చ్ చేసి చూస్తు న్నారని అన్నారు. అయితే వీటి వలన అనారోగ్యాలతో పాటు అవసరం లేని వాటిని గ్రహించి జీవితం అదుపు తప్పిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. సెల్‌ఫోన్ అవసరమే కానీ అతిగా వాడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ కోటా రాజబాబు, అడిషనల్ కలెక్టర్, విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గూటోజు కిష్టయ్య, మార్కెట్ సెక్రెటరీ టి.శ్రీలత, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, పిప్పాల రాజేందర్, దాట్ల శ్రీనివాస్, ముద్దమల్ల భార్గవ్, అజ్మీర జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ : కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ:** నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ అని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు, 14 నవంబర్ బాలల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ , యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్, మరియు ఎఫ్ఎంఎంఎస్ఎస్ఎస్, డాన్ బాస్కో నవజీవన్ సమన్వయంతో కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ బాల్యం అందమైనదని ఆ అనుభూతిని ప్రతి బాలుడికి బాలికకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికిపై ఉన్నదని, బాల్యదశ నుండే సత్ ప్రవర్తన, మానవతా విలువలు పెంపొందించి సన్మార్గంలో నడిపిస్తే బాలల దేశ భవిష్యత్ కు పునాది పడుతుందని అన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్ సందసాని రాజేంద్ర ప్రసాద్, మాజీ ఛైర్పర్సన్ అనితా రెడ్డి, సిడిపివో ఎం విశ్వజ, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సీహెచ్ అవంతి, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు అధికారి డాక్టర్ టి మదన్ మోహన్ రావు, డాక్టర్ ఇక్తెదార్ అహ్మద్, డెమో అశోక్ రెడ్డి,జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్ భాస్కర్, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్ ప్రోగ్రాం మేనేజర్ బత్తుల కరుణ, డాన్ బాస్కో నవజీవన్ అసిస్టెంట్ డైరెక్టర్ పి సంతోష్ కుమార్,జిల్లా బాలల పరిరక్షణ విభాగం మౌనిక, శ్రీనివాసులు, సునిత, చైతన్య, సుజాత, విజయ్ కుమార్,సీత, శివ ప్రసాద్,చైల్డ్ లైన్ రజిత, హరీష్, రమేష్, సఖి వన్ స్టాప్ సెంటర్, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, మహిళా సాధికారత కేంద్రం అధికారులు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంగన్‌వాడీ టీచర్లుతదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** దేశ తొలి ప్రధానమంత్రి, భారతరత్న పండిత జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య న్యూఢిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆ మహానీయ నాయకుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, నెహ్రూ స్ఫూర్తిదాయక సేవలను స్మరించుకున్నారు. ఆయన పథం దేశనిర్మాణానికి మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. నెహ్రూ జయంతి అదే సమయంలో దేశవ్యాప్తంగా బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నందున చిన్నారులందరికీ డాక్టర్ కావ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారత భవిష్యత్తు అయిన పిల్లలు విజ్ఞానంలో, సృజనాత్మకతలో ముందుకు సాగాలని, వారి కలలు నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.

## ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్‌లో ఏర్పాటుచేసిన సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 198 మందికి సీఎం సహాయ నిధి లబ్దిదారులకు రూ.1కోటి 5 లక్షల 37వేల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. అంతకు ముందు మాజీ ప్రధాని, భారత రత్న పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కడియం మాట్లాడుతూ జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలలో ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో ఎన్నో రకాల దుష్ప్రచారాలు చేసినా కాంగ్రెస్ పార్టి విజయాన్ని అడ్డుకోలేకపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జూబ్లిహిల్స్ తీర్పును స్ఫూర్తిగా తీసుకుని మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటి చైర్మన్ శ్రీధర్‌రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం ముఖ్యమంత్రి సహాయనిధి

బాధిత కుటుంబానికి రూ.2,50,000 ఎల్ఓసి కాపీని అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నందు శుక్రవారం హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పరిధిలోని నందనం గ్రామానికి చెందిన గజ్జెల్లి నిరోషా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న క్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసి నుంచి రూ.2,50,000 (2లక్షల 50 వేల రూపాయలు) ఎల్ఓసి కాపీనీ వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కెఆర్ నాగరాజు ప్రత్యేక చొరతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి లో చికిత్స కోసం గజ్జెల్లి నిరోషా కుటుంబ సభ్యులకు ఎల్వోసి కాపీనీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు వైద్య విషయంలో అన్ని విధాలుగా అండగా ఉంటుందని, స్థానిక శాసన సభ్యుడిగా తన దృష్టికి వచ్చిన అనారోగ్య సమస్యల పట్ల తన వంతు సహాయ సహకారం అందించే కృషి చేస్తానని తెలిపారు.తన వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలందరికి విజ్ఞప్తి లక్షల రూపాయలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఆసుపత్రిల దోపిడికి గురై అప్పుల పాలు కావద్దు విజ్ఞప్తి చేస్తూ ప్రభుత్వ నిమ్స్ హాస్పిటల్ వెళ్లి నేను ఇచ్చే ఎల్వోసీ ద్వారా ఉచిత చికిత్స పొందాలనీ ఈ సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్యే నాగరాజు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్బంగా గజ్జెల్లి నిరోషా ,కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే నాగరాజుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసి, తమ కృతజ్ఞత భావాన్ని చాటుకున్నారు.

# ఎస్‌డిఆర్‌ఎఫ్ సేవలు భేష్

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళికబద్ధంగా ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అభివృద్ధి విషయంలో అన్ని శాఖలతో పాటు పోలీసుల సహకారం అందడం గొప్ప విషయమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం గోవిందరావుపేట మండలం చల్వాయిలోని తెలంగాణ స్పెసల్ పోలీస్ ఐదవ బెటాలియన్‌లో నూతన జిమ్, ఓపెన్ ఏరియా జిమ్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రా రంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ములుగు జిల్లా లాంటి ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయడం సాహసం చేయడం లాంటిదేనని, ఏ పనిచేసిన ప్రజల మన్ననలు పొందడానికి కృషి చేయాలని అన్నారు. విపత్కర పరిస్థితులలో ఎస్‌డిఆర్‌ఎఫ్ చేసిన సే వలు ప్రశంసనీయమని, ములుగు జిల్లాలోని కాకుండా వరంగల్ జిల్లాలో సైతం వారి సేవలను అందించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని కాపాడే విషయంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సాహసం చేయడం గొప్ప విషయమని అన్నారు. కష్టంతోనే ఫలితం దక్కుతుందని, ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. బెటాలియన్లు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటుకు అనుకూలం కృషి చేస్తానని ఇస్తూ నూతన రోడ్డు ఏర్పాటు కోసం అంచనాలు తయారు చేసి సమర్పించాలని తెలిపారు. ములుగు జిల్లాలో పోలీస్ శాఖ చే స్తున్న సేవలు గొప్పవని రానున్న రోజులలో వారి సేవలు ఇలాగే కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో కలెక్టర్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి సీతారాం, అసిస్టెంట్ కమాండెంట్ అనిల్ కుమార్, గోపాల్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

కాటన్ మిల్లుల సందర్శనలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/చిట్యాల:** కాటన్ బిల్లు యజమానులు, సిసిఐ అధికారులు పత్తి కొనుగోలు లో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. చిట్యాల మండల కేంద్రం లోని కాటన్ మిల్లులు బాలమురుగన్, ఆంజనేయ కాటన్ మిల్లులను శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ లు ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేసి రైతుల వద్ద నుండి కాటన్ కొనుగోలు లో ఉండే ప్రతి అంశాన్ని పరిశీలించి మిల్లర్లను, సిసిఐ అధికారులతో మాట్లాడి, రైతులకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కాటన్ మిల్లులో ప్రారంభించిన సిసిఐ కొనుగోలు కేంద్రాలో సిసిఐ అధికారులు రైతులు తెచ్చిన పత్తిని కొనుగోళ్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా సమన్వయంతో పత్తిలో నాణ్యత పాటించాలని తెలిపారు. స్థానిక తహసిల్దార్ ఇమామ్ బాబా షేక్, బాలమురుగన్ కాటన్ మిల్ యజమాని తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు లేకుండా పత్తి కొనుగోళ్లు

బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి




**ప్రజాపక్షం/ నర్సంపేట :** కపాస్ కిసాన్ యాపను రద్దుచేసి ఎలాంటి నిబంధనలు లేకుండా సిసిఐ పత్తిని కొనుగోలు చేయాలని, ప్రకృతి వైపరీత్యాల వలన తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి తేమ పేరుతో ఆంక్షలు విధించకూడదని బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధానకార్యదర్శి కుమారస్వామి అన్నారు. నల్లబెల్లి గ్రామపంచాయతీ ఆవరణలో మామిళ్ల మోహన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో కుమారస్వామి మాట్లాడుతూ 1970లో ఏర్పాటు చేసిన సిసిఐ రైతు పండించిన పత్తిని కొనుగోలు చేస్తూ వస్తున్నదన్నారు. మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చి రైతాంగం చేసిన తీవ్రమైన ప్రతిఘటన వెనకడుగు వేసి నల్ల చట్టాలను రద్దు చేసినట్టు ప్రకటించి నప్పటికీ రైతాంగం మీద కుట్రలు చేస్తూనే ఉన్నదన్నారు. ఓపెన్ మార్కెట్లో పత్తినీ అమ్ముకోకుండా కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రైతాంగం స్లాట్ బుక్ చేసుకొని, ఆ స్లాట్ లో చూపించిన తేదీ సమయం ప్రకారం ఎకరానికి ఏడు క్వింటాళ్ల వరకు మాత్రమే అమ్ముకునే నిబంధనలు విధించడం ఎనిమిది శాతం కన్నా సేవ ఎక్కువగా ఉంటే ధరలో తేడాలు ఉంటాయని పేర్కొనడం రైతులకు అన్యాయం చేయడమే అన్నారు. ఈకార్యక్రమంలో మామిళ్ల మోహన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి జన్ను జయరాజు, సిపిఎం పార్టీ మండల నాయకులు బొడిగె సమ్మయ్య , గోనె సంజీవయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల గృహ కలకు కొత్త వెలుగు

ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం బొల్లికొండ గ్రామంలో లబ్దిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం అంటే పేదల జీవితాల్లో వెలుగు, స్వంత ఇంటి కలను నిజం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న అంకిత భావం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బక్కి అశోక్, డిసిసి ప్రధాన కార్యదర్శులు పెండ్యాల హరిప్రసాద్, కుసుమ చెన్న కేశవులు, కోశాధికారి కేవి సుబ్బారెడ్డి, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ, నాయకులు గరిక పాటి హన్మంత్‌రావు, పోలిశెట్టి బాను, ఏజిపి బండి శివకుమార్, మార్కెట్ డైరెక్టర్లు, మైనార్టీ నాయకులుదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## బ్యాంక్ అభివృద్ధికి కృషి
### డిసిసిబి చైర్మన్ దొండపాటి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా కేంద్ర సహకార అభివృద్ధికి కృషి చేస్తామని డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం డిసిసిబి ప్రధాన కార్యాలయం నందు 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. బ్యాంకు ఉద్యోగుల సహకారంతో బ్యాంకు బలోపేతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ సహకార శిక్షణా కేంద్రం వరంగల్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, బ్యాంకు సిఈవో వెంకట ఆదిత్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ
### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఖమ్మం నగర పరిధిలో ఆర్అండ్‌బి, మున్సిపల్ రోడ్ల నిర్వహణ, మరమ్మతు పనులపై అధికారులతో సమీక్షించారు. ఖమ్మం నగరంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న 20 బ్లాక్ స్పాట్‌లు గుర్తించి అక్కడ స్పీడ్ కంట్రోల్‌కు రంబుల్ స్ట్రిప్స్, సైన్‌బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై లైన్ మార్కింగ్ ఉండేలా చూడాలన్నారు. నగరంలో ప్రధాన జంక్షన్ల వద్ద రోడ్డుపై గో స్లో వైట్ పెయింట్ వేయాలన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో దానవాయిగూడెంలో మరమ్మతు పనులకు సంబంధించి రూ.3.50 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని అట్టి నిధులతో టిజిఎస్‌డబ్ల్యూఆర్, పాఠశాల, కళాశాలకు కాంపౌండ్ వాల్, ల్యాండ్ ఫిల్లింగ్, జనరేటర్, క్రీడా వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.ఆర్అండ్‌బి ఎస్ఈ యాకూబ్, ఈఈ పవర్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, మున్సిపల్ డిఈ ధరణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మిక్కిలినేని నరేందర్‌కు మాతృవియోగం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ నాయకులు, 54వ డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల భర్త మిక్కిలినేని నరేందర్ మాతృమూర్తి మిక్కిలినేని ప్రమీలరాణి (71) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఖమ్మం వీడియోస్ కాలనీలోని వారి స్వగృహంలో ఉంచిన ఆమె భౌతికాయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిక్కిలినేని మంజుల, నరేందర్ లను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, మానుకొండ రాధాకిషోర్, పలువురు కార్పొరేటర్లు, వివిధ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్ర ప్రసాద్, ఏసిపి రమణమూర్తి, సిఐలు భానుప్రకాష్, కరుణాకర్, కూరపాటి ప్రదీప్‌కుమార్, మోపర్తి సుమంత్, గుమ్మడి రాఘవేంద్ర, ప్రముఖ వ్యాపారులు ధనాల ప్రసాద్, కురువెళ్ల ప్రవీణ్ తదితరులు నివాళులర్పించారు.

## చిత్తడి నేలల పరిరక్షణకు కృషి
### అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/చింతకాని:** చిత్తడి నేలలు గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. చింతకాని మండలం మత్కేపల్లి తుమ్మలమ్మ చెరువును వెట్ ల్యాండ్ కమిటీతో కలిసి అదనపు కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తడి నేలలు గుర్తించడం ద్వారా భూమి యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లో మారదని, రైతులు, భూయజమానులు ఎవరూ అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లుదని స్పష్టం చేశారు. చిత్తడి నేలల్లో పరిమితులు మాత్రమే అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ భూముల సంరక్షణ కోసం 2017లో ప్రభుత్వం కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టిందన్నారు.చింతకాని మండలాన్ని పైలెట్ క్రింద ఎంపిక చేసి ముందస్తుగా చిత్తడి నేలలు గుర్తించి అక్కడ పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలనిఅన్నారు. చిత్తడి నేలల్లో అనేక రకాల మొక్కలు, పక్షులు జంతువులు ఆవాసాలను ఏర్పరచుకుంటాయని అన్నారు. తడి భూములను రక్షించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అసందర్భంగా చెరువు మ్యాప్, సరిహద్దులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్ధ్ విక్రమ్ సింగ్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి వెంకట్రామ్, చింతకాని తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు సంబంధిత అధికారలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయం
### కె. రాంనారాయణ, ఐజెయులో చేరిన మాధవ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టియుడబ్ల్యూజె (ఐజెయు )పని చేస్తుందని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ తెలిపారు. అక్రిడెషన్లు, హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని ఆయన ఆరోపించారు. సీనియర్ జర్నలిస్టు వై. మాధవరావు శుక్రవారం తన అనుచరులతో కలిసి టియుడబ్ల్యూజె (ఐజెయు)లో చేరారు. ఆయనకు టియుడబ్ల్యూజె (ఐజెయు) బాధ్యులు సంఘ సభ్యత్వాన్ని అందించారు. పలువురు జర్నలిస్టులు అనారోగ్యంతో మృత్యువార్త పడ్డారని అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యం అందించేవిధంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులను జారీ చేయడంతో పాటు ప్రస్తుత గడువు ముగిసేలోగా అక్రిడేషన్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్, కార్యదర్శి జనార్ధన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం, సంఘ బాధ్యులు ఏలూరి వేణుగోపాల్, బాబురావు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

### సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టండి
### అభివృద్ధి పనుల శంకుస్థాపనలో
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈర్లపుడి ఎస్సి కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లుకు, పంగిడి ఎస్సి కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్డునిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. మంత్రి గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు, విద్యుత్ సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇండ్లపై వెళ్తున్న విద్యుత్ తీగల తరలింపుకు కార్యాచరణ చేయాలన్నారు. నియోజక వర్గ పరిధిలో ఇంకా ఎన్ని ఎక్స్టెన్షన్ స్తంభాలు అవసరం ఉన్నవి నివేదిక సమర్పించాలన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న రైతులకు ప్రభుత్వ ఫలాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, జిల్లా వ్యవసాయ అధికారి జి. పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకూబ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, డిఎల్‌పివో రాంబాబు, పంచాయతీరాజ్ ఈఈ మహేష్‌బాబు, ఎంపిడివో అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్వేత, నాయకులు దీపక్ నాయక్, దేవీలాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పామాయిల్ సాగుతో అధిక లాభాలు
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పత్తి, మొక్కజొన్న సాగుకు బదులు పామాయిల్ సాగుతో రైతులకు అధిక లాభాలు పొందవచ్చునని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించిన సందర్భంగా మార్గ మధ్యలో రజబ్‌అలీ నగర్ గ్రామంలో పొలాలను సందర్శించారు. బానోత్ వీరన్న విజయలకు చెందిన పొలాల వద్దకు వెళ్లి ఏ పంట వేస్తున్నది, గతంలో ఎంత దిగుబడి వచ్చింది అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పత్తి, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగు చేపట్టాలని రైతులకు మంత్రి సూచించారు. పామాయిల్ సాగులో తక్కువ పెట్టుబడితో పాటు దీర్ఘకాలిక లాభాలు ఉంటాయన్నారు. మొక్కలు, డ్రిప్ పరికరాలు, ఎరువులకు సంబంధించి సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుందన్నారు. అకాల వర్షాలు, చీడ పీడలు, కోతులు, అడవి పందులతో ఇబ్బందులు ఉండవన్నారు. మందుల ఖర్చు కూడా తక్కువేనని తెలిపారు. పామాయిల్ సాగుకు మంచి డిమాండ్ ఉందని పండిన పంటకు మార్కెటింగ్‌కు ఎటువంటి సమస్యలు లేవన్నారు. గ్రామాల్లోని నాయకులు, ఉద్యావన శాఖాధికారులు పామాయిల్ సాగును ప్రోత్సహించేలా తగు చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, ఆర్డివో జి. నర్సింహారావు, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
### వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రెవెన్యూ భూ సమస్యల పరిష్కారంలో నిర్ల క్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అ ధికారులను హెచ్చరించారు. రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, భూ భారతి దరఖాస్తులు, పెండింగ్ సాదాబైనామా, రెవెన్యూ సదస్సు దరఖాస్తులు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. గతంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించి సూచనలు చేసినప్పటికీ కొన్ని మండలాల్లో ఆశించిన పురోగతి లేదన్నారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం కోరకు అధికారులు సెలవుల్లో కూడా పూర్తి స్థాయిలో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన వెంటనే ప్రారంభించాలని, డెస్క్ పరిశీలన ద్వారా అనర్హుల దరఖాస్తులను తిరస్కరించి ఆర్డివోకు ఫార్వర్డ్ చేయాలన్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న దరఖాస్తులకు జిపివో, ఆర్ఐ, సర్వేయర్ల ద్వారా క్షేత్ర పరిశీలన చేయాలన్నారు. సాదాబైనామా దరఖాస్తుల్లో అమ్మకందారుల రికార్డు సరిగ్గా లేకపోతే తిరస్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు, నాలాలు, చెరువులు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధిలో పట్టాల కోసం సాదాబైనామా దరఖాస్తులు వస్తే నేరుగా తిరస్కరించవచ్చునన్నారు. ప్రతి భూ సమస్య దరఖాస్తుకు సంబంధించి తిరస్కరిస్తే కారణాలు తెలియజేస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.



## దేశాభివృద్ధికి బాటలు వేసిన మార్గదర్శి నెహ్రూ
### నెహ్రూకు నివాళులర్పించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేశాభివృద్ధికి బాటలు వేసిన మార్గదర్శి జవహర్‌లాల్ నెహ్రూ అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం కాల్వొడ్డులో గల నెహ్రూ విగ్రహానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నెహ్రూ చిత్ర పటానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ భారత తొలి ప్రధాని, దివంగత జవహర్‌లాల్ నెహ్రూ దేశాభివృద్ధికి బాటలు వేశారన్నారు. నెహ్రూ వారసులుగా ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశ ప్రగతిలో తమదైన ముద్ర వేశారన్నారు.

## భద్రాచలంలో జూబ్లీహిల్స్ విజయోత్సవం
### స్థానిక ఎన్నికల్లో సీన్ రిపీట్ , బుడగం శ్రీనివాస్

**ప్రజాపక్షం/భద్రాచలం :** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిచడంతో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం భద్రాచలంలో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై కేరింతలు కొట్టారు. ఇందులో భాగంగా టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సీన్ రిపీట్ అవుతుందని అన్నారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ ఎన్ని ఎత్తుగడలు వేసినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ ప్రజలు దీవించి బంపర్ మెజార్టీతో గెలిపించారని చెప్పారు.ఈ సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు సరెళ్ల నరేష్, సత్యలింగం, వెంకటేష్, కృష్ణారెడ్డి, జిందా, శ్రీనివాస్, రాజు, సుధాకర్, గౌతమ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు
### జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం స్థానిక గ్రంథాలయ ఆవరణలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చాచా నెహ్రు, గ్రంథాలయ పితమహుడు ఎస్ఆర్ రంగనాధన్‌ల చిత్రపటానికి చైర్మన్ వీరబాబుతో కలిసి పూల మాలలు వేశారు. గ్రంథాలయాలు తాము చదువుకునే రోజుల్లో ఎంతగానే ఉపయోగపడేవని, ఇలాంటి మౌళిక సదుపాయులు అప్పట్లో లేవన్నారు. గ్రంథాలయాల్లో లభ్యమయ్యే పుస్తకాలతో విద్యార్థినీ విద్యార్థులు జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, ఇంటర్‌నెట్‌లు, వైఫైల కంటే పుస్తక జ్ఞానం చాలా ముఖ్యమని చెప్పారు. పుస్తకాలు చదవడం నిత్య జీవితంలో ఎవరికైతే అలవాటు ఉంటుందో వారి జీవితంలో చక్కటి మార్పులు చోటు చేసుకుంటాయని చెప్పారు. గ్రంథాలయాలకు కావాల్సిన మౌళిక సదుపాయాల కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆఫీస్ ఇంచార్జ్ నవీన్, గ్రంధపాలకురాలు గుమ్మడి మణిమృధుల, శాఖ గ్రంధపాలకులు మధుబాబు, వాణి, రుక్మిణితో పాటు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నరు.



## శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు విరివిగా చందాలు
### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/చింతకాని:** డిసెంబర్ 26న ఖ మ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు చింతకాని మండల వ్యాప్తంగా విరివిగా చం దాలిచ్చి అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవం తం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జ మ్ముల జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల ప రిధిలోని కొదుమూరు గ్రామంలో శుక్రవారం ఇం టింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ భారత దేశ గడ్డపై సిపిఐకి వందేండ్లన్నారు. దీనికి గుర్తుగా శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. నాటి నుండి తాడిత , పీడిత ప్రజల కోసం ఎన్నో ప్రజాఉద్యమాలు నిర్వహించి పోరాటాలు చేసిన సిపిఐ కి చరిత్రలో తిరుగులేని స్థానం ఉందన్నారు. అనేక ప్రజా ఉద్యమాలను వందేండ్ల మహా ప్రస్థానంలో నిత్యం ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు.ఏ పార్టీకి లేని ఘన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. భూస్వాముల చెరనుండి లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని పేదల కు పంచి పెట్టిన ఘన చరితను లిఖించుకున్న సి పిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు చింతకాని మండలం నుంచి అన్ని వర్గాల ప్రజలు అదిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, శాఖ కార్యదర్శి నిరుడు గోవిందరావు, మాజీ సర్పంచ్ నక్కనబోయిన సుజాత కృష్ణ, మాజీ ఎంపీటీసీ నారపోగు హేమ నాగార్జున, పాల్గొన్నారు.



## ఎంఇఒపై ఉపాధ్యాయుని దాడి
### పోలీసులకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/ ఇల్లందు :** మండల విద్యాశాఖాధికారి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు దాడి చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సుభాష్ నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్ ఇల్లందు మండల విద్యాశాఖాధికారిగా కూడా వ్యవహరిస్తున్నారు. నువ్వు నాకు చెప్పేది ఏమిటంటూ అసభ్య పదజాలంతో ఉమాశంకర్‌ను దూషించడంతో పాటు కర్రతో దాడి చేశాడు. కిందపడిన వ్యక్తిపై మరోసారి దాడి చేసేందుకు ప్రయత్నించడంతో సిబ్బంది అడ్డుకున్నారు. ఉమా శంకర్‌ను వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రధానోపాధ్యాయునిపై ఉపాధ్యాయుడు దాడి చేసిన ఘటన సంచలనం సృష్టించింది. పోలీసులకు, జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా పాఠశాలల్లో బాలల దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మాజీ ప్రధాని, దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఖమ్మం నగరంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

**స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో :** బాలల దినోత్సవాన్ని ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఎంప్లాయీమెంట్ అధికారి కె. శ్రీరాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వయం పాలన దినోత్సవం, ఫుడ్ ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**త్రివేణి పాఠశాలలో :** జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివేణి పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఫ్యాన్సీ డ్రెస్, నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, యర్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, సిఆర్‌వో మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

**రెజొనెన్స్ శ్రీనగర్‌లో :** ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలతో పాటు పిక్నిక్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్తీక మాసం సందర్భంగా విద్యార్థులంతా వనంలోకి వెళ్లి సరదాగా ఆటపాటలతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**సర్వజ్ఞ పాఠశాలలో :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి నాగేంద్రకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






**ఎస్‌విఎం పాఠశాలలో :** ఖమ్మం నగరంలోని ఎస్‌విఎం సెంట్రల్ పబ్లిక్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డా॥ నవీనా మమార్, డైరెక్టర్ కిషోర్, అకాడమీక్ ఇంచార్జి ఉమశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు.

# రీల్

## 'జెట్లీ' పోస్టర్ విడుదల



టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. ఈ సినిమాకు సంబధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఇప్పటికే ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది. సత్య ఒక విమానం పైన కూర్చుని వుండగా 'ఐయామ్ డన్ విత్ కామెడీ ' అనే లైన్ అభిమానులను నవ్విస్తుంది. ఇది రితేష్ రానా మార్క్ ఇంటర్టైన్మెంట్ ని సూచిస్తోంది.క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్న జెట్లీని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. భారీ బ్యానర్లు చేతులు కలపడంతో ఇది స్కెలెవెల్ ఎంటర్టైనర్ రాబోతుందనే విషయం స్పష్టమవుతోంది.యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'జెట్లీ' లో థ్రిల్స్, ట్విస్టులు, హైవోల్టేజ్ హ్యూమర్ అన్నీ రితేష్ రాణా స్టైల్లో ప్యాక్ అయి రాబోతున్నాయి. మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా ఈ చిత్రంతో తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. సత్యతో ఆమె జంటగా కనిపించనుంది. వెన్నెల కిషోర్, అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం కాల భైరవ, సినిమాటోగ్రఫీ సురేష్ సరంగం, ఎడిటింగ్ కార్తిక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైన్ నార్ని శ్రీనివాస్ పని చేస్తున్నారు.



## 'అనంత' టీజర్ లాంచ్



జగపతి బాబు, సుహాసిని ప్రధాన పాత్రల్లో తమిళ దర్శకుడు సురేష్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన అనంత. ఈ సినిమా ఆడియో, టీజర్ లాంచ్ ఈవెంట్ చాలా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తమ్మా రెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ సురేష్ కృష్ణ గారు గొప్ప దర్శకులు. సినిమా అంటే ఎంతో ప్రేమ. ఆయన ఎప్పుడూ కూడా వర్క్ చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు అనంత సినిమాతో వస్తున్నారు. సాయి బాబా తనని నమ్మిన వారందరిని ప్రేమించాడు. నమ్మినా నమ్మకపోయినా ఆయన సేవలు అందించారు. విద్య వైద్యం నీరు ఆయన పరిధిలో చేయగలిగినంత చేశారు సురేష్ కృష్ణ ఎప్పుడు కూడా మంచి సినిమా తీస్తాడు. ఈ సినిమా కూడా అందరూ చూడాలని చూస్తారని కోరుకుంటున్నాను. దర్శకుడు సురేష్ కృష్ణ మాట్లాడుతూ ఇది సత్యసాయి బాబా గారి గురించి ఒక బయోపిక్ చేయాలనుకున్నప్పుడు అప్పుడు ఆయన ఆశ్రమంకి వెళ్ళాను. ఆయన నన్ను చూసి 'ఇంతకాలం ఎందుకు రాలేదు' అని అడిగారు. నేను ఆయన కాళ్ళకి నమస్కరించాను. అది నా మనసుని ఎంతో కదిలించింది. 2011లో ఆయన చనిపోయారు. తర్వాత నేను నా రొటీన్‌లో పడిపోయా. గత ఏడాది జూన్లో ఒక కల వచ్చింది. ఆయన కలలోకి వచ్చి విభూదిని ఇచ్చా. బాబా దగ్గరికి నన్ను మొదటిసారి తీసుకెళ్లిన వ్యక్తికి ఫోన్ చేసి చెప్పాను. అప్పుడు ఆయన మేము పుట్టపర్తిలో ఉన్నాం మీ గురించి మాట్లాడుకున్నామని చెప్పారు. గిరీష్ కృష్ణమూర్తి ఫోన్ చేసి బాబా గారి జీవితంపై సినిమా చేయాలని చెప్పారు. నేనే ఎందుకు ఈ సినిమా డైరెక్టర్ చేయాలని అడిగినప్పుడు.. బాబా కలలోకి వచ్చి మిమ్మల్ని డైరెక్ట్ చేయమని చెప్పారు అన్నారు. బాబా శత జయంతి సందర్భంగా ఈ సినిమా చేయాలని కోరారు. కానీ ఆ సినిమాలో బాబా లాగా ఎవరూ నటించకూడదన్నారు. అప్పుడు నా దగ్గర స్క్రిప్ట్ కూడా లేదు. అనుకోకుండా ఒక మంచి స్క్రిప్ట్ వచ్చింది. ఏదో భక్తి సినిమాలా కాదు. బాషా సినిమా లాంటి కమర్షియల్ స్క్రిప్ట్ వచ్చింది. జగపతిబాబుకి సినిమా గురించి చెప్పినప్పుడు ఆయనకు చాలా నచ్చింది. అద్భుతమైన పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఆయన డైలాగ్ డెలివరీ చూసినప్పుడు సూపర్ గా అనిపించింది. సుహాసిని చాలా ఇంపార్టెంట్ రోల్ చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత సాయి మాధవ్ బుర్ర, డైరెక్టర్ వీర శంకర్, రాకేందు మౌళి, గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి, శ్రీ రజిని, చోటా కె నాయుడు పాల్గొన్నారు.




## అఖండ తాండవం టైటిల్ పాట ఆవిష్కరణ

నందమూరి బాలకృష్ణ హీరోగా సంయుక్త హీరోయిన్‌గా బోయపాటి దర్శకత్వంలో తెరకెక్కిన అఖండ 2 తాండవం సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ సినిమాకు సంబధించిన టైటిల్ పాటను ఆవిష్కరించారు. 'ఖండ ఖండ ఖండిత దండ యోగ మండిత అఖండ తాండవం' అనే టైటిల్ పాటను విడుదల చేశారు. ఈ పాటను త్రిపురనేని కళ్యాణ్ చక్రవర్తి రాయగా, శంకర్ మహదేవన్, కైలాష్ ఖేర్ ఆలపించారు. ఈ పాటకు శంకర్ కొరియోగ్రఫీ చేశారు. గతంలో వచ్చిన సక్సెస్ ఫుల్ సినిమా అఖండ సినిమాకు సీక్వెల్ గా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శివ భక్తుల నేపథ్యలో సాగే ఈ సినిమాలో నందమూరి బాలకృష్ణ శివుడి భక్తుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. సినిమాకు సంబధించిన అన్ని పనులు పూర్తి చేసి డిసెంబర్ 5 తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతల్లో ఒకరైన రామ్ ఆచంట తెలిపారు. గ్రాఫిక్స్ వర్క్ ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు.

## 'కనకం' సాంగ్ రిలీజ్

మెట్రో శిరీష్, శ్రియ శరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నాన్‌వయోలెన్స్'. ఆనంద కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏకే పిక్చర్స్ నిర్మిస్తుంది.ఈ సినిమా నుంచి యువన్ శంకర్ రాజా కంపోజ్ చేసిన కనకం సాంగ్‌ని రిలీజ్ చేశారు. అదిరిపోయే ఫుట్ ట్యాపింగ్ నెంబర్‌గా ట్యూన్ చేసిన ఈ సాంగ్‌లో యువన్ శంకర్ రాజా, తేజస్విని నందిభట్ల వోకల్స్ కట్టిపడేశాయి. భాష్య శ్రీ అర్థవంతమైన సాహిత్యంతో అలరించారు. మెట్రో శిరీష్ , శ్రియ శరణ్ ఎనర్జిటిక్ మూవ్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో బాబీ సింహా, యోగి బాబు, అదితి బాలన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.యువన్ శంకర్ రాజా మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ ఎన్ఎస్ ఉదయ కుమార్, ఎడిటర్ కాంత్‌గా పని చేస్తున్నారు.

## ఇట్లు మీ ఎదవ 21న రిలీజ్

త్రినాధ్ కఠారి హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో సంజీవని ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాత బళ్లారి శంకర్ నిర్మిస్తున్న యూత్ఫుల్ ఎంటర్టైనర్ ఇట్లు మీ ఎదవ. సాహితీ అవాంచ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వెయ్యేళ్ళు ధర్మంగా వర్ధిల్లు అనేది ట్యాగ్ లైన్. నవంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది. నైజాంలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి విడుదల చేయనుండగా, ఆంధ్ర, సీడెడ్ లో ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ రిలీజ్ చేయనుంది. ఈ రెండు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో సినిమా విడుదల కానుంది. ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, గోప రాజు రమణ, దేవీ ప్రసాద్ కీలక పాత్రలు పోషించారు.



## హృదయాన్ని తాకే ప్రేమ కథ ఇది



అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు. హైదరాబాద్‌లో హీరో అడివి శేష్ అతిథిగా ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాటల రచయిత మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ.. 'రాజు వెడ్స్ రాంబాయి'లో రాంబాయి నీ మీద నాకు పాటను పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. సినిమాలో టైటిల్ సాంగ్‌గా ఈ పాట వస్తుంది. ఒక్క నైట్ లోనే ఈ పాట మొత్తం రాశాను. కథలోని లోతైన భావాలను ఈ పాటలో వ్యక్తీకరించే అవకాశం కలిగింది అన్నారు.



## చిన్న పిల్లలకు సందేశాన్నిచ్చే 'మాస్టర్ సంకల్ప్'

పలు ప్రతిష్టాత్మక అవార్డులు పొందిన చిల్డ్రన్ ఫిలింస్ రూపొందించి దర్శక నిర్మాతగా తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు డా.భీమగాని సుధాకర్ గౌడ్. ఆయన శ్రీ లక్ష్మి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్, సంతోష్ ఫిలింస్ బ్యానర్స్‌పై ఆదిత్య, క్రియేటివ్ జీనియస్, విక్కీస్ డ్రీమ్, డాక్టర్ గౌతమ్, అభినవ్ వంటి బాలల చిత్రాలను ప్రేక్షకులకు అందించారు. తమ ప్రొడక్షన్‌లో ఆరవ చిత్రంగా మాస్టర్ సంకల్ప్‌ను మన ముందుకు తీసుకొస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ నటులు శివాజీ రాజా మాస్టర్ సంకల్ప్ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత డా.భీమగాని సుధాకర్ గౌడ్, శ్రీ మిత్ర చౌదరి, పెంచల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ పిల్లలు బాగుంటేనే సమాజం బాగుంటుంది. బాలల కోసం నిస్వార్థంగా సినిమాలు రూపొందిస్తున్న డా.భీమగాని సుధాకర్ గౌడ్ అభినందనీయులు. వ్యాపారమయమైన ఇండస్ట్రీలో పిల్లల కోసం సినిమాలు చేస్తున్న ఆయన గొప్ప మనసును మనమంతా ప్రశంసించాలి.

## 'ప్రెట్టీ బేబీ' పాట విడుదల



చార్మింగ్ స్టార్ శర్వా తన అప్ కమింగ్ మూవీ 'బైకర్'లో మోటార్‌సైకిల్ రేసర్‌గా ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువి క్రియేషన్స్ ఈ సినిమాని నిర్మించింది. ఫస్ట్ లుక్, ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. 'ప్రెట్టీ బేబీ' వీడియో సాంగ్‌ని రిలీజ్ చేసిన మేకర్స్ బైకర్ మ్యూజిక్ ప్రమోషన్స్‌ని కిక్ స్టార్ట్ చేశారు. జిబ్రాన్ ఈ పాటని అదిరిపోయే బీట్స్‌తో డ్యాన్సింగ్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. జిబ్రాన్, యాజిన్ నిజార్, సుబ్లాషిని ఎనర్జిటిక్ వోకల్స్ తో ఆకట్టుకున్నారు. కృష్ణ కాంత్ లిరిక్స్ చాలా క్యాచిగా వున్నాయి. ఈ సాంగ్‌లో శర్వా, మాళవిక నాయర్ కెమిస్ట్రీ అదిరిపోయింది. శర్వా డ్యాన్స్ మూమెంట్స్ మెస్మరైజింగ్‌గా వున్నాయి. ఈ సాంగ్ ఇన్‌స్టంట్ చార్ట్ బస్టర్‌గా నిలిచింది. బైకర్ డిసెంబర్ 6న థియేటర్లలో రిలీజ్ కానుంది.

## కొత్త ఊపునిచ్చాయ్

(మొదటి పేజీ తరువాయి)

పోషిస్తోందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ స్థానిక నాయకత్వం అద్భుతంగా కష్టపడిందన్నారు. వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రాజకీయాలకు కొత్త అయినప్పటికీ అద్భుతంగా పనిచేశారన్నారు. ఆమెకు అభినందనలు చెప్పారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బిఆర్ఎస్ గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా తన పాత్రను అద్భుతంగా పోషించిందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టడంలో బలంగా బిఆర్ఎస్ పనిచేస్తుందని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిజాయతీగా కొట్లాడమన్నారు. ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసన్నారు. ప్రతి సర్వేలో బిఆర్ఎస్ గెలుస్తుందని ఎలా చెప్పిందని, ఆఖరి మూడు రోజుల్లో ఏం జరిగిందో ప్రజలు చూశారన్నారు. అయినప్పటికీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నయం బిఆర్ఎస్‌నే అని ప్రజలు స్పష్టం చేశారని తెలిపారు. 2014 నుంచి 2023 వరకు దాదాపు ఏడు ఉప ఎన్నికలు జరిగాయని, ఈ ఉప ఎన్నికల్లో అప్పటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికల్లో కూడా గెలవలేదన్నారు. దాదాపు ఐదింటిలో తాము గెలిచామని అన్నారు. జిహెచ్ఎంసి ఎన్నికలో కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకటి రెండు సీట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజల తరఫున వాదనను బలంగా వినిపించామన్నారు. ప్రజా సమస్యలను, ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లామని చెప్పారు. హామీల ఎగవేతను బాకీ కార్డుల రూపంలో ప్రధాన చర్చనీయాంశంగా చేయగలిగామన్నారు. ఇది బిఆర్ఎస్ సాధించిన విజయమని చెప్పారు.

## శిరసావహిస్తాం (మొదటి పేజీ తరువాయి)

కిషన్ రెడ్డి చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ఓటమిని విశ్లేషించుకుంటామన్నారు. పాతబస్తీలో కూడా ఏ పార్టీ గెలవదన్నారు. ఎంఐఎం సహకరించడం వల్లే కాంగ్రెస్ పార్టీ గెలిచిందని తెలిపారు. రేవంత్ రెడ్డి ఏం చేశాడని అనుకూలంగా ఆయనకు ఓటేయాలని ప్రశ్నించారు. రెండు పార్టీలు కూడా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదని ఆరోపించారు. దీనిపై తాము ఫిర్యాదు చేస్తామన్నారు. జిహెచ్ఎంసి ఎన్నికలపై దృష్టిపెట్టామని, జిహెచ్ఎంసి మేయర్ పదవి గెలుచుకోవడమే తమ లక్ష్యమని కిషన్ రెడ్డి తెలిపారు.

**జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ కాదు.. ఎంఐఎం అభ్యర్థిగా గెలిచినట్లు భావిస్తాం : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు**

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కాకుండా, ఎంఐఎం అభ్యర్థి గెలిచినట్లుగా భావిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. నాంపల్లి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో బిజెపి ఎప్పుడూ గెలవలేదన్నారు. ఈసారి తమకు ఓట్లు భారీగా పెరిగాయని తెలిపారు. ఎచ్చే ఎన్నికల్లో తప్పకుండా సత్తా చాటుతామన్నారు. జూబ్లీహిల్స్‌లో బిజెపికి ఓటు వేసిన ప్రజలకు, పార్టీ కోసం కృషి చేసిన కార్యకర్తలకు రాంచందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో పోలింగ్ నుంచి ఓట్ల లెక్కింపు వరకు అధికార కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. బిహార్‌లో ఎన్‌డిఎ కూటమి ఘన విజయం సాధించిందన్నారు. బిహార్ ఫలితాలు భవిష్యత్‌లో దేశమంతా వచ్చే ఫలితాలకు నిదర్శనమని చెప్పారు. బిహార్‌లో కాంగ్రెస్ కంటే ఎంఐఎం పార్టీకే ఎక్కువ సీట్లు వచ్చాయన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే బాగుంటుదని దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తామని దీమా వ్యక్తం చేశారు.

## అబద్ధాల బిఆర్ఎస్, మతోన్మాద బిజెపి ఓటమి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ




ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటర్లు అబద్దాల బిఆర్ఎస్‌ను మతోన్మాద బిజెపిని ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం శుక్రవారం హిమాయత్ నగర్ లో మహమ్మద్ సలీం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇటి నరసింహ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో హోరాహోరీగా రాజకీయ పార్టీలు ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కెటిఆర్ అహంకార పూరితంగా వ్యక్తిగత దూషణలు దిగాడమే కాకుండా పచ్చి అబద్దాలను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ప్రయత్నం చేశారు. బిజెపి అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడకుండా మతోన్మాద రాజకీయాలను ప్రేరేపించి ఓట్లు రాబట్టుకోవాలని అనేక కుట్రలకు దిగారు. వీటన్నిటిని పక్కన పెట్టి వారికి గుణపాఠం చెప్పే విధంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ప్రజలు తమ ఓటు ద్వారా పట్టం కట్టడాన్ని స్వాగతిస్తున్నామని, జూబ్లీహిల్స్ ప్రజల పోరాటాన్ని అభినందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను నెరవేరుస్తూ పచ్చి అవకాశవాద రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే వారికి అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉన్నదని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ప్రజలు ఎటువంటి భ్రమలకు లోను కాకుండా తమ కోసం పనిచేసే నాయకుడుగా ఉన్న నవీన్ యాదవ్ కి ఓటు వేసి అత్యధిక మెజార్టీలో గెలిపించడం తెలంగాణ రాజకీయాల్లో శుభ సూచికమని తెలిపారు. ఈ ఉప ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించడం కోసం సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ చేసిన కృషిని అభినందించారు.

ఈ సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, ఎం.నరసింహ చంద్ర మోహన్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, సలీం ఖాన్, శంషుద్దీన్, ఉమర్ ఖాన్, కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్ మహమూద్, వెంకటయ్య, గ్యార నరేష్, చైతన్యలు హాజరయ్యారు.

## అవమానిస్తున్నారు!


(మొదటి పేజీ తరువాయి)

దార్శనికత మన మనస్సాక్షికి స్ఫూర్తినిస్తూనే ఉందని, మన సమష్టి చర్యలను రూపొందిస్తోందన్నారు. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ నెహ్రూ తన దార్శనిక, నిర్భయ నాయకత్వం ద్వారా స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలకు పునాది వేశారని, దేశానికి కొత్త దిశానిర్దేశం చేశారని అన్నారు. ఆయన ఆదర్శాలు, విలువలు నేటికీ మనకు స్ఫూర్తిదాయకంగా కొనసాగుతున్నాయని చెప్పారు. నెహ్రూ జీ జయంతి సందర్భంగా 'హింద్ కే జవహర్'కు గౌరవపూర్వక వందనాలు' అని గాంధీ ఎక్స్‌లో హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. రమేష్ నెహ్రూ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తీవ్రంగా మండిపడ్డారు. నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించే వ్యక్తి 136వ జయంతి అని, అయితే ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఆయన అపారమైన సహకారాన్ని ప్రస్తుత ప్రధానమంత్రి, ఆయన బృందం తిరస్కరించాలని, అవమానించాలని, వక్రీకరించాలని, రాక్షసంగా చూపించాలని చూస్తున్నారని మండిపడ్డారు. నెహ్రూ తన వారసత్వం, విజయాలపై ఈ దాడి నుండి బయటపడాలని ఎక్స్‌లో వెల్లడించారు. 20వ శతాబ్దపు చరిత్ర నుండి ఆయనను తొలగించాలని నిశ్చయించుకున్న వారు తమ స్వంత లోతైన అభద్రతాభావాలను, సంక్లిష్టతలను ప్రతిబింబిస్తున్నారన్నారు. 'నవంబర్ 14, 1949న ఆయన 60 ఏళ్లు నిండినప్పుడు, రాజాజీ, సర్దార్ పటేల్ పరిచయాలతో కూడిన భారీ, అత్యంత పాండిత్యవంతమైన అభినందన గ్రంథాన్ని ఆయనకు అందించారు. ఇది ఇప్పటికీ స్ఫూర్తిదాయకమైన పఠనానికి ఉపయోగపడుతుంది. జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఫండ్ http://nehruarchive.in ప్రతిష్టాత్మక డిజిటల్ ఆర్కైవ్ మొదటి దశ రానున్న కొద్ది రోజుల్లో అతి త్వరలో ప్రత్యక్ష ప్రసారం కానుందని, ఇది ఒక గొప్ప ప్రారంభం అవుతుందన్నారు.

కాగా, 'పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయనకు హృదయపూర్వక నివాళులు! ఆధునిక భారతదేశ దార్శనిక శిల్పి, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం యొక్క ఆదర్శాలు దేశాన్ని అభివృద్ధి, సాంకేతిక పురోగతి వైపు నడిపిస్తూనే ఉన్నాయి. ఆయన వారసత్వం మనకు మార్గదర్శక కాంతిగా మిగిలిపోయింది' అని కాంగ్రెస్ తన అధికారిక హ్యాండిల్ ద్వారా పేర్కొంది.

## జయకేతనం

(మొదటి పేజీ తరువాయి)



అత్యంత కట్టుదిట్టమైన భద్రతాచర్యల మధ్య చేపట్టింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కు ఆధిక్యం లభించింది. మొత్తం 101 పోస్టల్ ఓట్లు. 96 ఓట్లు చెల్లుబాటు కాగా, కాంగ్రెస్ 43, బిఆర్ఎస్ 25, బిజెపి 20 ఓట్లు పోలయ్యాయి. తొలి రౌండ్ ఓట్ల లెక్కింపులో నవీన్ యాదవ్ 8,911 ఓట్లు సాధిస్తే, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 8,864 ఓట్లు వచ్చాయి. బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి 2,167 ఓట్లు వచ్చాయి. మొత్తంగా తొలి రౌండ్ ముగిసేసరికి కాంగ్రెస్ అభ్యర్థికి 47 ఓట్ల ఆధిక్యం లభించింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తొమ్మిది రౌండ్‌లలో అత్యధిక ఆధిక్యంతో దూసుకుపోయారు. కౌంటింగ్ మొత్తం కాంగ్రెస్‌కు అనుకూలంగా సాగింది. ఒక్క రౌండ్‌లో కూడా బిఆర్ఎస్‌కు ఆధిక్యం రాలేదు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 7 డివిజన్‌లలో కాంగ్రెస్ పార్టీనే పైచేయి సాధించింది. ఒక్క షేక్‌పేట్ డివిజన్‌లో మాత్రమే కాస్త పోటీ కనిపించింది. మిగిలిన అన్ని డివిజన్లలో ఏకపక్షంగా సాగిపోయింది. అన్ని డివిజన్ల ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారు. మొత్తం 7 డివిజన్‌ల ఓట్లను 10 రౌండ్‌లలో లెక్కించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఈసారి కాంగ్రెస్ అత్యధిక మెజారిటీని సాధించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు ఉప ఎన్నికల్లోనూ, కంటోన్మెంట్ (2024), ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లలో వరుస విజయాలు సాధించడంతో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

**విజేత నవీన్ యాదవ్‌కు ధ్రువీకరణపత్రం అందచేసిన రిటర్నింగ్ అధికారి సాయిరాం**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించారు. ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఎంపికైనట్లు రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం ప్రకటించారు. విజేతకు రిటర్నింగ్ అధికారి గెలుపునకు సంబంధించిన ధృవీకరణపత్రం అందజేశారు. నగరంలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసింది. రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో సాగిన లెక్కింపు ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పర్యవేక్షించారు. అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, జోనల్ కమిషనర్లు అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావులు సజావుగా జరిగేలా సమన్వయం చేశారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించారు. 10 రౌండ్‌లలో ముగించారు.

**సరికొత్త రికార్డు సృష్టించిన నవీన్ యాదవ్**

ఈ విజయంతో నవీన్ యాదవ్ నయా రికార్డ్ సృష్టించారు. జూబ్లీహిల్స్ నియోజవర్గంలో ఇప్పటివరకు అత్యధిక మెజార్టీ పిజెఆర్ కుమారుడు విష్ణు పేరిట(2009లో 21,741) ఉంది. మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ 2014లో 9,242, 2018లో 16,004, 2023లో 16,337 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తాజాగా జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,658 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా రికార్డ్ సృష్టించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పలు పార్టీలు, ఇండిపెండెంట్లుగా 55 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో 13 మందికి త్రీ డిజిట్ ఓట్లు రాగా, ఒకరికి సింగిల్ డిజిట్ ఓట్లు పోలయ్యాయి. మిగతా వారికి డబుల్ డిజిట్‌లో ఓట్లు వచ్చాయి. వీరందరికంటే నోటాకే అధిక ఓట్లు రావడం విశేషం. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిల తర్వాత నోటాకే అధిక ఓట్లు రాగా, వాటిలో రెండు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా ఉన్నాయి. ఎన్నికల విధుల్లో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు అవకాశం ఉంటుంది. అంటే విధుల్లో ఉన్న అధికారుల్లో ఇద్దరు నోటాకు ఓటేసినట్లు వెల్లడైంది. 924 మంది ఓటర్లకు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అభ్యర్థులెవరూ నచ్చకపోవడంతో నోటాకు జై కొట్టారు.

**భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు పాదాభివందనం : వల్లాల నవీన్ యాదవ్**

భారీ మెజారిటీతో గెలిపించిన జూబ్లీహిల్స్ ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. తనని నమ్మి ఓటు వేసిన అందరికీ నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ కార్యకర్తలు ఎంతో కష్టపడి తనను గెలిపించుకున్నారన్నారు. తనపై, తన కుటుంబంపై వ్యక్తిత్వంపై దెబ్బతీస్తూ ఓట్లు అడిగారని, జూబ్లీహిల్స్ ప్రజలు గట్టి సమాధానం ఇచ్చారని అన్నారు. పదేళ్లలో బిఆర్ఎస్ చేసిందేమీ లేకనే ప్రచారంలో చెప్పుకోలేదని అన్నారు. కేవలం తన గురించి దుష్ప్రచారం చేసి గెలవాలని బిఆర్ఎస్ చూసిందని ఆరోపించారు. రిగ్గింగ్, దౌర్జన్యం అనేవి తప్పుడు మాటలన్నారు. బెదిరిస్తే ప్రజలు ఓటు వేసే రోజులు ఎప్పుడో పోయాయని, ఎన్నికల్లో రిగ్గింగ్ రోజులు ఎప్పుడో పోయాయన్నారు. బిఆర్ఎస్ గెలిచిన సమయంలో కక్ష పూరిత రాజకీయాలు చేశారని, తాను అలాంటి రాజకీయాలు చేయనని అన్నారు. ఈ ప్రాంత సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తా అన్నారు. అభివృద్దే తన ఎజెండా అని అన్నారు. అందరిని కలుపుకొని పని చేసి జూబ్లీహిల్స్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని నవీన్ యాదవ్ అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com